
రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 226 | బుధవారం | 16-07-2025 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఫ్యూచర్ సిటీ గేమ్ చేంజర్

'లెర్న్, అన్‌లెర్న్, రీ లెర్న్.. ఇదే సక్సెస్ మంత్రం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు బిజెపి చీఫ్ లీగల్ నోటీసులు

లోపలి పేజీల్లో




## గవర్నర్ వద్దకు పంచాయతీరాజ్ చట్టసవరణ ఆర్డినెన్స్ ముసాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్

పంచాయతీ రాజ్ చట్టం2018 లోని సెక్షన్ 285(ఎ)ను సవరిస్తూ ప్రభుత్వం రూపొందించిన 'ఆర్డినెన్స్ ముసాయిదా' గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం నిమిత్తం మంగళవారం రాజ్‌భవన్‌కు చేరినట్టు సమాచారం. స్థానిక సంస్థ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, అందుకు పంచాయతీరాజ్ చట్టం 2018లోని 'సెక్షన్ 285 ఎ' సవరించాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే పంచాయతీరాజ్ శాఖ పంచాయతీరాజ్ చట్టం 2018ను సవరించి ముసాయిదాను సిద్ధం చేసింది. ఈ చట్టంలోని సెక్షన్ 285ఎ ప్రకారం స్థానిక సంస్థలల్లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంటుంది. దీంతో 'సెక్షన్ 285 ఎ' పదాన్ని సవరించాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. ఆర్డినెన్స్ ముసాయిదాకు గవర్నర్ ఆమోదం లభించగానే చట్ట సవరణ **తరువాయి 12లో**

## హైదరాబాద్‌లో సిపిఐ నేత
# చందు దారుణ హత్య

- మార్నింగ్‌వాక్ చేస్తుండగా కళ్లల్లో కారం చల్లి కాల్పులు జరిపిన దుండగులు
- పార్క్ దగ్గరే ప్రాణం విడిచిన చందు రాథోడ్
- కాల్పులకు క్షణం ముందే హత్యకు పాల్పడిన వారిని చూసిన హతుడి భార్య, కూతురు
- సిసిటివీలో దుండగుల కారు గుర్తింపు
- సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలే కాల్పులు జరిపారని హతుడి భార్య ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు




ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో మార్నింగ్ వాకింగ్ చేస్తున్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ (45)ను దుండగులు మంగళవారం ఉదయం అత్యంత దారుణంగా హతమార్చారు. ప్రమాదాన్ని పసిగట్టి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆయన కళ్లల్లో కారం చల్లడంతో అక్కడే పడిపోయాడు. ఆ తరువాత రివాల్వర్‌తో చందు ఛాతీపై దుండగులు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారు. మరో రెండు రౌండ్లు పార్క్‌లో కాల్పులు జరిపి అక్కడి నుంచి కారులో పరారయ్యారు. శాలివాహననగర్ పార్క్ వద్ద ఈ సంఘటన జరిగింది. ఘటనకు కొద్ది సేపటి ముందే చందు భార్య, కుమార్తె వాకింగ్ ముగించుకుని పార్క్ నుండి వెళ్ళిపోయారు. హత్య విషయం తెలియగానే వారిరువురూ ఘటనా స్థలానికి చేరుకునే సరికే చందు అప్పటికే రక్తపు మడుగులో విగతజీవిగా ఉన్నాడు. సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ జోన్ మండల డిసిపి చైతన్య, అదనపు డిసిపి శ్రీకాంత్, ఎసిపిలు సుబ్బరామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్‌లతో పాటు క్లూస్ టీమ్ బృందం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. చందు భౌతికకాయాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై చందు భార్య కేతావత్ నారీభాయ్ మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని బృందావన్ కాలనీలో నివాసముంటున్న తాము ఉదయం 7 గంటలకు తన భర్త చందు, కూతురితో కలిసి వేర్వేరు ద్విచక్ర వాహనాలపై శాలివాహన నగర్ పార్క్‌లో రోజు మాదిరిగానే వాకింగ్ **తరువాయి 2లో**

### దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

దుర్మార్గులెవరైనా సరే వారిని గుర్తించాలి : కూనంనేని సాంబశివరావు

06



నేడు ఢిల్లీలో జలశక్తి మంత్రితో తెలంగాణ, ఎపి సిఎంల భేటీ

## బనకచర్ల ప్రాజెక్టుపై
# చర్చ వద్దే వద్దు


- వెంటనే ఎజెండాను సవరించాలని ఒకరోజు ముందే కేంద్రానికి తెలంగాణ లేఖ
- తెలుగు రాష్ట్రాల సిఎంల సమావేశంలో గోదావరి – బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చను వాయిదావేయాలి
- తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను ఎజెండాలో పొందుపరచాలి
- కేంద్ర జలశక్తి కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ, ఎపి రాష్ట్రాల మధ్య జల వివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ఈ నెల 16న (బుధవారం) ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశంలో 'బనకచర్ల–గోదావరి లింక్'ను ఎజెండాగా చేర్చడం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'బనకచర్ల'పై చర్చించాల్సిన అవసరం లేదని, వెంటనే ఎజెండాను సవరించాలని కేంద్ర జలశక్తి శాఖకు స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు కేంద్ర జలశక్తి కార్యదర్శికి లేఖ రాశారు. తెలంగాణ, ఎపి రెండు రాష్ట్రాల సిఎంల సమావేశంలో గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చను వాయిదా వేసి, తెలంగాణ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను ఎజెండాలో పొందుపర్చాలని విజ్ఞప్తి చేసింది. ఈ నెల 16న ఎపి, తెలంగాణ సిఎంలతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ సమావేశం కానున్నట్టు ఇరు రాష్ట్రాల సిఎం కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ **తరువాయి 2లో**

### బనకచర్లతో ప్రజాధనం వృథా



గోదావరిలో వరద జలాలే లేవు : శ్రీరామ్ వెదిరె

03



## కాళేశ్వరం ప్రాజెక్ట్ రిటైర్డ్ ఇఐసి మురళీధర్‌రావు అరెస్టు

- పదిచోట్ల మురళీధర్‌రావు ఇంటితో పాటు అతని బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఎసిబి సోదాలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం
- కుమారుడి పేరుతో భారీగా సబ్ కాంట్రాక్ట్ పనులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు కాళేశ్వరం ప్రాజెక్ట్ రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురధర్‌రావును అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎసిబి అదనపు డిజి విజయ్‌కుమార్ మీడియాకు వెల్లడించారు.విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎసిబి అధికారులు మంగళవారం ఉదయం 5 గంటలకు హైదరాబాద్‌లోని మురళీధర్‌రావు ఇంటితో పాటు అతని బంధువులు, స్నేహితలకు చెందిన పది ప్రాంతాలలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలు రాత్రి 8 గంటలకు వరకు కొనసాగాయి. ఈ సోదాలలో ఎసిబి అధికారుల దిమ్మతిరిగేలా ఆస్తులు బయటపడ్డాయి. దీంతో పాటు కీలక డాక్యుమెంట్లను కూడా ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మురళీధర్‌రావు విధులు నిర్వహిస్తున్న సమయంలో తన కుమారుడి పేరుతో సబ్ కాంట్రాక్టర్లు **తరువాయి 2లో**

## దివి నుండి
# భువికి శుభాంశు

- ఐఎస్ఎస్‌లో 18 రోజులు గడిపిన తొలి భారతీయుడుగా రికార్డు
- 'యాక్సియం – 4' విజయవంతం
- భారత గగనయాన నవశకానికి నాంది



**న్యూఢిల్లీ :** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా దివి నుండి భువికి సురక్షితంగా తిరిగి వచ్చారు. భవిష్యత్తులో మానవసహిత స్వదేశీ గగనయాన నవశకానికి నాంది పలికేందుకు అనేక అనుభవాలు మూటకట్టుకొచ్చారు. సోమవారం మధ్యాహ్నం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐ ఎస్ ఎస్)లో ఆలింగనాలు, కరచాలనాలు, భావోద్వేగాల మధ్య తోటి వ్యోమగాములకు వీడ్కోలు పలికిన శుక్లా బృందం భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు డ్రాగన్ వ్యోమనౌక కాలిఫోర్నియాలోని శాండియాగో తీర సమీప పసిఫిక్ జలాల్లో దిగింది. వెంటనే నలుగురు వ్యోమగాములను నావికులు బయటకు తీసుకువచ్చారు. ఖచ్చితంగా చెప్పాలంటే భూగోళానికి రెండోవైపు స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 2.31 (పసిఫిక్ టైమ్) గంటలకు భారతీయుల కేరింతలు, చిరునవ్వులు, శుభాభినందనలమధ్య శుక్లా భూమికి చేరుకున్నారు. భార రహిత స్థితిలో 18 రోజులపాటు అంతరిక్ష కేంద్రంలో గడపిన వ్యోమగాములు తిరిగి భూమ్యాకర్షణశక్తికి అలవాటుపడాల్సి ఉంది. శుక్లాతోపాటు నాసా వ్యోమగామి, యాక్సియం–4 మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్, మిషన్ స్పెషలిస్టులు స్లావోజ్ ఉజ్నాన్స్కీ–విస్నియెస్కీ (పోలాండ్), టిబు కపు (హంగేరీ) సంపూర్ణ ఆరోగ్యం పొందేవరకూ ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో ఉంచేందుకు ఏకాంతవాసాలకు తరలించారు. దీంతో 41 సంవత్సరాల తర్వాత రెండో భారత వ్యోమగామి,ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో గ్రూప్ కెప్టెన్ శుక్లా విజయవంతంగా రోదసీయాత్ర పూర్తి చేసినట్లయింది. 1984లో రాకేశ్ శర్మ సోవియట్ రష్యన్ మిషన్‌లో భాగంగా రోదసీలోకి వెళ్ళారు. కానీ ఐ ఎస్ ఎస్‌లో 18 రోజులు గడిపిన **తరువాయి 2లో**

## పొత్తు ధర్మం పాటిస్తూనే స్థానిక ఎన్నికల్లో
# అధిక స్థానాల్లో గెలవాలి



- కమ్యూనిస్టులంతా భేషజాలు వదిలేసి ఏకతాటిపైకి రావాలి
- నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయకుంటే జిల్లా దిగ్బంధం
- సిపిఐ శ్రేణులకు కూనంనేని సాంబశివరావు పిలుపు
- ఘనంగా సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభ

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి

వివిధ కారణాలతో విడిపోయిన కమ్యూనిస్టులంతా బేషజాలాలు వదిలేసి ఒక తాటిపైకి వస్తే దోపిడీ వర్గాల రాజ్యాన్ని కూల్చవచ్చు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. ఆగస్టు మాసంలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, ఈ ఎన్నికలలో కమ్యూనిస్టు అభ్యర్థులు అధిక స్థానాలలో గెలిచేందుకు కృషి చేయాలని సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్‌తో కొనసాగుతున్న పొత్తు ధర్మాన్ని పాటించడంతోపాటు స్థానిక రాజకీయ పరిణామాలను పరిగణలోకి తీసుకొని ఎన్నికలలో పోటీ చేయాలని సూచించారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేయకుంటే జిల్లా దిగ్బంధం చేసేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభ దేవరకొండ పట్టణంలోని అమరజీవి మందడి నర్సింహా రెడ్డి ప్రాంగణం (సాయి రమ్య ఫంక్షన్ హాల్)లో నిర్వహించారు. తొలుత సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట రెడ్డి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహాసభలో కూనంనేని సాంబశివరావు ప్రసంగిస్తూ దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపుతుంటే ప్రశ్నించింది సిపిఐ మాత్రమేనని, అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి కగార్ ఆపరేషన్ ఆపాలని నిలదీసిందని తెలిపారు. రాష్ట్రంలో పదేళ్ళు నియంతృత పోకడ అవలంభించిన కెసిఆర్‌ను మూడోసారి అధికారంలోకి రాకుండా ఓడించడంలో **తరువాయి 12లో**



## కేరళ నర్సు నిమిషప్రియ 'ఉరిశిక్ష' వాయిదా!

- ఈనెల 16న ఉరిశిక్షను అమలుచేయాలని గతంలో యెమెన్ కోర్టు తీర్పు
- వాయిదాతో వీడిన ఉత్కంఠ, నిమిషకు కాస్త ఊరట

**న్యూఢిల్లీ :** యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియకు కాస్త ఊరట లభించింది. భారతీయురాలైన కేరళ నర్సు నిమిష ప్రియకు యెమెన్‌లో విధించబడిన మరణశిక్షను అక్కడి అధికారులు వాయిదావేశారని మంగళవారం ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. జులై 16న (బుధవారం) ఉరిశిక్ష అమలు చేయాలని యెమెన్‌లో నిర్ణయం జరిగిన విషయం తెలిసిందే. నిమిషప్రియ స్వస్థలం కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లాలోని కొల్లెంగోడ్. యెమెన్‌లో 2017జులైలో యెమెన్ పౌరుడైన ఆమె వ్యాపార భాగస్వామి హత్యకేసులో ఆమె అపరాధానికి పాల్పడిందని యెమెన్ న్యాయస్థానం నిర్ధారించింది. జులై 16న అమలు జరగాల్సిన ఉరిశిక్షను యెమెన్‌లోని స్థానిక అధికారులు వాయిదా వేసినట్లు తాజాగా ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ఇతర పక్షంతో పరస్పరం అంగీకరించే పరిష్కారాన్ని చేరుకోవడానికి **తరువాయి 2లో**

## కాంగ్రెస్ యువనేతపై కాల్పులు

హత్యకు గురైన మరెల్లి అనిల్ కుమార్

మెదక్ జిల్లా కొల్చారం మండలంలో ఘటన

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి



కాంగ్రెస్ యువ నేత మృతిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలంలో చోటు చేసుకుంది. సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని గాంధీభవన్ వెళ్లి సాయంత్రం తిరిగి తన స్వగ్రామమైన పైతరకు కారులో వెళ్తుండగా మరెల్లి అనిల్ (28)పై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. ఒక పథకం ప్రకారం రెక్కీ నిర్వహించి రెండు కార్లలో హైదరాబాద్ నుంచి వెంబడించి వరిగుంతం విద్యుత్ ఉప కేంద్రం వద్ద అనిల్ ప్రయాణిస్తున్న కారును అడ్డగించి ఆయనపై నాలుగు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సిసిటివిల్లో రికార్డు అయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మరెల్లి అనిల్ అక్కడి కక్కడే స్పృహ కోల్పోయాడు. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ఎమ్మెల్యే సన్నిహితులతో భూ తగాదాల కారణంగానే హత్య జరిగి ఉంటుందని పోలీసులు **తరువాయి 2లో**

## చీఫ్ జస్టిస్ బెంచ్‌కి ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల కేసు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన పలు వ్యాజ్యాలపై విచారణ ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్‌కు చేరింది. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపు అంశంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తులు ఇద్దరు సింగిల్ జడ్జిల ఏక సభ్య ధర్మాసనాలు వేరువేరు నిర్ణయాలు వెలువరించాయి. దీంతో ఈ వ్యాజ్యాలను చీఫ్ జస్టిస్ బెంచ్ ఎదుట ఉంచాలని జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ పిటిషన్‌లో ఫీజు పెంపునకు జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల అనుమతిచ్చారు. మరో న్యాయమూర్తి **తరువాయి 12లో**

## ప్రపంచ దేశాలతో పోటీ

- పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సంపూర్ణ సహకారం
- ఇప్పటి వరకు రూ. 3 లక్షల 28 వేల కోట్ల పెట్టుబడులు సాధించాం
- ప్రపంచానికే ఎగుమతులు చేసిన ఘనత జోనోమ్ వ్యాలీ పరిశ్రమలది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి

రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని, దీని కోసం పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కోరారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను తీసుకొని వచ్చే దిశగా కృషి చేస్తూ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సరళీకృతమైన **తరువాయి 2లో**



# ప్రపంచం
WORLD NEWS

## బంగ్లాదేశ్‌లో 34మంది భారత జాలర్ల అరెస్టు

**ఢాకా:** భారత్‌కు చెందిన 34 మంది జాలర్లను బంగ్లాదేశ్ అధికారులు అరెస్టు చేశారు. హిందూమహాసముద్రంలో తమ జలాలలోకి ప్రవేశించి అక్రమంగా చేపలవేట చేస్తున్నారన్న ఆరోపణలపై వారిని అరెస్టు చేసినట్లు బంగ్లాదేశ్ నావికాదళాధికారులు చెప్పారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక ఈ అరెస్టులు జరిగాయి.దీంతోపాటు భారత జాలర్లకు చెందిన రెండు బోట్లను కూడా వారు స్వాధీనం చేసుకున్నారు. హిందూమహాసముద్రంలో బంగ్లాదేశ్ లోతైన జలాల పరిధిలోకి ప్రవేశించిన భారత్‌కు చెందిన ఎఫ్‌బి ఝోర్, ఎఫ్‌బి మంగళ్ చండీ–38 బోట్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న జాలర్లను అరెస్టు చేశారు. ఆ బోట్ల నుండి అనేక జాతులకు చెందిన రకరకాల చేపలను స్వాధీనం చేసుకున్నారు. భారత జాలర్లను చట్టబద్ధంగా శిక్షించేందుకు మోంగ్లాకు తరలించామని మోంగ్లా ఉపజిల్లా మత్స్యశాఖాధికారిణి జహీదుల్ ఇస్లామ్ చెప్పారు. భారత జాలర్లు అక్రమంగా బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించడాన్ని, సాధారణ తనిఖీలు చేస్తుండగా తమ రాడార్లు భారత బోట్ల జాడలను పసిగట్టాయని ఆయన చెప్పారు.

# ఇక నాటో–రష్యా యుద్ధం?

### ట్రంప్ నాటకీయ హెచ్చరిక పట్టించుకోం : మెద్వెదేవ్

**మాస్కో:** వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నాటో సెక్రెటరీ జనరల్ మార్క్ రట్టే మధ్య సోమవారం కుదిరిన ఒప్పందం తర్వాత ఉక్రెయిన్‌లో యుద్ధం కొత్త మలుపు తీసుకోనున్నది. ఈ సమావేశంలో ట్రంప్ నాటోకూ పూర్తి మద్దతు తెలియజేశారు. ఇక మీదట అమెరికా నుండి నాటో ఆయుధాలు కొనుగోలు చేసి ఆ ఆయుధాలను శరవేగంగా ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తుంది. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం, యూరప్ దేశాలు–నాటో కూటమి రష్యాపై చేస్తున్న యుద్ధమేనని గడచిన మూడు సంవత్సరాలుగా పుతిన్ చెబుతున్నారు. యుద్ధం జరిగేది ఉక్రెయిన్‌లో, యుద్ధం చేసేది ఉక్రెయిన్ దళాలే, కానీ ఆయుధాలు సమకూర్చేది నాటో కూటమి, అవసరమైతే నాటో దళాలు కూడా రంగంలోకి దిగుతాయన్న విషయంపై ఇప్పుడిప్పుడే ప్రపంచానికి ఒక పూర్తి స్పష్టత వస్తున్నది.

నాటో సెక్రెటరీ జనరల్‌తో ట్రంప్ జరిపిన సమావేశంపై రష్యా మొదటిసారి స్పందించింది. యుద్ధ పరిష్కారంపై ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోబోమని రష్యా భద్రతామండలి డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రీ మెద్వెదేవ్ చెప్పారు. "రష్యాకు ట్రంప్ ఒక నాటకీయ హెచ్చరిక చేశారు. రష్యాలో ఆ పరిణామాలు ఊహించుకొని ప్రపంచం వణికిపోయింది, యుద్ధోన్మాద యూరప్ కూటమి నిరాశ చెందింది, కానీ రష్యా ఏంతమాత్రం పట్టించుకోదు" అని సోషల్ మీడియా ద్వారా మెద్వెదేవ్ తెలియజేశారు. ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేస్తుందని, వాటికి యూరప్ డబ్బులు చెల్లిస్తుందని ట్రంప్ ఆశతోనున్నారని అన్నారు. ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ మంగళవారంనాడు మాట్లాడుతూ, "పుతిన్‌తో నాలుగుసార్లు మాట్లాడాను, ఉక్రెయిన్‌పై నాలుగుసార్లు ఒప్పందం చేసుకున్నానని నేను భావించాను, కానీ ఆయన తర్వాత కీవ్‌లో నర్సింగ్ హోంపై దాడి చేశారు, ప్రతిసారీ అతని పట్ల నిరాశకు గురయ్యాను", కాని నా ప్రయత్నం కొనసాగిస్తాను అని అన్నారు. మీరు పుతిన్‌ను నమ్మారా? అని ప్రశ్నించగా సాధారణంగా నేను ఎవ్వరినీ నమ్మనన్నారు.




**ఉక్రెయిన్ కోసం నాటో ఆయుధ కొనుగోళ్లు**

పుతిన్ పగటిపూట తియ్య తియ్యగా మాట్లాడతారని, రాత్రిపూట మాత్రం తెల్లారేలోపు ఉక్రెయిన్‌పై బాంబుదాడులతో విరుచుకుపడుతుంటారని ట్రంప్ విమర్శించారు. ఆ తర్వాత నాటో సెక్రెటరీ జనరల్‌తో చర్చించాక రష్యాకు ఒక అల్టిమేటమ్ ఇచ్చారు. "ఉక్రెయిన్‌తో యుద్ధ సమస్య పరిష్కరించుకోవడానికి 50 రోజులు గడువు తీసుకోండి, లేదంటే దారుణమైన ఆంక్షలకు సిద్ధంగా ఉండండి, రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై కూడా 100 శాతం సుంకాలు విధిస్తాం" అని ట్రంప్ కటువైన హెచ్చరిక చేశారు. వాళ్ళమీద (రష్యా) తీవ్ర సుంకాలు విధిస్తాం అని రట్టేతో ట్రంప్ చెప్పారు. అదే విధంగా అమెరికా నుండి నాటో సైనిక కూటమి ఆయుధాలు కొనుగోలు చేసేందుకు ట్రంప్–మార్క్ రట్టే లమధ్య సమావేశం ఒక ఒప్పందానికి వీలు కల్పించింది. వీటిల్లో పేట్రియాట్ క్షిపణి విధ్వంసక బ్యాటరీలు కూడా ఉన్నాయి. ఈ ఆయుధాలు నాటో ద్వారా ఉక్రెయిన్‌కు సరఫరా అవుతాయి. కాగా, ట్రంప్ తమకు అనుకూలంగా మారడంపట్ల జెలెన్‌స్కీ హర్షం ప్రకటించారు. రష్యాతో యుద్ధం ముగిసే అవకాశాలు లేవన్న ఉద్దేశంతో, కార్యనిర్వహణా భారాన్ని తగ్గించుకునేందుకు ఉపప్రధాన మంత్రి యులియా స్విరిడెంకోను ప్రధానమంత్రి పదవిలో నియమించారు.

## మళ్ళీ సంక్షోభంలో నెతన్యాహూ ప్రభుత్వ కూటమి


### వైదొలగుతామని యుటిజె ప్రకటన



**టెల్‌అవీవ్:** ఈమధ్యే కుప్పకూలిపోయే సంక్షోభం నుండి గట్టెక్కిన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ప్రభుత్వకూటమి మళ్ళీ సమస్యల్లో పడింది. యునైటెడ్ తోరాహ్ జుడాయిజం (యుటిజె) పార్టీ కూటమి ప్రభుత్వం నుండి వైదొలగాలని నిర్ణయించుకుంది. యూదుమత సిద్ధాంత సంప్రదాయ సూత్రాలకు బలంగా కట్టుబడిన యుటిజె పార్టీ ప్రభుత్వం నుండి వైదొలగుతున్నట్లు ప్రకటించింది. తాజాగా మంగళవారం ఉదయం ఇద్దరు మంత్రులు రాజీనామాలు ప్రకటించారు. వారి రాజీనామాలు అమలులోకి రావడానికి 48 గంటలు గడువు ఉంది. సాంస్కృతిక శాఖ సహాయమంత్రి యాకోవ్ టెస్లర్, జెరూసలెం వ్యవహారాలమంత్రి మైర్ పురుష్ రాజీనామా చేశారు. అదేవిధంగా మరో ఛాంధసవాద షా పార్టీ కూడా కూటమి నుండి వైదొలగేందుకు యుటిజె బాటలోనే ఉంది. వెంటనే వైదొలగే ప్రకటన చేయకుండా ఎదురు చూస్తున్నది. గాజాలో యుద్ధం కీలక దశ, సిరియాలో డ్రూజ్ నగరంలో దాడులు జరుగుతున్న తరుణం,నిరాశా జనకంగా ఉన్నప్పటికీ దోహాలో హమాస్ వర్గంతో చర్చలు ఇంకా కొనసాగుతున్న సమయంలో యుటిజె ఈ నిర్ణయం తీసుకోవడంతో నెతన్యాహూ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఈ యుటిజెలో రెండు బీకర వర్గాలున్నాయి. ఈ రెండు వర్గాలూ ప్రభుత్వ వైఖరిపట్ల మండిపడుతున్నాయి. సైన్యంలో తమ వర్గం వారిని చేర్చకుండా మినహాయింపులు ఇవ్వాలన్న విషయంపై యుటిజె వర్గాల డిమాండ్లు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. దీనికి సంబంధించిన బిల్లుతో యుటిజె విభేదిస్తున్నది. ఈ సమస్య దీర్ఘకాలంగా ఇజ్రాయెల్‌లో యూదులను రెండుగా విడదీస్తున్నది. గాజాలో యుద్ధం మొదలైనప్పటినుండీ ఈ సమస్య ఉద్ధృతరూపం తీసుకుంది. ఇజ్రాయెల్ రాజకీయాలలో కింగ్ మేకర్‌గా ఉన్న ఈ యుటిజె పార్టీవల్ల తక్షణం నెతన్యాహూకు ప్రమాదం లేదు.

## నాటోకు ఆయుధాలపై 'మాగా' కన్జర్వేటివ్‌ల ఆగ్రహం



**వాషింగ్టన్ :** నాటో కూటమికి ఆయుధాలు విక్రయించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్టేతో ఒప్పందం చేసుకోవడంతో ''మాగా'' తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ''మాగా'' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) టీమ్‌లోని కొందరు కన్జర్వేటివ్‌లు ట్రంప్‌పై మండిపడుతున్నారు. ప్రపంచదేశాల్లో ఎక్కడ యుద్ధం జరిగినా జోక్యం చేసుకోబోమని, ఆయుధాలు సరఫరా చేసేదిలేదని ఎన్నికల్లో ట్రంప్ ఇచ్చిన వాగ్దానాలకు ఇది చాలా భిన్నంగా ఉందని కొందరు కన్జర్వేటివ్‌లు ఆగ్రహించారు. ప్రపంచంలో ఎక్కడైనాగానీ యుద్ధాలను ఆపేసి శాంతి సాధించాలన్న వాగ్దానాలకు భిన్నంగా ట్రంప్ యుద్ధాలలో జోక్యం చేసుకునే చర్యలకు పాల్పడుతున్నారని, ఇది '' మాగా'' ప్రణాళికకు, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు పూర్తి విరుద్ధమైన చర్యలని వారు విమర్శిస్తున్నారు. రిపబ్లికన్‌పార్టీకి చెందిన దిగువ సభ సభ్యురాలు మార్జోరీ గ్రీన్, ట్రంప్ వద్ద గతంలో వ్యూహకర్తగా పనిచేసిన స్టీవ్ బన్నన్‌లు ప్రధాన విమర్శకులుగా ఉన్నారు. కానీ వీరిద్దరూ ట్రంప్‌కు ఇప్పటి వరకూ అత్యంత విధేయులు. విదేశీ యుద్ధాల్లో అమెరికా జోక్యం చేసుకుంటుంటే తాము ఓటర్లకు ఏం చెప్పాలని వారు ప్రశ్నించారు. నాటో ద్వారా ఉక్రేన్‌కు ఆయుధాలు పంపుతానని ట్రంప్ సోమవారంనాడు మార్క్ రట్టేతో సమావేశంలో చెప్పారు. 50 రోజుల్లో ఉక్రేన్‌తో యుద్ధ సమస్యను పరిష్కరించుకోకపోతే రష్యాపై నూరూశాతం సుంకాలు, కఠిన ఆంక్షలు విధిస్తామని కూడా ఆయన హెచ్చరించారు.ఐతే అమెరికా ఊరికే ఆయుధాలు సరఫరా చేయడం లేదని, యూరప్ అందుకు తగిన సొమ్ము చెల్లిస్తుందని ట్రంప్ చెబుతున్నారు.

## సిరియా ప్రభుత్వ దళాలపై ఇజ్రాయెల్ సైన్యం బాంబుదాడులు

**బుస్రా–అల్‌హరిర్ :** దక్షిణ సిరియాలో డ్రూజ్ నగరంలోకి దూసుకువెళుతున్న సిరియా ప్రభుత్వ దళాలపై ఇజ్రాయెల్ ఐడిఎఫ్ మంగళవారంనాడు దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేకమంది మరణించారు. రెండు తెగలమధ్య జరిగిన ఘర్షణలో 30 మంది మరణించారు. సువైదా రాష్ట్రంలో సున్నీ బెడౌయిన్ గిరిజన తెగల యోధులు, సిరియా ప్రభుత్వ దళాలు డ్రూజ్ మిలీషియాతో చేస్తున్న యుద్ధాన్ని ఆపేందుకే దాడులు చేసినట్లు ఐడిఎఫ్ చెప్పింది. ఈ ఏడాది మే నెలలో కూడా డమాస్కస్ సమీపంలో డ్రూజ్ మైనారిటీ మతస్థులకు, ఇస్లామిస్ట్ తెగల గ్రూపులకు, భద్రతా బలగాలకుమధ్య హింసాత్మక ఘర్షణ చెలరేగింది. డ్రూజ్ తెగల ప్రజలను కాపాడేందుకు తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. శాంతిని పునరుద్ధరించేందుకు సోమవారం ఈ ప్రాంతానికి వెళ్ళిన ప్రభుత్వ దళాలు కూడా డ్రూజ్ తెగలతో ఘర్షణకు దిగాయని ఐడిఎఫ్ తెలిపింది.డ్రూజ్ వ్యాపారిని డమాస్కస్ జాతీయ రహదారిపై కిడ్నాప్ చేసిన రెండు రోజుల తర్వాత ఈనెల 13న ఈ ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో 30 మంది మరణించారు. 100 మంది గాయపడ్డారు. ఇప్పుడు మంగళవారం ఘర్షణల్లో కూడా అనేకమంది మరణించారు. బ్రిటన్ కేంద్రంగా పనిచేసే మానవహక్కుల సిరియా పరిశీలనాసంస్థ అంచనా ప్రకారం ఈ దాడుల్లో 99 మంది మరణించారు. గతేడాది డిసెంబరులో ఇస్లామిస్ట్ తిరుగుబాటుదారులు సిరియాలో అల్ బషీర్ ప్రభుత్వాన్ని కూలదోసిన తర్వాత జరిగిన మొట్టమొదటి అతిపెద్ద అంతర్గత సంఘర్షణ ఇదే. దీనిని అత్యంత ప్రమాదకరమైన పరిణామంగా హోం మంత్రిత్వశాఖ పేర్కొంది.

## భువికి శుభాంశు
(మొదటి పేజీ తరువాయి)

మొట్టమొదటి భారత వ్యోమగామిగా శుక్లా సరికొత్త చరిత్ర లిఖించారు. ఈ నలుగురు వ్యోమగాములూ 60 ప్రయోగాలు చేశారు. శుక్లా 30 ప్రయోగాల్లో పాల్గొన్నారు. రోదసీలో మానవ జీర్ణ వ్యవస్థ లో ఎలా పనిచేస్తుందో తెలిసేందుకు ఒక వీడియోను శుక్లా తయారు చేశారు. నిర్దేశించిన ప్రకారం నీటిపీనుగు గురించి ప్రయోగాలు చేశారు. రోదసీలో మానవ కండరాల మార్పులపై ప్రయోగాలు చేశారు. మెంతులు, పెసలు విత్తనాలను మొలకెత్తించారు. బాక్టీరియాలపై ప్రయోగాలు చేశారు.

డ్రాగన్ వ్యోమనౌక గంటకు 28,000 కి.మీ వేగంతో 22.30 గంటలు ప్రయాణం చేసి యాక్సియం–4 సిబ్బందిని సురక్షితంగా తీసుకువచ్చింది. రోదసీలోంచి భూవాతావరణంలోకి ప్రవేశించగానే వ్యోమనౌక ఉపరితలం 1600 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను ఎదుర్కొంది. బాహ్యాపొరలన్నీ ఆ ఉష్ణోగ్రతను స్వీకరించి లోనికి ప్రవేశించకుండా తట్టుకుని నిలబడ్డాయి. రోదసీ నుండి భూవాతావరణంలోకి ప్రవేశించే ఈ కీలక సమయాన్ని వ్యోమగాములు దాటి వచ్చాక భూమికి 5.7 కిలోమీటర్ల దూరంలో ఉండగా మొదటి పారాచ్యూట్ తెరచుకుంది. రెండు కి.మీ దూరానికి రాగానే రెండో పారాచూట్ తెరచుకుని వేగాన్ని క్రమంగా తగ్గించాయి.

**రోదసీ అన్వేషణలో మరో మైలురాయి : ముర్ము**

శుభాంశు శుక్లా యాత్ర రోదసీ అన్వేషణలో మరో మైలురాయిగా నిలుస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. విజయవంతంగా రోదసీయాత్ర పూర్తి చేసి భూమికి చేరుకున్న శుక్లాకు ఆమె ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. యాక్సియం–4 మిషన్ ద్వారా రోదసీయాత్ర పూర్తిచేసి వచ్చిన నలుగురు వ్యోమగాములకూ ఆమె అభినందనలు తెలియజేశారు. 39 ఏళ్ళ వయసుగల శుక్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అధికారి, టెస్ట్ పైలట్. 2000 గంటలు విమానం నడిపిన అనుభవజ్ఞుడు. ఐ ఎస్ ఎస్‌కు వెళ్ళి తొలి భారత వ్యోమగామిగా చరిత్ర సృష్టించారు.

**కోట్లాది భారతీయులకు ప్రేరణ : మోదీ**

శుభాంశు శుక్లా తన అంకితభావం, ధైర్యసాహసాలు, మార్గదర్శక స్ఫూర్తితో కోట్లాదిమంది భారతీయుల కలలకు ప్రేరణ కలిగించారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నా రు. శుక్లా భూమికి చేరుకోగానే మోదీ ఎక్స్ వేదికగా అభినందన సందేశం పోస్టు చేశారు. ''చరిత్రాత్మకమైన రోదసీయాత్ర పూర్తిచేసుకుని తిరిగి భూమికి చేరుకున్న గ్రూప్ కెప్టెన్ శుక్లాకు యావత్ జాతితో కలిసి స్వాగతం పలుకుతున్నాను'' అని పేర్కొన్నారు. భారతదేశం సొంతంగా మానవసహిత గగనయాన్ మిషన్ చేపట్టేదిశగా ఇది మరొక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**శుక్లా ధైర్యం అందరికీ స్ఫూర్తి : రేవంత్**

అంతరిక్షంలో సాహసోపేతమైన, చారిత్రాత్మక మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని భూమికి సురక్షితంగా తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించడం భారత అంతరిక్ష చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. శుభాంశు ప్రదర్శించిన ధైర్యం, అంకితభావం అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్ తరాలకు మార్గదర్శిగా నిలుస్తారని సిఎం అభినందించారు.

## 'ఉరిశిక్ష' వాయిదా! (మొదటి పేజీ తరువాయి)

గత కొద్ది రోజులుగా భారత ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందని వారు చెప్పారు. 2020లో యెమన్ కోర్టు నిమిష ప్రియకు మరణశిక్ష విధించింది. ఆమె అప్పీల్‌ను ఆ దేశ సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ 2023 నవంబర్‌లో రద్దుచేసింది. 38సంవత్సరాల నిమిషప్రియ ప్రస్తుతం ఇరాన్ మద్దతుకలిగి హౌతీ నియంత్రణలో ఉన్న యెమన్ రాజధాని నగరం సనా జైలులో ఉన్నది. ఈ కేసులో ప్రారంభం నుండి భారత ప్రభుత్వం అన్నివిధాలా తగిన సహాయం అందిస్తూ ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సున్నితమైన అంశాలు ఉన్నప్పటికీ భారతీయ అధికారులు స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్స్ ఆఫీస్‌తో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతున్నందువల్లే విచారణ వాయిదా పడిందని ఆ వర్గాలు తెలియజేశాయి. కాగా నిమిషప్రియ తల్లి ప్రేమకుమారి తన కూతురు సురక్షితంగా విడుదల చేయించుకునేందుకు గత ఏడాది కాలంగా యెమన్‌లోనే ఉంటూ తన ప్రయత్నాలను కొనసాగిస్తోంది. 'దియత్' లేదా 'బ్లడ్‌మనీ' చెల్లించడం ద్వారా నిమిషప్రియను సురక్షితంగా విడుదల చేయించే అవకాశాన్ని కూడా భారత్ అన్వేషించింది. కానీ అందులో కొన్ని సమస్యలు ఉన్నాయని గ్రహించింది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం సోమవారం నాడు సుప్రీంకోర్టుకు నిమిషప్రియను మరణశిక్ష నుంచి కాపాడటానికి చేయదగిన అన్ని ప్రయత్నాలనూ సాధ్యమైనంతమేరకు చేశామని తెలియజేసింది. యెమన్‌లో ఉన్న స్థితిని పరిగణనలోనికి తీసుకుంటే ఇంతకంటే ఎక్కువగా కూడా చేయలేమని అత్యున్నత న్యాయస్థానానికి వివరించింది. భారత ప్రభుత్వం ఒక పాయింట్ వరకూ చేయగలిగేదంతా చేసి ఆ పాయింట్‌ను చేరుకోగలిగామని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహ్‌తాలతో కూడిన ధర్మాసనానికి తెలియజేశారు. భారత ప్రభుత్వం ఈ విషయంలో తన పౌరులను కాపాడుకునేందుకు సాధ్యమైనంత మేరకు చేయగలిగామని ఉన్నత న్యాయ అధికారి సుప్రీంకోర్టుకు చెప్పారు.

## ప్రపంచ దేశాలతో పోటీ (మొదటి పేజీ తరువాయి)

విధానాలతో సంపూర్ణ సహకారం అందిస్తూ కొత్త వారిని ఆహ్వానిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందన్నారు. ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపు దిద్దుకొంటుందన్నారు. మంగళవారం ఆయన మేడ్చల్ జిల్లా జీనోమ్ వ్యాలీలోఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్‌కు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్‌లతో కల్సి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణాకే గుర్తింపు తీసుకొని వచ్చాయని, దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం, బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం జీనోమ్ వ్యాలీ నుండే ఉత్పత్తి అవటం రాష్ట్రానికే గర్వ కారణమని సిఎం అన్నారు. ప్రపంచాన్ని కోవిడ్ వణికిస్తున్న సమయంలో వ్యాక్సిన్లు తయారు చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదేనన్నారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకొని వెళ్లే రీతిలోనే ప్రభుత్వ నిర్ణయాలున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. తాము రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు రూ. 3 లక్షల 28 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని ఆయన స్పష్టం చేసారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జీనోమ్ వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిందన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## యువనేతపై కాల్పులు (మొదటి పేజీ తరువాయి)

అనుమానిస్తున్నారు. ఘటన విషయం తెలిసిన వెంటనే మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి, క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకొని ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం నిమిత్తం అనిల్ మృతదేహాన్ని పోలీసులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు అనిల్ కుడి చేతిపై హైదరాబాద్‌కు చెందిన ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ యజమానికి సంబంధించిన ఫోన్ నెంబర్ ఉన్నట్లు తెలుస్తుంది. హైదరాబాద్ నానక్ రామ్ గూడలోని ఆరు గుంటల భూమికి సంబంధించి నిర్మాణ సంస్థ యజమానికి, అనిల్‌కు మధ్య వివాదాలు ఉన్నట్లు సమాచారం. ఆ వివాదాల కారణంగానే అనిల్‌ను హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తుపాకీ తూటాలకు గురై అక్కడికక్కడే కాంగ్రెస్ నేత మరేల్లి అనిల్ మృతి చెందిన ఘటనా స్థలాన్ని నిజాంబాద్ రేంజ్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాసరావు, ఎఎస్‌పి మహేందర్ పరిశీలించారు. వారివెంట డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ రాజశేఖర్ రెడ్డి ఎస్ఐ మహమ్మద్ గౌస్ లు ఉన్నారు. కాగా, దళిత నాయకుడు అనిల్‌పై కాల్పులు జరగడంతో కొల్చారం మండలంలోని సంగయ్యపేట,రంగంపేట తదితర గ్రామాలలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో అనిల్ మృతి చెందడంతో పార్టీ నేతలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి,మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్,ఇతర నాయకులు ఘటన స్థలాన్ని సందర్శించి అనిల్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మురళీధర్‌రావు అరెస్టు
(మొదటి పేజీ తరువాయి)

పెద్దా ఎత్తున చేశాడని ఎసిబి అధికారులు గుర్తించారు. మురళీధర్ రావు ఇంట్లో ఎసిబి నిర్వహిస్తున్న సోదాల్లో సంచలన విషయాలు వెలుగు చూశాయి. కాళేశ్వరం ప్రాజెక్టు బిల్లుల చెల్లింపులో కీలక పాత్ర పోషించిన మురళీధర్ రావు.. ఆ సమయంలో పెద్ద ఎత్తున చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం నిధులను తన కుమారుడు అభిషేక్ రావుకు చెందిన సొంత కంపెనీల హర్ష కన్ స్ట్రక్షన్ కు మళ్లించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరంతో పాటు పాలమూరులోను భారీగా సబ్ కాంట్రాక్ట్ లు చేశారని, తన కుమారుడు అభిషేక్ బినామీలకు లబ్ధి చేకూరేలా మురళీధర్ రావు వ్యవహరించినట్లు సమాచారం. వర్క్ ఆర్డర్స్ జారీలోనూ మురళీధర్ రావు అకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జూబ్లీహిల్స్ లోని మురళీధర్ రావును అదుపులోకి తీసుకున్న ఎసిబి అధికారులు ఆయన నివాసంతో పాటు తన కుమారుడు హర్షవర్ధన్ రెడ్డికి చెందిన హర్ష కన్ స్ట్రక్షన్ పై కూడా రెయిడ్స్ చేస్తున్నారు. హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ తో పాటు మొత్తం పది చోట్ల మరళీధర్ రావు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో సోదాలు కొనసాగుతున్నాయి. ఈఎన్సీ జనరల్ గా కీలకంగా వ్యవహరించిన మురళీధర్ రావు ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీవిరమణ పొందారు. ఆ తర్వాత మురళీధర్ రావు పదవీకాలాన్నీ 13 ఏళ్ల పాటు ప్రభుత్వం పొడిగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఆయనే కొంత కాలం పదవిలో కొనసాగినా ఆ తర్వాత ఆయనపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వం తొలగించింది.

**వరుసగా ఎసిబి వలలో కాళేశ్వరం ఇంజినీర్లు..**

ప్రభుత్వం ఓ వైపు కాళేశ్వరం ప్రాజెక్టులోని అవకతవకలపై దృష్టి సారించింది. బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విచారణ కోసం జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించేందుకు సిద్ధం అవుతోంది. ఈ తరుణంలో వరుసగా కాళేశ్వంలో కీలపాత్ర పోషించిన ఇంజినీర్లపై ఏసీబీ రెయిడ్స్ కలకలం రేపుతున్నాయి. గత ఏప్రిలో కాళేశ్వరం ఈఎన్ సీ భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయ్యారు. ఈ సోదాల్లో అతడి వద్ద కళ్లు చెదిరే ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హరిరామ్ కు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే 28 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ఎపిల రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం ఉన్నట్లు గుర్తించారు. వివిధ ప్రాంతాల్లో విల్లాలు, ఫ్లాట్లు, ఇళ్లు, స్థలాలు పోగేసుకున్నట్లు గుర్తించారు. కాళేశ్వరం నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన హరిరామ్ ఆధ్వర్యంలో రూ. 48,665 కోట్ల మేర కాళేశ్వరం పనులు జరిగాయి. ఇక ఇవాళ కాళేశ్వరం అత్యంత కీలకంగా వ్యవహరించి మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు సైతం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు కావడం, ప్రజాధనాన్ని తన సొంత కొడుకు కంపెనీలకు లబ్ధి చేకూరేలా వ్యవహరించారనే ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. దీంతో ఈ అధికారుల తీగ లాగితే డొంక ఎక్కడ కదలబోతున్నది అనేది రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతున్నది. వీరి వెనుక ఉన్నది ఎవరు? అనేది విచారణలో బయటకు రావాల్సి ఉంది.

**సోదాల్లో లభించిన అక్రమాస్తులు ఇవే..**

ఈ సోదాలలో కొండాపూర్‌లోని ఒక విల్లా, బంజారా హిల్స్‌లోని ఒక ఫ్లాట్, యూసఫ్ గూడలోని ఒక ఫ్లాట్, బేగంపేటలోని ఒక ఫ్లాట్, కోకాపేటలోని ఒక ఫ్లాట్, కరీంనగర్‌లోని ఒక వాణిజ్య భవనం, హైదరాబాద్‌లోని ఒక వాణిజ్య భవనం, కోదాడ్‌లోని ఒక అపార్ట్‌మెంట్, జహీరాబాద్‌లోని 2కెవి సౌర విద్యుత్ ప్రాజెక్టు, వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్, 11 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని 4 నివాస ప్రైమ్ ఓపెన్ ప్లాట్లు, మోకిలాలో 6500 చదరపు గజాల భూమి, మెర్సిడెస్ బెంజ్ కారుతో సహా మూడు నాలుగు చక్రాల వాహనాలు, బంగారు ఆభరణాలు మరియు బ్యాంకు డిపాజిట్లు బయటపడ్డాయి. ఈ సోదాలలో పైన పేర్కొన్న నిందితుడి అధికారి తన అధికారిక పదవిని దుర్వినియోగం చేసి ఈ చరాస్తులను మరియు స్థిరాస్తులను సంపాదించాడని తేలింది. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే చాలా ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు.

## చర్చ వద్దే వద్దు
(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శులకు కేంద్ర జల శక్తి శాఖ సమాచారం పంపించింది. అయితే బిజిఆర్ఎంబి, సిడబ్ల్యూసి, ఇఎసి నుంచి బనకచర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన, ట్రిబ్యునల్ తీర్పులను ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్ట్‌పైన చర్చించాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్ట్‌పై చర్చించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే కృష్ణానదిపైన పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మడిహట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టిఎంసిల నీటి కేటాయింపులతో పాటు ఎబిఐపి సాయం, ఇచ్ఛంపల్లి వద్ద 200 టిఎంసిల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఎజెండా ప్రతిపాదనలను పంపించింది. కాగా ఎపి ప్రభుత్వం సమర్పించిన ప్రీఫీజిబిలిటీ రిపోర్ట్‌ను కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని ఇఎసి తిరస్కరించిన విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖలో ఉటంకించింది. కేంద్ర జల సంఘం కూడా ప్రీ ఫిజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని విజ్ఞప్తి చేసింది. డిపిఆర్‌ను సమర్పించకుండా, టెండర్లు ఆహ్వానించకుండా ఎపి ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఎపి పునర్విభజన చట్టం ప్రకారం కొత్త ప్రాజెక్టులు, జల వివాదాలకు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, తెలంగాణ, ఎపి ముఖ్యమంత్రులు సభ్యులుగా అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిస్తారు. గత పదేళ్ల కాలంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశాలు కేవలం రెండు సార్లు మాత్రమే జరిగాయి. ఎపి నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పర్యావరణ అనుమతులు, కేంద్ర జల సంఘం నుంచి అనుమతులు ఇవ్వకూడదని కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసింది. గోదావరి–బనకచర్ల అనుసంధానం వల్ల తెలంగాణలోని ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ గట్టిగా వాదిస్తుంది.

**బనకచర్ల ప్రాజెక్ట్‌పై చర్చకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖలోని ముఖ్యమైన అంశాలు**

* జిడబ్ల్యుడిటి (గోదావరి వాటర్ డిస్‌పూట్స్ ట్రిబ్యునల్) తీర్పు ఉల్లంఘన. గోదావరి జలాల హక్కులను, కేంద్రం అనుమతి లేకుండా మార్చడం, ఇతర కోబేసిన్ రాష్ట్రాల అనుమతి లేకుండా కొనసాగించడం..
* కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి), గోదావరి నది నిర్వహణ బోర్డు (జిఆర్ఎంబి), కృష్ణా నది నిర్వహణ బోర్డు (కెఆర్ఎంబి), అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేవని స్పష్టం.
* ఆంధ్రప్రదేశ్ సమర్పించిన ప్రీఫిజిబిలిటీ రిపోర్ట్‌లో పలు డేటా లోపాలు, అనుమానాస్పద వాటర్ అవలెబిలిటీ అంచనాలు ఉన్నాయి.
* పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల కమిటీ (ఇఎసి) బనకచర్ల ప్రాజెక్టును తిరస్కరించింది.
* పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో పెండింగ్ కేసులు ఇంకా పరిష్కారం కాలేదు. అటువంటి పరిస్థితుల్లో 200 టిఎంసి వరద జలాల మళ్లింపు ప్రతిపాదన అనర్థం.
* తెలంగాణ రాష్ట్రంలో ఎండిపోయే ప్రాంతాలకు గోదావరి నీరు అత్యవసరం. బనకచచర్ల ప్రాజెక్ట్ ద్వారా వాటిపై హక్కులు హరిస్తాయి.
* జిఆర్ఎంబి 1980 ఒప్పందాలను ఉల్లంఘిస్తూ ఎటువంటి పరస్పర సమ్మతి లేకుండానే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం సరైంది కాదు.
* ప్రస్తుత దశలో బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ జరగడం సముచితం కాదు.



## చందు దారుణ హత్య
(మొదటి పేజీ తరువాయి)

కోసం వెళ్లినట్లు అందులో పేర్కొన్నారు. ఒక స్థల విషయంలో తన భర్తతో విభేదాలు పెంచుకున్న సిపిఐ (ఎంఎల్) నాయకులు రాజేష్ అలియాస్ రాజన్న, ప్రశాంత్, ఏడు కొండలు టిఎస్ 08 హెచ్‌డబ్ల్యూ 0875 స్విఫ్ట్ కారులో అక్కడ కనిపించారని, ఈ విషయం తనభర్త చందుకు చెప్పానని, ఆయన పర్వాలేదన్నారని తెలిపారు. పార్క్‌లో వాకింగ్ ముగించుకుని తన కుమార్తెతో బైక్‌పై ఇంటికి బయలు దేరామన్నారు. అదే సమయంలో తమకు కారు కనిపించిందని, తాము కొద్ది దూరం వెళ్లిన తరువాత కాల్పుల ఘటన గురించి సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకునేసరికి చందు చనిపోయి ఉన్నారని నారీభాయ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజేష్, ప్రశాంత్, ఏడు కొండలుతో పాటు మరికొందరు కలిసి తన భర్తను హత్య చేశారని ఆమె పోలీసులకు తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై పోలీసులు క్రైమ్ నెంబర్ 265/2025పై 103(1),61(2),115(1) రెడ్‌విత్ 3(5) బిఎన్‌ఎస్ 2023, సెక్షన్ 27(3), సెక్షన్ 25(1ఎ) ఆఫ్ ది ఆమ్స్ యాక్ట్ 1959 కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాల్పులు జరిపి పారిపోతున్న దుండగుల కారు సిసిటివిలో కనిపించింది. దీని ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చందు రాథోడ్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూర్ మండలం, నార్శపల్లి తండా కాగా, ప్రస్తుతం కుటుంబ సభ్యులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లో నివాసముంటున్నారు.

పోస్టుమార్టం అనంతరం రాత్రి చందు రాథోడ్ భౌతికకాయాన్ని నాగోల్‌లోని సాయినగర్‌కు తరలించారు. పలువురు ప్రముఖులు, సిపిఐ నేతలు చందు రాథోడ్‌కు నివాళులర్పించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## గీత పనివారల సంఘం నేత అనంతుల చిన్న జానయ్య మృతి



**హైదరాబాద్ :** గీత పనివారల సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు, నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షు డు అనంతుల చిన్న జానయ్య మంగళవారం హైదరాబాద్‌లో గుండెపోటు తో మరణించారు. ఆయన మరణం పట్ల గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, నాయకులు కె.వి.ఎల్., బి.నాగభూషణం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. చిన్న జానయ్య కుటుంబం కమ్యూనిస్టు పార్టీతో మమేకమైందని, గీత పనివారల సంఘంలో కార్యకలాపాలలో క్రియాశీలకంగా పాల్గొనేవారని తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన సూర్యాపేట పట్టణ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘానికి జానయ్య డైరెక్టర్‌గా చాలాకాలం పాటు ఉన్నారు. గీత పనివారల సంఘం నాయకులు బొమ్మగాని వెంకటయ్య నేతృత్వంలో సూర్యాపేట తాలుకాలో సంఘం విస్తృతికి కృషి చేశార ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఫ్యూచర్ సిటీ గేమ్ చేంజర్

పెండింగ్ పవర్ బిల్లుల వన్ టైమ్ సెటిల్‌మెంట్ గురించి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది : ఎఫ్‌టిసిసిఐ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క




**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఫోర్త్ సిటీగా పిలుచుకుంటున్న ఫ్యూచర్ సిటీ తెలంగాణ రాష్ట్రానికి ఒక గేమ్ చేంజర్ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాదులో తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) నూతన కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మూసీ పునర్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు పనులు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఎవరి ఊహకు అందదని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుకు ఔటర్ రింగ్ రోడ్డుకు మధ్య ఐటి, ఫార్మా, హౌసింగ్ వంటి అనేక క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రచిస్తున్నామని, వాటిని అభ్యుదయ పారిశ్రామికవేత్తలకు కేటాయించి ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వం పారిశ్రామికవేత్తల కోసం ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు చిన్న సమస్య వచ్చినా స్పందించేందుకు సిఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పారిశ్రామికవేత్తలు కోరినట్టు పెండింగ్‌లో ఉన్న పవర్ బిల్లులను సింగిల్ టైమ్ సెటిల్‌మెంట్ చేసేందుకు ఆలోచన చేస్తామని డిప్యూటీ సిఎం అన్నారు.

సంపద సృష్టికర్తలైన పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దులుగా భావించి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. రాష్ట్రంలో రెప్పపాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరుగుతుందని, త్వరలో పరిశ్రమలకు గ్రీన్ పవర్ సరఫరా చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కొత్త ఆవిష్కరణలు, ప్రతిభ, కష్టపడేతత్వంతో కొత్త సంపద రూపొందించేందుకు హైదరాబాద్ ఒక గని లాంటిదని డిప్యూటీ సిఎం అభిప్రాయపడ్డారు. చాంబర్ ఆఫ్ కామర్స్ లాంటి వేదికల ద్వారానే పరిశ్రమలు పుడతాయని, సాంకేతికత జన్మిస్తుంది, పరిష్కారాలు రూపొందుతాయి. ఇవి కేవలం తెలంగాణ రాష్ట్రం కోసమే కాకుండా దేశం ఈ ప్రపంచానికి ఉపయోగపడతాయని అన్నారు. పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన యువతను సిద్ధం చేసేందుకు స్కిల్ యూనివర్సిటీ, గ్రామాల వరకు డిజిటల్ సాక్షరతను తీసుకు వెళ్లేందుకు అంబేద్కర్ నాలెడ్జి సెంటర్లు, మహిళా సాధికరత లక్ష్యంగా ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో ముందుకు పోతున్నామని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పౌర సమాజం అంతా కలిసి పని చేద్దామని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి సంపదను పంచుదామన్నారు.

కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మైనంపల్లి రోహిత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు, ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షులు సురేష్ కుమార్, సీనియర్ ఉపాధ్యక్షులు రవికుమార్, ఉపాధ్యక్షులు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 'లెర్న్, అన్ లెర్న్, రీ లెర్న్'...ఇదే సక్సెస్ మంత్రం

స్మార్ట్ వర్క్ తో కూడిన హార్డ్ వర్క్ చేయాలి

విద్యార్థులకు మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంతో పాటు మనం కూడా మారాలి. కాలం చెల్లిన జ్ఞానాన్ని విడిచిపెట్టి, నిరంతరం నూతన విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలి. అప్పుడే సక్సెస్ మనల్ని వరిస్తుంది' అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'లెర్న్, అన్ లెర్న్, రీ లెర్న్' అనేది ఇప్పుడు సక్సెస్ కు ఫార్ములా అని వివరించారు. మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'మన అమెరికా తెలుగు సంఘం(మాట) టాస్క్ ఫ్రీ ఆన్ లైన్ ఐటీ ట్రైనింగ్' సర్టిఫికేట్ల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. 'ఒకప్పటిలా చేతిలో డిగ్రీ ఉంటే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదు. 50 శాతం మంది గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్ లేవని నాస్కామ్ గుర్తించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో కనీస అవగాహన ఉండటం లేదని తేల్చింది' అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'ఆటోమేషన్ వల్ల ఉద్యోగాలు కనుమరుగైపోతాయనే ఆందోళన వద్దు. 2025 నాటికి 8.5కోట్ల ఉద్యోగాలు రోబోలు, ఎఐ వల్లపోతే... కొత్తగా 9.7 కోట్లు పుట్టుకొస్తాయని వరల్డ్ ఎకానమిక్ ఫోరం తేల్చింది' అని చెప్పారు. 'చేతిలో డిగ్రీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ పై పట్టు ఉంటేనే కొత్త ఉద్యోగాలను సాధించలేరు. క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, టీం వర్క్, అడాప్టబిలిటీ, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ లాంటి స్కిల్స్ కూడా అవసరం. ఆ దిశగా విద్యార్థి దశ నుంచే కృషి చేయాలి' అని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్మార్ట్ వర్క్ తో కూడిన హార్డ్ వర్క్ చేస్తేనే సక్సెస్ వస్తుంది' అని వివరించారు. 'సాంప్రదాయబద్ధంగా కాకుండా వినూత్నంగా ఆలోచించండి. కొత్త ఆలోచనలకు మేం ఎల్లప్పుడూ అండగా ఉంటాం. స్కిల్ కేపిటల్ ఆఫ్ గ్లోబ్‌గా తెలంగాణను మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్ వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలి. సమాజం కోసం కూడా ఆలోచించాలి' అని సూచించారు. మాట చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు.

కార్యక్రమంలో టాస్క్ సిఇఒ శ్రీకాంత్ సిన్హా, సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాట ప్రతినిధులు శ్రీనివాస్, ప్రదీప్, విజయ్ భాస్కర్, నగేష్, కళ్యాణి, డా.విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దుండగులపై కఠిన చర్యలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చందు నాయక్‌ను హత్య చేసిన దుర్మార్గులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. దుర్మార్గులు ఏవరైనా సరే వారిని పోలీసులు గుర్తించాలన్నారు. తాము కూడా గుర్తించేందుకు తమకు తెలిసిన పద్ధతుల్లో ప్రయత్ని స్తామన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఇటువంటి వారిపట్ల ఊరుకునే పరిస్థితి లేదన్నారు. తాము పంటికి పన్ను, కంటికి కన్ను అని చెప్పము కానీ, తమ పద్ధల్లో తాము పార్టీ జోలికి వచ్చిన ఎవ్వరిని కూడా, పార్టీ వారిని చంపిన ఎవ్వరిని ఊరుకోమని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రాథోడ్ చందు నాయక్‌ను కొందరు దుండగులు మంగళవారం ఆయన నివాసం సమీపంలో హత్య చేశారు. చందు నాయక్ మృతదేహానికి పోస్టుమర్టం నిమి త్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఉస్మానియా ఆసుపత్రి మర్చురి వద్ద చందు నాయక్ కుటుంబ సభ్యులను సిపిఐ జాతీయ సమితి కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, కూనంనేని సాంబశివ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈ.టి.నరసింహ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ వాకింగ్ సమయంలో రాజేష్ అనే వ్యక్తి, ఎంఎల్ పార్టీ పేరు చెప్పుకునే వాడు, లిబరేషన్ పార్టీ పేరు చెప్పుకొని తిరిగేవాడన్నారు. ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారని చెప్పుతున్నారని తెలిపారు. చందు ఇంట్లోనే అన్నం కూడా తింటూ, ఇంట్లోనే కలిసిమెలిసి ఉంటూ, తదనంతరం చిన్న గ్యాప్‌తో ఈ దురాఘాతానికి పాల్పడినట్లు చెబుతున్నారు.

ఉద్దేశపూర్వకంగా కుట్ర పన్ని పొద్దునే ఆయన వాకింగ్ చేస్తుంటే, ఐదుగురు ఒకే కార్లో వచ్చి, గన్స్ తీసుకొచ్చి చంపడం అనేది చాలా ఆశ్చర్యకరంగా ఉందన్నారు. జరిగిన సంఘటనపై సమగ్రంగా విచారణ జరపాలని పోలీసులకు విజ్ఞప్తి చేశామన్నారు. చంపేంత అవసరం ఏమొచ్చిందా అనేఅంశాన్ని బయటకు తీయాలని పోలీసులను కూనంనేని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఈ విధంగా చంపినవాళ్లను, చట్టపరంగా కఠినంగా మరొకరు నేరం చేసేవారికి భయం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన కోరారు. చందు నాయక్ ఎంఏ చదివిన వ్యక్తి, వృద్ధిలోకి రావాల్సిన వ్యక్తి అన్నారు. దురదుష్ట వశాత్తు ప్రాణాలు కోల్పోవడం తమందరికి బాధాకరంగా ఉందన్నారు. కుటుంబంలో ఆయనకు భార్య, ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారని చెప్పారు. వారికి ధైర్యం ఇస్తున్నామని, కష్టాల్లో నష్టాల్లో అండగా కమ్యూనిస్టు పార్టీగా అండగా ఉంటుందని కూనంనేని భరోసా కల్పించారు. ఉస్మానియా మర్చురి వద్ద చందు నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయా దేవి, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, స్టాలిన్, నాయకులు పర్వాతాలు, ఆర్.శంకర్ నాయక్, డి.జి. సాయిలు గౌడ్, డిహెచ్‌పిఎస్ మారుపాక అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

**హంతకులను కఠినంగా శిక్షించాలి**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు**

సిపిఐ నాయకులు చందు నాయక్ ను హతమార్చడం దుర్మార్గమైన చర్యఅని ఇందుకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. చంద్ నాయక్ మరణం పార్టీకి సమాజానికి తీరని లోటాన్నారు.

పేద ప్రజల కోసం పనిచేయాలని తపనతో విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీలో చేరిన చందు నాయక్ దిల్ సుక్ నగర్, చైతన్యపురి ప్రాంతంలో నివాసం ఉంటూ హైదరాబాదులో పేదల కోసం గూడు లేని వారికోసం గుడిసెలు వేయించి ఎన్నొ భూ పోరాటం నిర్వహించిన ఆయన భారత కమ్యూనిస్టు పార్టీలో నాయకునిగా అంచ లంచలుగా ఎదిగారని గుర్తు చేసుకున్నారు. మంగళవారం ఉదయం కొంత మంది దుండగులు, చందు నాయక్ కళ్లలో కారం చల్లి కాల్పులు జరపడంతో ఆయన అక్కడికక్కడే మరణించడం బాధకరమని పేర్కొన్నారు. చంద్ నాయక్‌ను చంపిన. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని శ్రీనివాస రావు డిమాండ్ చేశారు

**చంద్ నాయక్ మరణం పట్ల అంజయ్య నాయక్ దిగ్భ్రాంతి**

సిపిఐ నాయకులు చంద్ నాయక్‌ను మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చంద్ నాయక్‌ను హంతకులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## బనకచర్లతో ప్రజాధనం వృథా

గోదావరిలో వరద జలాలే లేవు

కేంద్ర జలశక్తి మాజీ సలహాదారుడు శ్రీరామ్ వెదిరే



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోదావరి నదికి సంబంధించి ప్రతి ఏటా 3 వేల టిఎంసిల వరద జలాలు సముద్రంలో కలుస్తున్నాయనేది అశాస్త్రీయమైన వాదన అని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ మాజీ సలహాదారుడు, నదుల అనుసంధాన టాస్క్ ఫోర్స్ మాజీ ఛైర్మన్ శ్రీరామ్ వెదిరే తెలిపారు. గోదావరి బేసిన్‌కు సంబంధించి చట్టం(లా ఆఫ్ ల్యాండ్)లో వరద జలాలు అనే పదం ఎక్కడా పేర్కొన బడలేదని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు గోదావరిలో కేటాయించిన 513.9 టిఎంసిల ఆధారంగానే పోలవరంతో పాటు ఇతర ప్రాజెక్టులకు కేటాయింపులు ఉన్నాయని, వరద జలాల పేరుతో లేని నీటి కేటాయింపులతో పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు నిర్మించడం అంటే ప్రజాధనం వృథా చేయడమేనని చెప్పారు. గోదావరి బేసిన్‌లో ఇప్పటికే పూర్తి నీటి కేటాయింపులు జరిగాయని, ఆ మేరకే అనుమతులు ఉంటాయి తప్ప, అదనంగా ఏ రాష్ట్రం కొత్తగా ప్రాజెక్టు చేపట్టినా చట్ట ప్రకారం ఎలాంటి అనుమతులు లభించబోవని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో టిజెయు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీరామ్ వెదిరే 'గోదావరి జలాల వివాదం–వాస్తవాల పరిశీలన' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. తాను వెల్లడిస్తున్న విషయాలన్నీ గోదావరి నదీ జలాల పంపిణీ ట్రిబ్యునల్ (జిడబ్ల్యూడిటి) జల కేటాయింపులు, భారత ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా కేంద్ర జల సంఘం(సిడబ్ల్యూసి) ద్వారా కో– బేసిన్ రాష్ట్రాలకు ప్రాజెక్టుల ఆమోదం, వివిధ రాష్ట్రాలకు నీటి కేటాయింపులకు సంబంధించి అధికారిక వివరాలే అని తెలిపారు. గోదావరి నదికి సంబంధించి మొత్తం 3396.9 టిఎంసిల నీటి లభ్యత ఆధారంగా, మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిసా కలుపుకొని మొత్తం 7 రాష్ట్రాల పరీవాహక ప్రాంతం ప్రకారం పూర్తి నీటిని కేటాయించారని వెల్లడించారు. ఇందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1470 టిఎంసిలను కేటాయించగా, ఇందులో తెలంగాణ రాష్ట్రం వాటా 968 టిఎంసిలు అని, ప్రస్తుత విభజిత ఆంధ్రప్రదేశ్ వాటా 513.9 టిఎంసిలు అని తెలిపారు. మొత్తం 3396 టిఎంసిల నికర జలాల్లో తెలంగాణ సుమారు 400 టిఎంసిలు, ఛత్తీస్‌ఘడ్ మరో 400 టిఎంసిలు , అదేవిధంగా ఇతర రాష్ట్రాలు వాడుకోలేకపోతున్నాయని, ఈ నీరే ప్రతిఏటా సగటన 1138 టిఎంసిల నీరు సముద్రంలో కలుస్తున్నాయని సిడబ్ల్యూసి లెక్కలు తేల్చాయన్నారు. వివిధ రాష్ట్రాలకు కేటాయించిన నీటి భవిష్యత్‌లో అవి పూర్తిగా వాడుకుంటే వరద జలాలు అనేవే ఉండబోవని స్పష్టం చేశారు.

**గోదావరి– కావేరి నదుల అనుసంధానం ఇరు రాష్ట్రాలకు ఉపయోగం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి–కావేరి నదుల అనుసంధానం రెండు తెలుగు రాష్ట్రాలకు ఎంతో ఉపయోగకరమని శ్రీరామ్ వెదిరే తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి అధికారికంగా కేటాయించిన 400 టిఎంసిల నీటిలో నుంచి 147 టిఎంసిల నీటితో ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టును నిర్మించి తద్వారా తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు, అక్కడి నుంచి తమిళనాడు పుదిచ్చేరిలకు నీటిని అందించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.60 వేల కోట్ల అంచనా వ్యయం కాగా, ఇందులో 90 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించనుందని చెప్పారు. ఇరు రాష్ట్రాలు కొన్ని ప్రతిపాదనలు చేయగా, దాదాపు వాటికి కేంద్రం సుముఖతను వ్యక్తం చేసిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు నిర్మించగలితే ఏ బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు నీరు అందించాలనుకుంటున్నారో పైసా ఖర్చు లేకుండా 60 వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమానికి టిజెయు అధ్యక్షులు కప్పర ప్రసాదరావు సమన్వయ కర్తగా వ్యవహరించారు.

## కల్లు కాంపౌండ్‌లపై ఎక్సైజ్ పోలీసుల దాడులు





**ప్రజాపక్షం/హైదరాబాద్:**కల్తీ కల్లును అరికట్టేందు కు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ పోలీసులు, ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్ టీంలు రాష్ట్రవ్యాప్తంగా కల్లు కాంపౌండ్‌లపై ముప్పే ట దాడులు నిర్వహించారు. కూకట్‌పల్లి కల్తికల్లు ఘటన నేపథ్యంలో కల్లు కాంపౌండులపై ప్రత్యేకంగా దాడులు నిర్వహించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఇచ్చిన ఆదేశాల మేరకు దాడులను ముమ్మరం చేశారు. హెచ్‌డిఎఫ్‌ఎ టీం లీడర్ అంజిరెడ్డి నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 32 లీటర్ల కల్లును అక్రమంగా రవాణ చేస్తూ ఉండ గా స్వాధీనం చేసుకున్నారు. ఒక బైక్‌ను సిజ్ చేసి, శాంపిల్ తీసుకున్నారు. కల్లు కాంపౌండ్ యజమాని కాంబ్లే గిరిధరిపై కేసు నమోదు చేశారు. ఎస్‌టిఎఫ్ సి టీం సిఐ వెంకటేశ్వర్ల అధ్వర్యంలో గోల్కొండ, శంషాబాద్ బండ్లగూడ ప్రాంతాల్లో కల్లు కంపౌండ్‌లల్లో తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిళ్లను సేకరించారు. సిఐఐ నాగరాజు అధ్వర్యంలో మైలార్ దేవరపల్లి హైదర్గూడా, ముద్దోవ్వాల, జంగంపేట్, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అన్ని కల్లు దుకాణాల్లో శాంపిళ్లను సేకరించారు. ఎస్ టి ఎఫ్ బి టీం గద్వాల, రాయన్‌పేట, ఏదుర్తి నుంచి మసాయిపేట ప్రాంతాల్లో సిఐ బిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజు తోపాటు సిబ్బంది కలిసి ఆరు చోట్ల దాడులు నిర్వహించారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వీరు ఎలాంటి అనుమతులు లైసెన్స్‌లు లేకుండా కల్లు దు కాణాలనునిర్వహిస్తున్నారు. ఈ కల్లు మండవాల్లో ఉన్న కల్లును నేలపాలు చేశారు. మల్లయ్య, నరేందర్ కృష్ణ, వెంకటేష్ పద్మమ్మల పై కేసు నమోదు చేశారు. నాగర్ కర్నూల్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది కలిసి 350 లీటర్ల అనుమతి లేని కల్లును స్వాధీనం చేసకుంటున్నారు. మంగూనూర్, బిజినేపల్లి ప్రాంతా ల్లో దాడులు నిర్వహించారు. నాగర్ కర్నూల్ డిటిఎఫ్ సిఐ సిబ్బంది కలిసి ఒక వాహనంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న 31.2 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేశారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు బిజెపి చీఫ్ లీగల్ నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు లీగల్ నోటీసులు పంపించారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టివిక్రమార్క చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయన తరపు న్యాయవాది విజయ్ కాంత్ ద్వారా ఈ నోటీసులు పంపించారు. తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు మల్లు భట్టివిక్రమార్క మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో కోర్టు ఇచ్చిన తీర్పు కాపీని బిజెపి చీఫ్ తరపు న్యాయవాది అటాచ్ చేశారు. నాలుగు రోజుల క్రితం ఢిల్లీలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుపైన సంచలన ఆరోపణలు చేశారు. ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సెంట్రల్ యూనివర్సిటీల స్థితిగతులపై మాట్లాడుతూ హెచ్‌సియులో విద్యార్థుల ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రస్తుత రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రయత్నించారని ఆరోపించారు. బిజెపి అధిష్ఠానం తెలంగాణ నూతన అధ్యక్షుడిగా రాంచందర్‌రావును ఎంపిక చేయడాన్ని తప్పుపడుతూ, రోహిత్ వేముల హత్యకు కారకులైనవారికి బిజెపి ప్రమోషన్లు ఇస్తోందంటూ వ్యాఖ్యలు చేశారు.

## ఫలించిన రేషన్ కార్డుల ఆశలు

* కాంగ్రెస్ ప్రభుత్వంపై పొగడ్తల వెల్లువ
* త్వరలో కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన వారికి రేషన్ కార్డు లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇంతకాలం కార్డుల్లేక పరేషన్ పడ్డవారి ఆశలు ఫలించాయి. దీంతో లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తంచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో కొత్తరేషన్‌కార్డుల జారీ కూడా ఒకటి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని లాంఛనం గా ప్రారంభించిన విషయం విదితమే.

**పదేళ్ల నిరీక్షణకు తెర**

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తరేషన్ కార్డు ల ప్రక్రియ జరగలేదు. దీంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పదేళ్లలో కొత్త సంసారాలు, వారికి పిల్లలు జన్మించారు. ఆ పిల్లలు పెరిగి పెద్దవాళ్లు కూడా అవుతున్నా రు. పలు పథకాల అములుకు రేషన్ కార్డు అవసరం కావడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఆయా సమయాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిట్టుకోక తప్పలేదు. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికల సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కొత్తరేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించడంతో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారనేది విశ్లేషకుల వాదన.

**జిల్లాలో మరికొందరికి అవకాశం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తరేషన్ కార్డుల కోసం సుమారు 40వేల దరఖాస్తులు రాగా 9945 మంజూరు చేశారు. మార్పు చేర్పుల అనంతరం కొన్ని తహశీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రక్రియ పూర్తయి తే జిల్లాలో మరో 6500మందికిపైగా కొత్త కార్డులు వచ్చే అవకాశముంది. పలుదశల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 442 రేషన్ షాపులుండగా, వాటి ద్వారా 2,95,646 కార్డులున్నాయి. అన్నపూర్ణ, అంత్యోదయ, ఆహారభద్రత కార్డుల ద్వారా లబ్ధిదారులు సన్నబియ్యం పొందుతున్నారు. కొత్తకార్డులు సుమారు 15వేలకు పైగా పెరగనుండటంతో కొత్తరేషన్ షాపులు కూడా తెరవనున్నట్లు తెలుస్తోంది.

**అనర్హులూ ఉన్నారు**

ఇప్పటికే ఉన్న పాత రేషన్ కార్డుల్లో కోకొల్లలుగా అనర్హులున్నారని, ఇప్పుడు కొత్తగా ఇచ్చే కార్డుల్లో కూడా చాలామంది ధనవంతులు, బహుళఅంతస్తులు, కార్లు ఉన్నవారు, వ్యాపారులు ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు దళారులు కార్డులిప్పిస్తామంటూ డబ్బులు తీసుకుని అనర్హుల పేర్లను కూడా గుట్టు చప్పుడు కాకుండా జాబితాలో చేర్చారని, వీటిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించకుంటే ప్రభుత్వం అభాసుపాలు కాక తప్పదని, స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా ప్రాంతాల్లో నాయకులు ఓట్లకోసం కూడా జిమ్మిక్కులు చేశారనే విమర్శ బాహాటంగానే వినవస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుని ప్రభుత్వ ప్రతిష్టకు భంగం వాటిల్లకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

**పంపిణీ :** కొత్తరేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. ఆయా జిల్లాలకు ఇంకా పంపిణీకి సంబంధించిన అధికారిక ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ కార్యాలయానికి ఆదేశాలు వచ్చిన వెంటనే కార్డుల పంపిణీ ప్రక్రియ మొదలు పెడతామని జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ

No. 13/EE PH/SRD/2025-26, తేది: 14.07.2025

హైదరాబాద్‌లోని సంగారెడ్డి డివిజన్, సదాశివపేట మున్సిపాలిటీలో TUIFDC లోన్ అసిస్టెన్స్ కింద అభివృద్ధి పనుల కోసం టెండర్ నోటీసు ఆహ్వానించడమైనది. NIT. నం. 05 /EE PH/SRD/SSPT/TUFIDC/ సిద్ధాపూర్ జంక్షన్/DB /T1/2025-26 మరియు నం. 05/EE PH/SRD/SSPT/TUFIDC/కమ్యూనిటీ హాల్ బ్యాలెన్స్ పని వార్డ్ నం.19 /DB/T1/2025-26 యొక్క రూ. 0.6 కోట్ల వ్యయంతో కూడిన పని. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (PH) నుండి టెండర్లు 19.07.2025 ఉదయం 11.00 గంటల నుండి 26.07.2025 సాయంత్రం 5.00 గంటల వరకు షెడ్యూల్ చేయడమైనవి. వివరాల కోసం https://tender.telangana.gov.in ని సందర్శించండి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (PH) ప్రజారోగ్యం, డివిజన్ : సంగారెడ్డి

DIPR R.O. No. : 5046-PP/CL/ADVT/1/2025-26, Date: 15-07-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్ నెం.19, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి, యూసుఫ్‌గూడ, హైదరాబాద్.

NIT No. 08/EE/DIV.No.19/SLPZ/GHMC/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 14.07.2025

**పనుల సంఖ్య:** నెం.(1) సివిల్ పనులు, **అంచనా విలువ:** రూ.8.00 లక్షలు, **ప్రారంభ తేది / డౌన్‌లోడ్ ఆఖరి తేది & సమయం:** 15.07.2025న మ.02.00గం.ల నుండి 18.07.2025న మ.02.00గం.ల వరకు మాత్రమే, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, జిహెచ్ఎంసి. శ్రీ బి.భద్రు - 9989930549. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఫ్ఎసి), డివిజన్-19, (ఎస్ఎల్‌పిజెడ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 5020-PP/CL/ADVT/1/2025-26, Date: 15-07-2025



ANNOUNCEMENT
NAME CHANGE

I, **SURA LAXMI RAJAM** S/O **SURA BHANKKANNA**, R/o. H No 12-89, Shanthinagar Vilage & Mandal KHANAPUR, DIST NIRMAL TS. Has Declare that Change My Name, Parents Name & Spouse Name Mentioned In my Passport BEARING NO. F4365330 AS "SURA LAXMI RAJAM FATHER NAME SURA BHANKANNA, MOTHER NAME SURA GANGAVVA SPOUSE NAME SURA RAMA TO "SURA LAXMAN" Father Name "SURA PEDDA BHUKKANNA", MOTHER Name" SURA LAXMAVVA", SPOUSE NAME "SURA RAMYA", Hence Forth Hereafter I Would Be Known As **SURA LAXMAN**, S/O. **SURA PEDDA BHUKKANNA**,



ANNOUNCEMENT
NAME CHANGE

I, **THAMSHA RAJESHWAR** S/O **T VENKANNA**, R/O. H NO 1-11/2, VILAGE: KOTHA TARLAPAD MANDAL KHANAPUR, DIST NIRMAL TS. Has Declare that CHANGE MY SURNAME "THAMSHA TO "RAPELLI" My name Mentioned in Passport BEARING NO. M4952199, "**THAMSHA RAJESHWAR** Hence Forth Hereafter I Would Be Known As **RAPELLI RAJESHWAR**, S/O. **RAPELLI VENKANNA**"



LOST PASSPORT

I, **BHARMA VENKATESH**, S/O. **BHARMA NADPI GANGARAM**, H.No. 1-116, Village: Local Velmal, Mandal: Soan, Dist: Nirmal. I lost my original Passport Bearing No. **R5922330**. While constructing house during shifting on 10.07.2025. If anybody found return to the above mentioned address.

ప్రజాపక్షం
బుధవారం, 16 జులై

## శుభాంశు శుక్లాకు శుభాకాంక్షలు

అంతర్జాతీయ రోదసీ కేంద్రం (ఐఎస్ఎస్)లో సహవ్యోమగాములతో పాటు 18 రోజులు గడిపి, ఆహార ధాన్యాలపై, ఇతరత్రా నిర్దేశించిన ప్రయోగాలు నిర్వహించి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవంతంగా భూమికి తిరిగి వచ్చిన భారత రోదసీ యాత్రికుడు (గ్రూపు కెప్టెన్ శుభాంశు శుక్లా), మరో ముగ్గురు సహవ్యోమగాములకు శుభాకాంక్షలు తెలియజేద్దాం. భారతదేశం నుంచి ఐఎస్ఎస్‌లో ప్రవేశించిన తొలి వ్యోమగామి శుభాంశు శుక్లా. ఈ యాత్రతో ఇస్రో రోదసీ ప్రయోగాల్లో ఆయన సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ రోదసీ పరిశోధనా సంస్థ (ఇస్రో) రాకెట్ల ప్రయోగం, ఉపగ్రహాల ప్రయోగంతో, చంద్ర, అంగారక, సౌర గ్రహాల అన్వేషణ కార్యక్రమాలతో అమెరికా, రష్యా, చైనాల సరసన చేరినప్పటికీ రోదసీలోకి మానవులను పంపడంలో ఎంతో వెనుకబడి ఉంది. ఇప్పుడు చంద్రుని పైకి మనుషుల్ని పంపే 'చంద్రయాన్' ప్రాజెక్టు తలపెట్టింది. అందుకు శుభాంశు యాత్ర అనుభవాలు ఎంతో తోడ్పడతాయి. శుభాంశుతో తొట్టతొలి అంతరిక్ష యాత్రికుడు రాకేష్ శర్మ. అతను 1984 ఏప్రిల్ 3న నాటి సోవియట్ యూనియన్‌లోని బైకనూర్ నుంచి సోవియట్ కాస్మోనాట్‌లు మలషెవ్, గెన్నడి స్ట్రెకలోవ్‌తో కలిసి సోయుజ్ టి–11లో రోదసీలోకి వెళ్లారు. ఏడు రోజుల తదుపరి క్షేమంగా భువికి దిగి వచ్చారు. ఆయన ప్రస్తుతం మద్రాసులో విశ్రాంత జీవితం గడుపుతున్నారు.

ఆక్సియం 4 మిషన్‌కు శుభాంశు శుక్లా పైలెట్. కాగా కమాండర్ పెగ్గి విట్సన్ (అమెరికా), మిషన్ స్పెషలిస్ట్ స్లావోజ్ ఉజ్నాన్స్కీ– విజ్నీవ్స్కీ (పోలాండ్), మిషన్ స్పెషలిస్ట్ టిబోర్ కపు (హంగేరీ) ఆయన సహ యాత్రికులు. వారు రమారమి 433 గంటలు, 18 రోజులపాటు భూగోళం చుట్టూ 288 సార్లు పరిభ్రమించారు. మొత్తం 76 లక్షల మైళ్ళు ప్రయాణించారు. వారు సోమవారం సాయంత్రం 4:45 గంటలకు స్పేస్ స్టేషన్ నుంచి తిరుగు ప్రయాణ వాహన నౌక స్పేస్ఎక్స్ డ్రాగన్‌లో ప్రవేశించారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు కాలిఫోర్నియా తీరంలో పసిఫిక్ మహాసముద్రంలో పడిన క్యాప్సూల్‌ను నౌకలు స్వీకరించి దరికి చేర్చాయి. వ్యోమగాములు భారరహిత స్థితి నుంచి భూమ్యాకర్షణ స్థితిలోకి అలవాటు పడేందుకు వారిని వారం రోజులు క్వారంటైన్‌లో ఉంచుతారు.

శుభాంశు శుక్లా తనకు నిర్దేశించిన ఏడు మైక్రోగ్రావిటీ పరీక్షలు విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో ప్రకటించింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ (ఐఐఎస్టి), శుక్లా రోదసీలోకి తీసుకెళ్లి ప్రయోగాలు చేసిన ధాన్యపు గింజలపై పరీక్షలకు సిద్ధమవుతోంది. ఆ ధాన్యాల్లో జ్యోతి, ఉమ వడ్లు, కనకమణి (ఉలవలు), వెల్లయాని విజయ్ (టోమాటో), తిలకతార (నువ్వులు), సూర్య (వంగ) ఉన్నాయి. ఈ రకాల ఎండిన గింజలను ఐఎస్ఎస్‌లో మైక్రోగ్రావిటీ పరిస్థితిలో ఉంచారు. వాటిపై మైక్రో గ్రావిటీ విశిష్ట ప్రభావాలు అధ్యయనం చేసేందుకై వాటిని భూమిపై లేబరేటరీలో పెంచుతారు. మూడు సెట్ల మచ్చులను తిరువనంతపురంలో వేర్వేరు వాతావరణాల్లో పెంచుతారు.

ఈ రోదసీ యాత్ర భారత రోదసీ శాస్త్రవేత్తల ప్రతిష్టను అంతర్జాతీయంగా పెంచుతుంది. ఈ మిషన్‌ను విజయవంతంగా నిర్వహించిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేద్దాం. ఇది మరిన్ని ప్రయోగాలకు ఉత్సాహం, ప్రోత్సాహం ఇస్తుందనటంలో సందేహం లేదు.

# ప్రపంచ వేదికపై ప్రముఖ శక్తిగా బ్రిక్స్

శ్రీనివాసన్ రమణి

చారిత్రకంగా దక్షిణ భూగోళం (గ్లోబల్ సౌత్) అనే భావన ప్రాథమికంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని దేశాల సమూహాన్ని సూచిస్తుంది. ఈ దేశాలు వలసపాలన, ప్రపంచ అసమానతలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాల చరిత్రను పంచుకున్నాయి. చారిత్రాత్మకంగా పశ్చిమ దేశాల ఆధిపత్యంలో ఉన్న ప్రపంచ క్రమాన్ని మార్చడానికి 'దక్షిణాది దేశాల మధ్య సహకారం' (సౌత్–సౌత్ కో ఆపరేషన్) పేరుతో ఈ దేశాలు అభివృద్ధిని సాధించే లక్ష్యంతో నిర్దిష్ట పద్ధతులు, నిర్వహణ భావనలను ఉపయోగించుకోవడం ద్వారా దేశాల మధ్య పరస్పర సహాయం, వాటి నడుమ సంఘీభావాన్ని పెంపొందించుకుంటాయి. ఈ ఆకాంక్షలకు 1955 నాటి బాండుంగ్ సదస్సు, అలీనోద్యమం (నామ్) వంటి మైలురాయి కార్యక్రమాలలో మూలాలు ఉన్నాయి. ఈ ఉద్యమాలు ఆర్థిక– సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడానికి ప్రయత్నించాయి. అదే సమయంలో మానవ హక్కులను ప్రోత్సహించడం, నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను (న్యూ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఆర్డర్–ఎన్ఐఇఒ) స్థాపించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

దక్షిణ భూగోళం ఏనాడూ ఏకశిలారూపంలో లేదు. విస్తారమైన భిన్న చరితలు, ఆర్థిక వ్యవస్థలు, రాజకీయ వ్యవస్థలు కలిగి ఉన్నది. అవి దాని బలానికి మూలంగా అంతర్గత విభజనలకు హేతువుగా ఉన్నాయి. ప్రపంచ సమస్యలపై ఒకే అభిప్రాయం ఏర్పరచుకునే ప్రయత్నాలను అది క్లిష్టం చేసింది. అయితే బ్రిక్స్ సమూహం మరింత బలమైన అవకాశంగా అవతరించింది. స్వాభావిక వైరుధ్యాలన్నిటినీ అధిమించే అవకాశాలు లేనప్పటికీ, దక్షిణ భూగోళంలో అనేక దేశాల లక్ష్యాలను ముందు తీసుకెళ్ళే ప్రయత్నాల క్రమబద్ధీకరణకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇటీవల రియో డి జనీరోలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఈ సవాలుకు మరింత పెద్ద ఉదాహరణగా నిలిచింది. అమెరికా, రష్యాలతో సభ్యులు భిన్నమైన సంబంధాలు కలిగినప్పటికీ, ప్రత్యేకించి ఉక్రేయిన్ సంఘర్షణ కొనసాగుతున్న నేపథ్యంలో బ్రిక్స్‌లోని ఎక్కువ మంది సభ్యులు పశ్చిమదేశాల వైఖరికి భిన్నంగా మధ్యేవాద వైఖరిని కోరుకున్నారు.

గోల్డ్‌మ్యాన్ సాక్స్ ఆర్థికవేత్త జిమ్ ఒ'నీల్ పెట్టిన ఆర్థిక సంక్షిప్తనామం 'బ్రిక్స్' 2001లో మొదలైంది. అది ప్రపంచ ఆర్థికవ్యవస్థలో 35 శాతం, ప్రపంచ జనాభాలో దాదాపు సగం కలిగి ఉన్న గణనీయమైన అంతర్ ప్రభుత్వ సంస్థగా ఉద్భవించింది. 2024లో 30 శాతం ఆర్థిక వాటా కలిగిన జి–7 దేశాలను బ్రిక్స్ అధిగమించింది. ఈ కూటమి సభ్యుల మధ్య ఆర్థిక, రాజకీయ, సామాజిక సహకారంతో పాటు అంతర్జాతీయ పాలనలో తమ సమష్టి సామూహిక ప్రభావం పెంపొందించడమనే ప్రాథమిక లక్ష్యాలు కేంద్రం గా ఉన్నాయి. ఇందులో ప్రపంచ సంస్థల్లో మరింత ప్రాతినిధ్యాన్ని కోరడం, విధానాలను సమన్వయపరుచుకోవటం, అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం వంటి అంశాలు ఇమిడి ఉన్నాయి. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి పాశ్చాత్య ఆధిపత్య ఆర్థిక వ్యవస్థలకు ప్రత్యామ్నాయాలను అందించేందుకు న్యూ డెవెలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి), కాంటిన్‌జెంట్ రిజర్వ్ అరేంజ్‌మెంట్ (సిఆర్ఎ) వంటివి ఏర్పాటుకు చొరవ తీసుకుంది.

రియో శిఖరాగ్ర సదస్సు ఈ వైఖరికి సంబంధించి అవకాశాలు, పరిమితులు రెంటినీ ప్రదర్శించింది. డిక్లరేషన్‌లో పశ్చిమ దేశాల అభిప్రాయానికి వ్యతిరేకంగా గాజా, ఇరాన్‌లపై వాడిన పదునైన పదజాలం క్లిష్టమైన ప్రపంచ రాజకీయ అంశాల విషయంలో నిజమైన ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబించింది. అలాగే పహల్గామ్ ఉగ్ర దాడిపై ఖండనను భారతదేశం విజయవంతంగా చేర్చడం ద్వారా విభిన్న భద్రతా ఆందోళనలను వ్యక్తీకరించే సమర్థతను కూటమి ప్రదర్శించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్‌కు విస్తారమైన పాత్ర, దక్షిణ భూగోళానికి మరింత ప్రాతినిధ్యం అనే దీర్ఘ కాలిక డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్ళే అంశాలను సదస్సు ఆమోదించింది. సదస్సులో "భాగస్వామ్య దేశాలు(పార్ట్‌నర్ కంట్రీస్)" అనే కొత్త కేటగిరిని ప్రవేశపెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. బెలారస్, బొలీవియా, క్యూబా, మలేసియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్ దేశాలకు అనుబంధ హోదాను కల్పించింది. సంస్థాగతంగా ఈ సృజనాత్మకత.. బ్రిక్స్ తన ఆది సభ్యత్వ చట్రాన్ని మించి దక్షిణ భూగోళం నుంచి భాగస్వాములను విస్తృతంగా ఇముడ్చుకునే దిశలో ఎదుగుతోంది.





### ప్రాధాన్యతలు, వాస్తవాలు

విభిన్న ప్రాంతీయ నేపథ్యాలలో, ప్రాధాన్యతలలో బ్రిక్స్ సభ్యులను పరిశీలించినట్లయితే దక్షిణ భూగోళ వైవిధ్యం స్పష్టంగా కనబడుతుంది. పర్యావరణ అంశాలు, సుస్థిర అభివృద్ధిపై బ్రెజిల్ దృష్టి సారించడం ద్వారా అమెజాన్ దట్టమైన అడవుల సంరక్షణలో ఆ దేశ పాత్రను ప్రతిబింబిస్తోంది. సాంకేతికత, సేవల రంగాలను భారత దేశం నొక్కి చెప్పడం, భౌగోళిక ఐటి శక్తి కేంద్రంగా దేశం ఆవిర్భవించడాన్ని ప్రతిబింబిస్తోంది. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ అనేది దక్షిణ దేశాల సహకారంతో చైనా భారీ ఆశలు పెట్టుకున్న కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇందులో రుణ గ్రహీత దేశాలకు సంబంధించి రుణ పరాధీనతను సృష్టిస్తుందేమోననే ఆందోళనలను కూడా కలిగిస్తోంది. భౌగోళిక ప్రదేశం ఉత్తర భూగోళంలోనే అధికభాగం ఉన్నప్పటికీ రష్యాను కలుపుకోవడం ద్వారా బిక్స్ పాశ్చాత్య ఆధిపత్యాన్ని సవాలు చేసేందుకు సాధారణ భౌగోళిక సరిహద్దులను దాటుకొని వెళ్ళడాన్ని ప్రతిబింబిస్తోంది. బ్రిక్స్–అంతర్గత వ్యాపారం జి–7 దేశాల కంటే శరవేగంగా పెరుగుతోంది. ఇది భౌగోళిక ఆర్థిక కార్యకలాపాలలో స్థిరమైన మార్పును ప్రదర్శిస్తోంది. బ్రెజిల్, చైనా మధ్య వ్యాపారం 20 ఏళ్ళలో 50 రెట్లు పెరగగా, అదే సమయంలో చైనా–భారత్‌ల మధ్య వ్యాపారం 28 రెట్లు పెరిగింది. ప్రపంచ బ్యాంక్ ఐఎంఎఫ్‌వంటి సాంప్రదాయ ద్రవ్య సంస్థలు వదిలేసిన చోట సుస్థిర అభివృద్ధి, మౌలికసదుపాయాల కల్పన ప్రాజెక్టులకు ఎన్‌డిబి ప్రత్యామ్నాయంగా నిధులు కేటాయిస్తున్నది. అయినప్పటికీ, పాశ్చాత్య ఆర్థిక ఆధిపత్యాన్ని సవాలు చేసే మార్గంలో తీవ్రమైన ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రపంచ ప్రధాన రిజర్వ్ కరెన్సీగా అమెరికా డాలర్ కొనసాగుతూ, విస్తారంగా అత్యధిక ప్రపంచ వ్యాపార లావాదేవీలలో వినియోగించబడుతోంది. డాలర్‌పై తక్కువగా ఆధారపడాలని బ్రిక్స్ చెబుతున్నప్పటికీ, ఆమోదయోగ్య ప్రత్యామ్నాయ కరెన్సీ వ్యవస్థను సృష్టించడంలో అనేకమైన సాంకేతిక, రాజకీయ అడ్డంకులు ఎదురవుతున్నాయి. బ్రిక్స్‌ను విమర్శనాత్మకంగా పరిశీలించినట్లయితే దక్షిణాది మధ్య దేశాల సహకారంలో విస్తృత సవాళ్ళను ప్రతిబింబించే స్వాభావిక వైరుధ్యాలు కనిపిస్తాయి. సంఘీభావం, పరస్పర లబ్ధి అనే ఉద్ఘాటనలు బలంగా వినిపిస్తున్నా వ్యక్తిగత సభ్యులు తమ జాతీయ ప్రయోజనాల కోసం చేసే ప్రయత్నాలు సామూహిక లక్ష్యాలను మరుగు పరుస్తున్నాయి. ఇదిలా వుండగా, బ్రిక్స్ అభివృద్ధి పట్ల పాశ్చాత్య శక్తులు నిశ్చేష్ట పరిశీలకులుగా లేవు. ఏకపక్ష టారిఫ్‌లు, ఇరాన్‌పై సైనిక దాడులపై బ్రిక్స్ విమర్శలపై డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ 'అమెరికా వ్యతిరేక బ్రిక్స్ విధానాలతో ఏకీభవించే ఏదేశమైనా సరే 10 శాతం అదనపు టారిఫ్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బ్రిక్స్ దేశాలు రిజర్వ్ కరెన్సీ అమెరికన్ డాలర్‌ను మార్చే ప్రయత్నాలు చేస్తే 100 శాతం టారిఫ్‌లను ఎదుర్కోవాల్సి ఉంటుందని గతంలో చేసిన హెచ్చరికల తీవ్రతను తాజా ప్రకటన మరింత పెంచింది. అంతేకాకుండా, ఎదుగుతున్న దేశాలతో 'అడాప్ట్–కోఆప్ట్ (అంగీకరించు, చేర్చుకొను)' అనే ధోరణిని పాశ్చాత్యవ్యవస్థలు ప్రదర్శిస్తున్నాయి. ఆధిపత్య పాశ్చాత్య శక్తుల చేతిలోనే నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తి ఉన్నప్పటికీ, ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలకు తమ వద్ద తమతో సమానంగా కూర్చునే వీలు కల్పించేందుకు జరిగిన రూపకల్పనగా జి–20 ఏర్పాటును చూడాలి. భారతదేశం వచ్చే ఏడాది బ్రిక్స్ నాయకత్వాన్ని స్వీకరించడానికి సిద్ధమవుతున్న తరుణంలో, 'సహకారం, స్థిరత్వం కోసం స్థితిస్థాపకత, వినూత్నతల నిర్మాణం' (బిల్డింగ్ రిసిలియెన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ కోఆపరేషన్ అండ్ సస్టేనబిలిటీ) అనే ఇతివృత్తంతో, ఈ కూటమి ఒక కీలకమైన కూడలిలో నిలవనుంది. చైనా, అమెరికాలతో సంక్లిష్ట సంబంధాలు కలిగిన అతి పెద్ద ప్రజాస్వామ్యం, భారీ ఆర్థిక వ్యవస్థ కలిగిన భారతదేశం బ్రిక్స్‌లో అంతర్గత విభజనలను పూడ్చగలిగిన ప్రత్యేక స్థానంలో ఉండే అవకాశం లేకపోలేదు. అయితే, చైనాతో కొనసాగుతున్న సరిహద్దు ఉద్రిక్తతలు, క్వాడ్ వంటి భాగస్వామ్యాల ద్వారా అమెరికాతో పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం బ్రిక్స్‌లో ఏకీకృత శక్తిగా భారతదేశ పాత్ర సంక్లిష్టం కానుంది. బ్రిక్స్ నిస్సందేహంగా, దక్షిణ భూగోళ ఆకాంక్షలకు అత్యంత స్థిరమైన వ్యవస్థాగత వ్యక్తీకరణకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రపంచ వ్యవహారాల్లో వర్ధమాన దేశాలకు అపూర్వమైన సమష్టి ఆర్థిక అవకాశాలను, రాజకీయ వాణిని ఇస్తుంది. అయినప్పటికీ, దాని ప్రస్తుత గమనం నిజమైన పరివర్తనకు కాకుండా, కేవలం అగ్రరాజ్యాల మధ్య పోటీకి మరో వేదికగా మారే ప్రమాదం ఉంది. ఈ కూటమి అంతిమ వాగ్దానం పాశ్చాత్య ఆధిపత్యం స్థానంలో సంపన్న దేశాలు కొత్త పద్ధతిలో నడిపే బహుళపక్ష వ్యవస్థ ఏర్పాటు చేయటంలో లేదు. దక్షిణ భూగోళ ప్రజల అభివృద్ధి అవసరాలకు ప్రజాస్వామ్య ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇచ్చే వేదికగా పరిణామం చెందటంలో ఉంది.

(ది హిందూ సౌజన్యంతో..)

# ఇంధనమే ప్రపంచానికి ఆయువు



సుంకవల్లి సత్తిరాజు
9704903463

శక్తి వివిధ రూపాల్లో లభిస్తుంది. ప్రపంచంలోను, భారత దేశంలోను అనేక శక్తి వనరులు నిక్షిప్తమై ఉన్నాయి. ఇందులో కొన్ని శక్తి వనరులు తరిగిపోతున్నాయి. తరిగి పోతున్న శక్తి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, పునరుత్పాదక శక్తి వనరులపై దృష్టి సారించకపోతే భవిష్యత్తులో ఇంధన కొరత తీవ్రతరమై, అనేక విపత్కర పరిణామాలు సంభవించే అవకాశముంది. జూలై 10వ తేదీన ప్రపంచవ్యాప్తంగా 'గ్లోబల్ ఎనర్జీ ఇండిపెండెన్స్ డే'గా జరుపుకుంటారు. సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగం తగ్గించి, ప్రపంచాన్ని పునరుత్పాదక ఇంధన వనరులపైన, క్లీన్ ఎనర్జీ పైన దృష్టి కేంద్రీకరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను చాటి చెప్పి, ఇంధన రంగంలో స్వయం స్వావలంబన సాధించడమే గ్లోబల్ ఎనర్జీ ఇండిపెండెన్స్ డే ముఖ్యోద్దేశ్యం.

ఇటీవల ఇజ్రాయిల్–ఇరాన్ మధ్య జరిగిన సంఘర్షణ కాల్పుల విరమణతో తాత్కాలికంగా సద్దుమణిగింది. ఇరు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధం జరిగి, ఇరాన్ గనుక హార్మూజ్ జలసంధిని మూసివేసి ఉంటే భారత్‌తో సహా పలు దేశాలు చమురు కొరతతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొని ఉండేవి. ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా భారత్ వంటి దేశాలు ఇంధన రంగంలో స్వయం సంవృద్ధి సాధించాలి. పునరుత్పాదక ఇంధన వనరుల వాడకం పెంచాలి. ప్రజల అవసరాలు పెరుగుతున్నాయి. పెరిగిన అవసరాలకు తగ్గట్టుగా అన్ని సౌకర్యాలు ప్రజలకు సమకూరడం లేదు. ఒకప్పుడు విలాసాలుగా పేర్కొనే వస్తువులు కూడా నేడు అత్యవసరాలుగా మారిపోయాయి. ఏసిలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు పనిచేయకపోతే జన జీవనమే అస్తవ్యస్తమైపోయే పరిస్థితులు దాపురించాయి. నగరాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా వీటి అవసరం పెరిగిపోయింది. వీటి నిర్వహణకు పెద్ద మొత్తంలో విద్యుచ్ఛక్తి అవసరం. ఈ విద్యుత్ తయారీకి బొగ్గు, నీరు ప్రధానం. సాంప్రదాయ ఇంధన వనరులు తరిగిపోతున్న నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. తరగని ఇంధన వనరులకోసం అన్వేషణ జరగాలి.


ప్రకృతిలో సహజసిద్ధమైన ఇంధనం 'సౌరశక్తి' ద్వారా లభిస్తుంది. సౌరశక్తి కాలుష్య రహితమే కాకుండా, నేటి విద్యుత్ కొరతను అధిగమించడానికి, ఇతర అవసరాలకు వినియోగ పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకంపై అవగాహన పెరుగుతున్నది. ఒకటేమిటి సర్వ వ్యవస్థలు ఇంధనం మీదనే నడుస్తున్నాయి. ఇంధన వనరులు లేకపోతే ప్రపంచం ఏమైపోతుందో ఊహకందని విషయం. అయితే క్రమేపీ మనం వాడుతున్న ఇంధన వనరులు తరిగిపోవడమే కాకుండా పలు రకాల పర్యావరణ సమస్యలను తెచ్చిపెట్టాయి. వాతావరణ సమతుల్యం దెబ్బతిన్నది. కలుషిత ఉద్గారాల వల్ల గాలి కాలుష్యం, జలకాలుష్యం జరిగి మానవుడు రోగాల పాలవుతున్నాడు. భూతాపం విపరీతంగా పెరిగిపోయింది. ప్రపంచమంతా 'గ్లోబల్ వార్మింగ్'పై గగ్గోలు పెడుతున్నది. పలు దేశాలు ఇప్పటికే పునరుత్పాదక ఇంధనాల (రెన్యూవబుల్ ఎనర్జీ)ను ఉపయోగించి విద్యుదుత్పత్తిని చేస్తున్నాయి. ఆస్ట్రేలియా లాంటి దేశాలు విద్యుత్‌తో నడిచే వాహనాలను పూర్తిగా వినియోగంలోకి తెచ్చి, శిలాజ ఇంధనాలైన పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా నడిచే వాహనాలను అరికట్టి, కార్బన్ డై ఆక్సైడ్ మీథేన్ లాంటి ఉద్గారాల విడుదలకు కొంతవరకు అడ్డుకట్ట వేయడం జరిగింది.



సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగంలో దూకుడుమీదున్న అమెరికా కూడా బయో ఇంధనాల వాడకంపై దృష్టి పెట్టడం ముదావహం. అయితే ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శిలాజ ఇంధనాలపైనే మక్కువ చూపడం అవివేకం. భూతాపం అనేది మిథ్యగా భావించిన అమెరికా అధ్యక్షుడు క్లీన్ ఎనర్జీ వాడకాన్ని కాకుండా శిలాజ ఇంధనాలను ప్రోత్సాహించడం దురదృష్టకరం. శిలాజ ఇంధనాలు కూడా ప్రకృతిసిద్ధంగా ఏర్పడినవే. ఇవి ఏర్పడడానికి లక్షలాది సంవత్సరాలు పట్టింది. ఇవి తరిగి పోవడానికి ఎంతో సమయం అవసరం లేదు. బొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న ప్రపంచం ఈ రకమైన ఇంధన వనరులు పరిసమాప్తమైన తర్వాత కుప్పకూలి పోక తప్పదు. అందుకే అన్ని దేశాలు రాబోవు విపత్కర పరిణామాలపై దృష్టి పెడుతున్నాయి. అయితే ఈ కృషి సరిపోదు. ఒకసారి వినియోగానికే తప్ప, పునరుత్పత్తికి, పునర్వినియోగానికి పనికిరాని సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించి, సౌరశక్తి, పవన శక్తి, తరంగ శక్తి వంటి కాలుష్య రహితమైన సాంప్రదాయేతర పునురుత్పాదక ఇంధనాలపై దృష్టి సారించాలి. బయో ఇంధనాల వాడకం వలన కూడా చాలావరకు హానికారక ఉద్గారాల శాతాన్ని తగ్గించవచ్చు. చైనా, ఆస్ట్రేలియా, ఇండియా వంటి దేశాల్లో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. ఖతార్, ఇరాన్, అమెరికా, రష్యా దేశాల్లో సహజ వాయు నిక్షేపాలు అధికం. గల్ఫ్ దేశాలు ఆర్థికంగా ముందంజలో ఉండడానికి ప్రధానమైన కారణం అక్కడ ఇబ్బడి ముబ్బడిగా ఉన్న చమురు నిక్షేపాలే కారణం. అయితే భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలను ఊహించి, తరిగిపోయే ఇంధన వనరులను త్యజించి కాలుష్యరహితమైన ఇంధన వనరులపై దృష్టి సారించాలి. భారతదేశంలో అపారమైన బొగ్గు నిక్షేపాలు, చమురు నిక్షేపాలు ఉన్నాయి. అయితే వీటిని వెలికి తీసి, ఉత్పత్తి చేయడం తలకుమించిన భారం, వ్యయంతో కూడుకున్న వ్యవహారం. జార్ఖండ్ ఒరిస్సా, బెంగాల్, తెలంగాణా వంటి రాష్ట్రాలలో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉండగా, గుజరాత్, అస్సాం, త్రిపుర వంటి రాష్ట్రాలలో సహజ వాయు నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. అయినప్పటికీ మన దేశం సౌరశక్తి, వాయుశక్తి ఆధారిత విద్యుత్‌పై దృష్టి కేంద్రీకరించడం శుభపరిణామం. సాంప్రదాయ ఇంధన వనరులకు స్వస్తి చెప్పి, సాంప్రదాయేతర ఇంధన వనరులపై ప్రత్యేక వహించాలి. అన్నింటికంటే సౌరశక్తిని విద్యుత్‌గా మార్చడం శ్రేయస్కరం. ఇది కాలుష్యరహితం, పర్యావరణ సంరక్షణకు ఉత్తమమైన ఇంధన వనరు 'సౌరశక్తి'. చైనా, అమెరికా, భారత్‌ల తర్వాత శిలాజ ఇంధనాల వినియోగంలో రష్యా, జపాన్, ఇరాన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా ఇండోనేషియా, కెనడా, యుకెలు పోటాపోటీగా ముందుకు సాగుతున్నాయి. కర్బన ఉద్గారాలు గరిష్ఠ స్థాయిలో విడుదలవుతున్నాయి. సూర్యరశ్మి, గాలి, నీరు మొదలైన వనరులను పునరుత్పాదక శక్తి వనరులుగా పిలుస్తారు. జంతువుల, మొక్కల వ్యర్థాల నుండి ఉత్పత్తి కాబడే ఇంధనాన్ని బయోమాస్ ఎనర్జీ అంటారు. ఇది కూడా పునరుత్పాదక ఎనర్జీ. పునరుత్పాదక శక్తి వనరులను వినియోగించే కొద్దీ తిరిగి భర్తీ చేయడతాయి. సౌరశక్తి, గాలి వంటి సహజసిద్ధమైన వనరులను వినియోగించుకుని కాలుష్యాన్ని తగ్గించవచ్చు. వీటి వలన పర్యావరణం కూడా పరిరక్షించబడుతుంది. పెరిగిపోతున్న గ్రీన్ హౌస్ వాయువుల శాతాన్ని తగ్గించి, గ్లోబల్ వార్మింగ్ విషయంలో ప్రపంచ దేశాలు దృష్టి సారించాలి. సహజ ఇంధన వనరుల స్థానంలో చౌకగా లభించే ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలి. శిలాజ ఇంధన వనరుల లభ్యత ఆందోళన కరమైన స్థితికి చేరుకుంటున్న నేపథ్యంలో భవిష్య పరిణామాలను ఆకళింపు చేసుకుని సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకాన్ని పెంచాలి. పైగా ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఇంధనాల వలన ప్రపంచంలో కాలుష్యం విపరీతంగా పెరిగి పోతున్నది. బొగ్గు వలన అధికంగా కాలుష్యం వెలువడుతున్నది. అమెరికా విద్యుత్ ఉత్పత్తిలో 44 శాతం బొగ్గును వినియోగిస్తున్నారు. బొగ్గు వలన కర్బన ఉద్గారాలు అధిక మొత్తంలో విడుదల కాబడి, గ్లోబర్ వార్మింగ్ పెరుగుదలకు కారణం కావడం ఆందోళనకరం. 'సౌరశక్తి' వినియోగమే ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఏకైక పరిష్కారం.

# తప్పెక్కడ జరుగుతుంది?

జన్మ పాపమా! ఆడజన్మ శాపమా! పురిటి బిడ్డ నుండి పండు ముసలి దాకా రక్షణ కోసం గావుకేకలేస్తుంటే... ఎందరో తల్లులు కడుపు కోతతో గుండెలు బద్దలవుతుంటే ఎక్కడ వెతకాలి న్యాయం. దగాకోరు రాజ్యం అనాలా! దుండగులతో ప్రజాస్వామ్యం నిండిపోయింది అనాలా! సరి చేసేది ఎవరు! చెయ్యడానికి ప్రయత్నిస్తుందెవరు! నెలలు నిండిన గర్భిణిని చూసినా కామమే! నెలల బిడ్డను చూసినా కామమే! నేలపై నడుస్తున్న ఆడపిల్లని చూసినా కామమే! రేపో మాపో పోయే ముసలమ్మను చూసినా కామమే...! అసలు 'తప్పెక్కడ జరుగుతుంది' తల్లిదండ్రుల పెంపకంలోనా! పెరిగే వాతావరణమా! స్నేహితుల సహవాసమా! అమ్మ రొమ్ము పాలు తాగే కదా అంతవాళ్లు అవుతారు మరి ఆకలి తీర్చిన రొమ్మును చూస్తే అంత కామమెందుకు మగ జాతికి. చెప్పాలంటే మగ జాతి అంటే మంచివాళ్ళు వస్తారు. అలాంటి ఆలోచనలు కలిగిన జాతిని మృగజాతి అనాలి. ఆడపిల్ల పేరులోనే వేరు చేసింది సమాజం. ఆడపిల్ల అంటే పుట్టిల్లు తనది కాదు. అత్తింటి వారు అక్కున చేర్చుకోరు. అన్ని బాధలు, అవమానాలు పడి జీవితాన్ని గెలవాలని ప్రయత్నిస్తుంటే బజారు కుక్కల్లా మీద పడి పీక్కు తింటున్నారెంటిరా..? మగాడితో సమానంగా విజయకేతనం ఎగురవేస్తున్నారు ఆడవాళ్లు. అంతరిక్షయాణం చేస్తున్నారు. దూరదేశాలు వెళ్ళి విద్యానభ్యసించి శభాష్ అనిపించుకుంటున్నారు. వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడి బేషుగ్గా బతుకుతున్నారు. తమకు తాము గౌరవం తెచ్చుకోవడమే కాకుండా కన్న వారికి ఆత్మగౌరవాన్ని ఇచ్చి సంతృప్తినిస్తున్నారు. కంటే కూతుర్నే కనాలి అనిపించుకునే రీతిగా ఈనాడు ఆడపిల్లలు వున్నారు. ఉన్న ఊరి కి, కన్న తల్లికి పేరు తీసుకురావడమే కాకుండా దేశానికి మంచి పేరు తీసుకువచ్చేందుకు మంచి గా కష్టపడుతున్నారు. అలాంటి బంగారు తల్లుల భవిష్యత్‌కి బాటలు వేయాలి గాని, బీటలు వేసి తగలెట్టేస్తూ, ముక్కలు చేస్తూ ముచ్చటైన జీవితాన్ని చెల్లాచెదురు చేసేస్తున్నారు అసలు తప్పెక్కడ జరుగుతుంది? శిక్షలు లేవనా! న్యాయస్థానాల తీర్పులు త్వరగా రావనా! పట్టించుకునే నాయకులు లేరనా! ఎక్కడ ఎక్కడ తెలుసుకునే ప్రయత్నం చెయ్యండి ప్లీజ్.. ప్లీజ్.. ఒడిని చేర్చుకొని పాలిచ్చి, లాలించి పెంచిన నీ తల్లీ ఒక ఆడది. గుండెలకు హత్తుకుని నీ కోరికను తీర్చి మరో బిడ్డకు జన్మనిచ్చే నీ ఆలీ ఒక ఆడది. అది మరచిపోయి విషం జిమ్మే పాములా బుసకొడుతూ ఆడదాని ఉసురు పోసుకోవద్దు. ప్రభుత్వాలు మారాలి అని కోరుకోవడం కాదు వాడొచ్చి ఏం చేసాడు. వీడొచ్చి ఏం పీకాడు అని కాదు మనిషిగా మన విజ్ఞత ఏమైంది మొదట తెలుసుకోవాలి కదా! ఇప్పటికీ మించిపోయింది ఏమీ లేదు. తప్పు జరిగిన చోట శిక్షలు కఠినంగా అమలు చెయ్యండి. ప్రజల్లో మార్పు వచ్చేలా జీవోలు తీసుకురండి. వ్యక్తిత్వాలు మారాలి. ఆడది వ్యసనం కాదు జీవితాన్ని ప్రసాదించిన దేవత అని తెలిసేలా చెయ్యాలి. తప్పు జరిగాక అన్ని టీవీ ఛానల్స్‌లో మూడు రోజులు ఒకే దృశ్యాన్ని చూపించి చూపించి ప్రజలకి పిచ్చెక్కించడం కాదు. తప్పు చేసినోడి ముసుగు తీసి ఎలాంటి శిక్ష విధించారో అదే టీవీ ఛానెల్స్‌లో ఒక్కరోజు చూపించినా తప్పు చెయ్యాలి అనే ఆలోచన వచ్చినోడు కూడా కుక్కిన పేనులా పడుంటాడు. విధి విధానాలు మారాలి.



మనం బావు న్నాం అది చాలు అనుకుంటూపోతే దేశంలో ఆడజాతి అంతరించిపోతుంది. అప్పుడు భవిష్యత్‌లో మగవారికి సరిపడా ఆడపిల్లలు దొరకరు. అప్పుడు అడవుల్లో జంతువుల మాదిరి దేశంలో పరిస్థితి. అంటే, బలహీన జంతువును బలం కలిగిన జంతువు పీక్కు తిన్నట్టు ఉంటుందన్న మాట. ప్రస్తుతం మన దేశంలో సగం ఈ మాదిరి ఉందని నిర్మొహమాటంగా చెప్పవచ్చు. ఇంకా చెప్పాలంటే ఆడపిల్లల్ని కనడానికి భయపడే పరిస్థితులు లేకపోలేదు. కాకపోతే, పుట్టిన బిడ్డకు ఒడ్లగింజవేసి చంపేసే ఆరోజుల నుండి పుట్టి ఊయలూగే బిడ్డను తీసుకెళ్లి తన మార్మాంగాలపై కోర్కెలు తీర్చుకునేంతగా మారింది దేశ భవిష్యత్. తప్పు తెలుసుకోవాలి. తెలియజేసే చర్యలు చేపట్టాలి. అవసరమైతే తప్పు చేసినోడి తల నరికి వెయ్యాలి, ముక్కలు చేసినవాడి చేతులు తీసెయ్యాలి. 'గాంధీ చెప్పినట్టు ఒక చెంప మీద కొడితే మరో చెంప చూపించే అహింసావాదం లేదిప్పుడు'. తల్లడిల్లుతున్న ఆడబిడ్డల తల్లులకు ప్రశాంతత కావాలి. రగిలే గుండెలకు శాంతి కావాలి.


– వాసి జ్యోత్స్న
9866843005

# ఏఐ టెక్నాలజీ అనువర్తనాలు ఎన్నో !

(జూలై 16 కృత్రిమ మేథ ప్రశంస దినోత్సవం)

ఒక ఎలక్ట్రానిక్ ఉపకరణం మానవున్ని అనుకరించడం, నేర్చుకోవడం, నిర్ణయాలను తీసుకోవడం లాంటి విధులను నిర్వహించడాన్ని కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ) చెప్పవచ్చు. నేడు ఏఐ రంగం ఒక టెక్నాలజీ అభివృద్ధే కాదని, రానున్న తరాలకు అది ఓ విప్లవంగా మానవ జీవితాలను ప్రభావితం చేయనుందని తెలుసుకోవాలి. గత కొన్ని దశాబ్దాలుగా ఏఐ ప్రారంభ స్థాయి నుంచి నేడు భాషలను తర్జుమా చేయడం, ముఖాలను గుర్తించడం, వేలి ముద్రలను పసిగట్టడం, వాహనాలను ఆటోమెటిక్‌గా నడపడం, రోగాలను నిర్ధారణ చేయడం, చికిత్సతో పాటు రోబోటిక్ సర్జరీలు చేయడం లాంటి పనులను చేసే స్థాయికి అభివృద్ధి చెందింది. 2021లో ఏఐ ప్రాధాన్యాన్ని గుర్తించిన ఏఐ హార్ట్ అను శాస్త్రజ్ఞుడు ప్రతి ఏటా జులై 16న ఏఐ ప్రశంస దినోత్సవం నిర్వహించుకోవాలని ప్రపంచ మానవాళికి సందేశం ఇవ్వడంతో అది ఒక సాంప్రదాయంగా ప్రపంచ దేశాలు జరుపుకోవడం కొనసాగుతున్నది. మానవాళి జీవనశైలితో ఏఐ ఒక విడదీయరాని సంబంధాన్ని ఏర్పరుచుకున్నది. నేడు వైద్యరంగంలో వ్యాధి నిర్ధారణ, చికిత్స, సర్జరీ లాంటి ప్రయోజనాలను కలిగి ఉన్నది. రవాణా రంగంలో ట్రాఫిక్ నియంత్రణ, ఆటోమెటిక్ వాహనాల రూపకల్పన లాంటివి జరుగుతున్నాయి. విద్యారంగంలో నూతన ఆకర్షణీయ బోధనా పద్ధతులు, ట్యూటర్ విధులను ఏఐ సుసాధ్యం చేస్తున్నది. వినియోగదారుల సేవల్లో చాట్‌బాట్, వర్చువల్ ఏజెంట్స్ లాంటి విధులు నిర్వహించడంలో ఏఐ సఫలం అవుతున్నది. పర్యావరణ పరిరక్షణలో వాతావరణ నమూనాలు, శక్తి నియంత్రణ లాంటి పలు విధులను ఏఐ నిర్వహిస్తున్నది. వీటితో పాటు వినోదం, బ్యాంకింగ్, టెలీకమ్యూనికేషన్స్, ఏటి, ఆటోమొబైల్స్, గృహ విధులు లాంటి అనేక ప్రయోజనాలను ఏఐ కలిగి ఉన్నదని మన అనుభవం చెబుతున్నది. ఏఐ రంగం వరంగానే కాకుండా శాపంగా పలు నష్టాలను కూడా చూపుతోంది. పలు అనైతిక సమస్యలు, వ్యక్తిగత డాటా దుర్వినియోగాలు, ఉద్యోగాల్లో కోతలు, ఇతర పలు లోపాలను కలిగి ఉండడంతో కొంత జాగ్రత్త వహించాల్సి వస్తున్నది. భారత్‌లో ఏఐ రంగం వేగంగా వినియోగపడుతూ, పలు విజయాలను నమోదు చేసుకున్నప్పటికీ ఇతర అభివృద్ధి చెందిన దేశాల టెక్నాలజీలతో పోల్చితే కొంత మంద గమనం జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. ఏఐ విసురుతున్న పలు సవాళ్లను అధిగమిస్తూ రానున్న రోజుల్లో ఈ రంగంలో భారత్ పటిష్టమైన అడుగులు వేయాలని కోరుకుందాం. ఏఐ ప్రశంస దినం వేదికగా ఏఐ అనువర్తనాలను వివరించడం, చర్చలు నిర్వహించడం, ఏఐ ప్రాజెక్టులను ప్రదర్శించడం, ఏఐ పరిశోధకులను గుర్తించి ప్రశంసించడం, నైతికతను కాపాడడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. ఏఐ విప్లవం చూపిన బాటలో నడుస్తూ, ఏఐ టూల్స్‌ను మానవాళి శ్రేయస్సుకు వాడుకోవడం, భారతంలో మరో తరం ఏఐ విప్లవానికి నాంది పలకడం లాంటివి జరగాలని కోరుకుందాం, మానవుడి మేధస్సుకు ఏఐ సరిసమానం కాదని కూడా నమ్ముదాం.

– డా.బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు బాంబు బెదిరింపు

**ముంబై :** బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్ కలకలం సష్టించింది. భవనంలో నాలుగు ఆర్డీఎక్స్ ఐఈడీ బాంబులు అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తులు మెయిల్ పంపడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బాంబు పేలుళ్లు సంభవిస్తాయని 'కామ్రేడ్ పినరయి విజయన్' పేరుతో ఉన్న మెయిల్ ఐడీ నుంచి ఈ బెదిరింపు సందేశం వచ్చిందని పోలీసులు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న బాంబు స్క్వాడ్ బందాలు భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు ఎటువంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని, నకిలీ బాంబు బెదిరింపు అయి ఉండవచ్చని అధికారులు పేర్కొన్నారు. మెయిల్ పంపిన గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దేశ రాజధానిలోని ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్‌లకు, సెయింట్ థామస్ స్కూల్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బందాలు గాలింపు చేపడుతున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా అనేక నివాసాలు, ఆస్పత్రులు, కళాశాలలకు వస్తున్న నకిలీ బాంబు బెదిరింపులపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## విదేశీ వ్యవహారాల మంత్రి 'పూర్తిస్థాయి సర్కస్' చేస్తున్నాడు

కాంగ్రెస్ ముఖ్యనేతలు రాహుల్‌గాంధీ, జైరామ్ రమేశ్ ధ్వజం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చైనాపై చర్చకు ప్రధాని అంగీకరిస్తారేమోనన్న ఆశాభావం



**న్యూఢిల్లీ :** రాబోయే వర్షాకాల సమావేశాలలో చైనాపై చర్చ జరిపేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చివరకు అంగీకరిస్తారని కాంగ్రె స్ పార్టీ ఆశాభావం వ్యక్తంచేసింది. 1962 చైనా దండయాత్ర సమయంలోనే సరిహద్దు పరిస్థితి గురించి పార్లమెంట్ చర్చ జరపగలిగితే ఇప్పుడు ఎందుకు చర్చ జరపకూడదని అడిగింది. విదేశీ వ్యవహారాల మంత్రి (ఇఎంఎ)ఎస్.జైశంకర్ చైనా ప్రెసిడెంట్ జీ జిన్‌పింగ్‌ను కలుసుకుని చైనాఇండియాకు సంబంధించిన ఇటీవలి ద్వైపాక్షిక సంబంధాల పరిణామాల గురించి అతనికి తెలియజేయడంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌పై విరుచుకుపడ్డారు. రాహుల్‌గాంధీ జైశంకర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శిస్తూ ఆయన భారతదేశ విదేశీ విధానాన్ని నాశనం చేసేందుకు పూర్తిస్థాయి సర్కస్ చేస్తున్నాడు అని ధ్వజమెత్తారు. 'ఇటీవలి చైనాభారత్ ద్వైపాక్షిక సంబంధాలను ప్రస్తుతించేందుకు బహుశా చైనా విదేశాంగ మంత్రి త్వరలో నరేంద్రమోదీని ప్రస్తుతిస్తారని నా అంచనా. విదేశాంగ శాఖ మంత్రి భారతదేశ విదేశీ విధానాన్ని నాశనం చేసేందుకు పూర్తిస్థాయి సర్కస్ చేస్తున్నాడు' అని రాహుల్‌గాంధీ మంగళవారం తన 'ఎక్స్' పోస్ట్‌లో చెప్పారు. జైశంకర్ సహా ది షాంఘాయ్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఓ)లో భాగస్వాములైన విదేశీ వ్యవహారాల మంత్రులు మంగళవారం చైనా ప్రెసిడెంట్ జీ జిన్‌పింగ్‌ను కలిశారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్‌రమేశ్ ఈ విషయాన్ని ఎత్తిచూపుతూ గత సంవత్సరం అక్టోబర్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా ప్రెసిడెంట్ జీ జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశం భారత్‌చైనా ద్వైపాక్షిక సంబంధాల గురించి మాట్లాడుతూ క్రమంగా మెరుగుపడుతున్నాయని జులై 14నాటి సమావేశంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, చైనా వైస్ ప్రెసిడెంట్ హన్ జెంగ్ సాధారణీకరించడం ద్వారా పరస్పరం ప్రయోజనకర ఫలితాలు వస్తాయనడం శోచనీయమన్నారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాకిస్థాన్‌కు పూర్తి సహకారం అందించి జె10సి ఫైటర్, పిఎల్15 ఇ ఎయిర్ టూ ఎమిర్ మిస్సైల్, వర్గీకరించబడిన డ్రోన్స్ తరహా నెట్‌వర్క్ కేంద్రీకృత ఆయుధ వ్యవస్థలకు వేదికలుగా మార్చిన తర్వాత చైనా ప్రెసిడెంట్ జీ జిన్‌పింగ్, ప్రధాని మోదీతో చివరిసారిగా జరిపిన చర్చల వరకూ విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ ఇటీవలి ద్వైపాక్షిక సంబంధాల పరిణామాలను కూడా తప్పక గుర్తుచేస్తే బాగుండేది' అని జైరామ్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్.సింగ్ ఆపరేషన్ సిందూర్‌లో భారతదేశం ముగ్గురు ప్రత్యర్థులతో పోరాడిందని, అందులో చైనా కూడా ఉందని, ఆ చైనా పాకిస్థాన్‌కు భారత సైనిక కార్యకలాపాలపై ప్రత్యక్ష సమాచారం ఇచ్చింది అని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ గుర్తుచేశారు. పాకిస్తాన్ సమీప భవిష్యత్తులో చైనాకు చెందిన జె35 స్టీల్ ఫైటర్లను కొనుగోలు చేసే అవకాశం ఉందని ఆయన ఎత్తిచూపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లకకు సంబంధించిన అరుదైన భూమి అయస్కాంతాలు, ప్రత్యేక ఎరువులు, టన్నెల్ బోరింగ్ యంత్రాలు వంటి కీలకమైన పదార్థాల ఎగుమతులను చైనా భారతదేశానికి పరిమితం చేసిందని జైరామ్ రమేశ్ చెప్పారు. కాంగ్రెస్ 2020లో పిలుపునిచ్చినట్లుగా, విదేశాంగ మంత్రి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారత ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని, పార్లమెంట్‌లో చైనాపై ఎప్పుడు చర్చ నిర్వహిస్తారో చెప్పాలని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు.

## సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులపై... 'ఇక మేం ఏదో ఒకటి చేయాల్సిందే'

కార్టూనిస్టు హేమంత్ మాలవీయ పిటిషన్ విచారణలో 'సుప్రీం' వ్యాఖ్యలు

పిటిషనర్‌పై బలవంతపు చర్య తీసుకోవద్దని 'బెంచ్ ' ఆదేశం



**న్యూఢిల్లీ :** సోషల్ మీడియాలో కొందరు యూ ట్యూబర్లు ఇష్టమొచ్చినట్లుగా అభ్యంతరకర పోస్టులు చేయడం పెరిగిపోవడం పట్ల సుప్రీం కోర్టు మండిపడింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్ఎస్ఎస్ వర్కర్లపై వేసిన కార్టూన్లు అభ్యంతరకరంగా ఉన్నాయంటూ తనపై నమోదైన కేసులో అరెస్ట్ నుంచి తనకు రక్షణ కల్పించాలని అభ్యర్థిస్తూ కార్టూనిస్ట్ హేమంత్‌మాలవీయ దాఖలుచేసిన పిటిషన్ మంగళవారం విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో స్పందించింది. 'ఏం చెప్పినా చెల్లిపోతుందనే ధోరణి నానాటికీ పెరిగిపోతుందని ఇలాంటి అభ్యంతరకర పోస్టుల కట్టడికి తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. 'ఇక మేం అలాంటి పోస్టులను కట్టడిచేసే విషయంలో ఏదో ఒకటి చేయాల్సిందే' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.'లోగ్ కిసీ కో భీ, కుచ్ భీ కేదేతే హై' (ప్రజలు ఎవరైనా ఏదైనా చెబుతారు) అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సుధాంశు ధులియా, అరవింద్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఈ విషయంలో మేం ఏదో ఒక టి చేయక తప్పదు' అని వ్యాఖ్యానించింది. మధ్యప్రదేశ్‌లో ఎఫ్ఐఆర్ దృష్ట్యా ప్రభుత్వం కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయపై ఈలోగా బలవంతపు చర్య తీసుకోకుండా ధర్మాసనం ఆయన్ను రక్షించింది. క్షమాపణలు చెబుతున్నామని హేమంత్ మాలవీయ తరపు న్యాయవాది వ్రిందా గ్రోవర్ హామీ ఇచ్చిన తర్వాత ఈ తీర్పు వెలువడింది. అయితే కార్టూనిస్ట్ సోషల్‌మీడియాలో ఏదైనా అభ్యంతరకర పోస్ట్‌లను పోస్టు చేయడం లేదా షేర్‌చేయడం చేస్తే చట్ట రీత్యా చర్య తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం హెచ్చరించింది. పిటిషనర్ సోషల్‌మీడియాలో ఏదైనా అభ్యంతరకర పోస్టులు పెడితే ప్రతివాద రాష్ట్రం (మధ్యప్రదేశ్) చట్ట ప్రకారం చర్య చేపట్టే స్వేచ్ఛను కలిగి ఉంటుంది అని రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం.నటరాజ్ కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయ న్యాయ వ్యవస్థకు వ్యతిరేకంగా పెట్టిన మరికొన్ని పోస్టులను ప్రస్తావించిన తర్వాత బెంచ్ ఈ ఆదేశం జారీచేసింది. 'ఇది పండోరా బాక్స్‌ను తెరుస్తుంది' అని వ్రిందాగ్రోవర్ న్యాయ అధికారి కెఎం.నటరాజ్ సమర్పణను వ్యతిరేకిస్తూ ప్రతీకారం తీర్చుకున్నారు. విచారణ సమయంలో న్యాయవాది వ్రిందా గ్రోవర్ ఇలా అన్నారు. 'ఇది పేలవమైన, భాషాపరమైన కేసు. ఇది నేరపూరితమైన భాషా లేదా చట్టవిరుద్ధమైన భాషా అని నన్ను నేను ప్రశ్నించుకుంటున్నాను' అని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'మీరు ఏ విషయంలో మాట్లాడారనేది సమస్య. మీరు చేసింది స్పష్టమైన నేరం' అని బెంచ్ వ్యా ఖ్యానించింది. తనకు ముందస్తు బెయిల్ మంజూరుకు నిరాకరిస్తూ జులై 3న మధ్యప్రదేశ్ హైకోర్ట్ జారీ చేసిన ఉత్తర్వులను కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయ సుప్రీంకోర్టులో సవాల్‌చేశారు. హేమంత్ మాలవీయ ఒక కార్టూన్ మాత్రమే వేశారని, కానీ దానిపై ఇతర ఫేస్‌బుక్ వినియోగదాలు చేసిన వ్యాఖ్యలకు ఆయన బాధ్యత వహించలేరని పిటిషనర్ హేమంత్ మాలవీయ తరపు న్యాయవాది వ్రిందా గ్రోవర్ వాదించారు.

## రాహుల్‌గాంధీకి లక్నో కోర్టు బెయిల్


**న్యూఢిల్లీ :** ఆర్మీ సిబ్బందిపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో మంగళవారం లక్నో కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసినట్లు రాహుల్ తరుపున న్యాయవాది తెలిపారు. 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా భారత సైనికులకు పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు సంబంధించిన కేసు ఇది అని ఆయన తరపు న్యాయవాది ప్రన్షు అగర్వాల్ తెలిపారు. రాహుల్ కోర్టుకు హాజరు కాగా, ఆయనకు బెయిల్ మంజూరు చేసిందన్నారు. కోర్టు ఆదేశించిన విధంగా బెయిల్ బాండ్, పూచీకత్తులను సమర్పించిన తర్వాత రాహుల్ బెయిల్ అమలులోకి వచ్చింది. పూర్తిగా న్యాయవాదుల సమక్షంలో రాహుల్‌గాంధీకి కోర్టు రూమ్‌కు హాజరయ్యారు. బాండ్, పూచీకత్తులను దాఖలు చేసే లాంఛనాలు పూర్తయిన తరువాత న్యాయమూర్తి గదికి ఆయనను తీసుకెళ్లారు. కోర్టు పరువు నష్టం ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న తర్వాత గాంధీకి సమన్లు జారీ చేసింది. కాగా, పార్టీ రాష్ట్ర యూనిట్ అధ్యక్షుడు అజయ్ రాయ్, ఇన్‌ఛార్జ్ అవినాష్ పాండేతో కలిసి రాహుల్‌గాంధీ కోర్టుకు వచ్చారు. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (ఆర్మీలో కల్నల్ హోదాకు సమానం) రిటైర్డ్ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ రాహుల్‌పై పరువు నష్టం ఫిర్యాదును దాఖలు చేశారు. డిసెంబర్ 16, 2022న, భారత్ జోడో యాత్ర సందర్భంగా గాంధీ వివిధ మీడియా సిబ్బంది, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, డిసెంబర్ 9 (2022)న అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులో భారత సైన్యం, చైనా సైన్యం మధ్య జరిగిన ఘర్షణ గురించి ప్రస్తావించారని, 'భారత్ జోడో యాత్ర గురించి ప్రజలు ఏమి అడుగుతారు, కానీ చైనా సైనికులు మన సైనికులను కొట్టడం గురించి ఒక్కసారి కూడా అడగరు' అని అన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చైనా సైనికులు భారత సైనికులను కొట్టారని గాంధీ చేసిన ప్రకటన తన మనోభావాలను దెబ్బతీసిందని ఫిర్యాదుదారుడు ఆరోపించాడు.

## భూసేకరణపై వెనక్కి తగ్గిన సిద్ధరామయ్య సర్కార్

**బెంగళూరు :** మూడున్నరేళ్లుగా రైతులు, భూహక్కుల కార్యకర్తలు సాగిస్తున్న పోరాటానికి కర్నాటక ప్రభుత్వం తల వంచింది. ఫలితంగా దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్న హుబ్లి వద్ద 1,777 ఎకరాల రైతు భూములను సేకరించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకున్నట్టు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం ప్రకటించారు. బెంగళూరు రూరల్ జిల్లా చెన్నరాయపట్నం, సమీప గ్రామాల్లో 1,777 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను సేకరించాలన్న కర్నాటక ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా మూడున్నర ఏళ్లుగా రైతులు, భూహక్కు పరిరక్షణ కార్యకర్తలు తీవ్ర నిరసనలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో హైటెక్ డిఫెన్స్, ఏరోస్పేష్ పార్క్ పెట్టాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. రైతుల సుదీర్ఘ ఆందోళన నేపథ్యంలో సిద్ధరామయ్య అధ్యక్షతను మంగళవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది. భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చే రైతుల నుంచి మాత్రమే పరిహారం చెల్లించి భూములు సేకరించాలని నిర్ణయం తీసుకుంది. ప్రతిపాదిత భూసేకరణ ప్రక్రియను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్టు సమావేశానంతరం సిద్ధరామయ్య ప్రకటించారు. స్వచ్ఛందంగా ఎవరైనా భూములు ఇచ్చేందుకు వస్తే అభ్యంతరం లేదన్నారు.

## ఐదేళ్లలో 65 విమాన ఇంజిన్ వైఫల్యాలు

కీలక విషయాలు వెల్లడించిన డిజిసిఎ నివేదిక



**న్యూఢిల్లీ :** ఎయిరిండియా విమాన ప్రమాదం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. తమ విమానాల ఇంజిన్‌లు, ఇంధన స్విచ్‌లు వంటి విషయాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విడుదల చేసిన ఒక నివేదిక అనేక కీలక విషయాలను వెల్లడించింది. దేశ వ్యాప్తంగా గత ఐదేళ్లలో 65 విమాన ఇంజిన్ వైఫల్యాలు చోటుచేసుకున్నాయని పేర్కొంది. జనవరి 1, 2024 నుంచి మే 31, 2025 మధ్యలో 11 మే డే కాల్స్ నమోదయినట్లు తెలిపింది. విమానాలు లేదా నౌకలు తీవ్ర ముప్పులో చిక్కుకుని... అందులోని ప్రయాణికుల ప్రాణాలు తీవ్ర ప్రమాదంలో పడినప్పుడు తక్షణ సాయం కోరుతూ పైలట్లు మే డే సందేశాన్ని పంపుతారు. అయితే ఈ 11 మే డే కాల్స్ వచ్చినప్పటికీ పైలట్లు చాకచక్యంగా వ్యవహరించి ఆయా విమానాలను సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రమాదం తప్పిందని పేర్కొంది. చాలావరకు విమానాల్లో తలెత్తిన సమస్యలను పైలట్లు పరిష్కరిస్తున్నప్పటికీ కొన్ని సమయాల్లో ఆ అవకాశం ఉండకపోవచ్చని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విమాన ప్రమాదాలకు ఇంధన ఫిల్టర్లు బ్లాక్ అవ్వడం, టర్బైన్ లోపాలు, ఇంధన కాలుష్యం, ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడం వంటివి ప్రధాన కారణాలుగా ఉంటున్నాయని భారత పైలట్ల సమాఖ్య అధ్యక్షుడు కెప్టెన్ సీఎస్ రంధ్వా పేర్కొన్నారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఎయిర్ సేఫ్టీ డైరెక్టర్ జోసెఫ్ మాట్లాడుతూ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడం ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్నప్పటికీ భారత విమానయాన సంస్థలకు చెందిన విమానాల్లో తరచూ సమస్యలు గుర్తిస్తుండడం ఆందోళనకరమైన అంశమని అన్నారు. ఇంధన స్విచ్‌ల వైఫల్యం వల్ల ఎయిరిండియా విమానం కూలినట్లు ప్రాథమిక నివేదిక వెల్లడించిన నేపథ్యంలో భారతీయ విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్న లోపాలపై డీజీసీఏ దష్టిపెట్టిందని జోసెఫ్ తెలిపారు. ఎయిరిండియా ప్రమాదం తర్వాత విమానయాన సంస్థలు తమ బోయింగ్ 787, 737 విమానాలలో ఇంధన స్విచ్ లాకింగ్ వ్యవస్థను తనిఖీ చేయాలని ఆదేశించిందన్నారు. భారత్‌కు చెందిన ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ ఎయిర్, స్పైస్‌జెట్ వంటి సంస్థలు ప్రస్తుతం బోయింగ్ 787, 737 రకం విమానాలను నడుపుతున్నాయి. బోయింగ్ ఇంధన స్విచ్‌లపై ముందే హెచ్చరించిన బ్రిటన్ అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై వెలువడిన ప్రాథమిక నివేదికలో ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడం ప్రస్తావించిన సంగతి తెలిసిందే. దీంతో ఇంధన స్విచ్‌లపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో బ్రిటన్‌కు చెందిన పౌర విమానయాన అథారిటీ కీలక ప్రకటన చేసింది. ఈ ప్రమాద ఘటనకు నాలుగు వారాల ముందే బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌లపై హెచ్చరికలు చేసినట్లు పేర్కొంది. 787 డ్రీమ్ లైనర్‌తో సహా ఐదు రకాల బోయింగ్ విమానాల ఇంధన స్విచ్‌లపై మే 15న ఓ భద్రతా నోటీసు జారీ చేసినట్లు సీఏఏ తెలిపింది. అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) నిర్వహించిన ఎయిర్‌వర్తినెస్ డైరెక్టివ్‌లో ఆయా విమానాల్లో ఇంజిన్ ఇంధన షటాఫ్ వాల్వ్ యాక్టువేటర్స్ గురించి హెచ్చరికలు చేసిందని పేర్కొంది. దీంతో ఆయా విమానాల ఇంధన షట్ ఆఫ్ వాల్వ్‌లకు రోజువారీ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించింది.

---

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

G2/864/2025 Dt: 01.07.2025
Gaz. No.101/2025

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

**ఫారం. 6, ప్రాథమిక ప్రకటన**

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని సాయినిపల్లి గ్రామము వద్ద **ప్యాకేజి నెం.29 మార్కేండేయ లిఫ్ట్ యొక్క సాయినిపల్లి కెనాల్ సబ్ మైనర్ 1 ఆర్** గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన **ఎ.5.19 గుంటలు/సెంట్లు** భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా **మార్కేండేయ లిఫ్ట్ యొక్క సాయినిపల్లి** కెనాల్ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని **ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి** నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ.లు 5.19 గు.** భూమి **మార్కేండేయ లిఫ్ట్ యొక్క సాయినిపల్లి కెనాల్ సబ్ మైనర్ 1 ఆర్ కెనాల్** నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: సాయినిపల్లి మండలం: బిజినపల్లి జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ప్రభుత్వం ఇత., | భూమి వర్గీకరణ | సేకరించవలసిన విస్తీర్ణం | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 229 | పట్టా | మెట్ట | 0.06 | పీరు తండ్రి (0.06)<br>ఆర్. దేవులా తండ్రి తూక్యా<br>యం. అంజనేయులు తండ్రి లక్ష్మణ్<br>యం. మస్రు తండ్రి మస్రు<br>చిన్న వెంకటయ్య తండ్రి (0.06) | VB | 230 | 232 | 229 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 227 | [illegible] పట్టా | మెట్ట | 1.11 | కుర్మయ్య తండ్రి (0.07)<br>నర్సయ్య తండ్రి (0.04)<br>ఇతరులు (0.09)<br>కమ్మి భర్త (0.14)<br>వాగు (0.01)<br>రాములు తండ్రి (0.06)<br>భగవత్ తండ్రి(0.04)<br>సి.శంకర్ తండ్రి రామాస్వామి<br>నర్సియా తండ్రి బాల్యా<br>లంబాడి లచ్య తండ్రి రూప్లా<br>లంబాడి కేడి తండ్రి దేవ<br>యం. సీతారాములు తండ్రి నాన్య<br>యం. హన్మంతు తండ్రి నాన్య<br>యం.రామంజ తండ్రి తుల్సియా<br>చంద్రమ్మ భర్త బాల్యా<br>ఎన్. కృష్ణయ్య తండ్రి బుచ్చన్న<br>ఎన్. నాగమ్మ భర్త పుల్లయ్య<br>పెద్ద బాలయ్య తండ్రి చిన్న చంద్రయ్య<br>పెద్ద నిరంజన్ తండ్రి కొమ్ములయ్య | 231 | VB | 227/2 | 228 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 230 | పట్టా | మెట్ట | 0.09 | అమ్ము భర్త (0.09)<br>లంబాడి మేగ్య తండ్రి హీర్య<br>ఆర్. పీరు తండ్రి హర్య<br>పి. సీతమ్మ భర్త హర్య<br>పి. భాస్కర్ తండ్రి హర్య<br>పి. అంజనేయులు తండ్రి హర్య<br>పి. రవిందర్ తండ్రి హర్య<br>పి. నార్యా తండ్రి హర్య<br>పి. అలివేల భర్త అంజనేయులు<br>పి. బాలు తండ్రి పి. నరియా<br>పి.చంద్రశేఖర్<br>ఆర్. లక్ష్మి భర్త పీరు తండ్రి ధన్ సింగ్<br>పి. తుక్య తండ్రి ఛత్రు<br>పి. హన్మంతు తండ్రి దీప్లా | 232 | 228 | 231 | 229 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 226 | పట్టా | మెట్ట | 0.03 | వెంకటయ్య తండ్రి (0.03)<br>యం. లక్ష్మ య్య తండ్రి<br>ఆర్. దేవులా తండ్రి తుక్యా<br>బి. భగవంతు తండ్రి నాగన్న<br>బి. దస్తగిరి తండ్రి నాగయ్య<br>ఆర్. గోపాల్ తండ్రి బాల్యా | - | - | - | - | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 225 | పట్టా | మెట్ట | 0.18 | బాబీ భర్త (0.07)<br>వాల్యా తండ్రి (0.04)<br>తిరుపతయ్యతండ్రి (0.07)<br>బోయ శ్రీశైలం తండ్రి రాములు<br>ఆర్. గోపాల్ తండ్రి బాల్యా<br>ఆర్. వాల్యా తండ్రి బాల్యా<br>ఆర్. కీరి భర్త బాల్యా<br>బి. వీరయ్య తండ్రి సాయన్న<br>ఎన్. ఎల్లమ్మ భర్త రాములు<br>వెంకటయ్య తండ్రి సాయన్న<br>బి. బుచ్చన్న తండ్రి కాశన్న<br>చంద్రయ్య తండ్రి సాయన్న<br>బి. తిరుపతమ్మ భర్త రాములు<br>రాములమ్మ భర్త కిష్టయ్య | 237 | 227/1 | 224 | 226 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 224 | పట్టా | మెట్ట | 0.25 | రాములు తండ్రి (0.08)<br>వెంకటయ్య తండ్రి (0.06)<br>కుర్మయ్య తండ్రి (0.05)<br>నర్సింహ్మా తండ్రి(0.06)<br>ఎచ్. శ్రీను తండ్రి నాగయ్య<br>వెంకటయ్య తండ్రి నాగయ్య<br>బి. భగవంతు తండ్రి నాగన్న<br>బి. దస్తగిరి తండ్రి నాగయ్య<br>కె. కాలికమ్మ భర్త చిన్న నాగన్న<br>బి. కుర్మయ్య తండ్రి దస్తగిరి<br>బి. కుర్మయ్య తండ్రి రాములు<br>బి. అశోక్ తండ్రి తిరుపతయ్య<br>బి. నాగయ్య తండ్రి రాములు<br>బి. బాలస్వామి తండ్రి చిన్న రాములు<br>బి. దస్తగిరి తండ్రి చిన్న రాములు<br>నర్సింహ్మా తండ్రి నాగయ్య<br>బి. కొండమ్మ భర్త పర్వతాలు<br>బి. బంగారయ్య తండ్రి మాసయ్య<br>చిన్న రామయ్య తండ్రి నాగన్న తండ్రి బుచ్చన్న<br>వెంకటమ్మ భర్త చంద్రయ్య | 237 | 227/1 | 239 | 225 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 239 | పట్టా | మెట్ట | 0.13 | ఆరే తండ్రి (0.00 1/3)<br>చంద్రుడు తండ్రి (0.00 1/3)<br>బిల్య తండ్రి (0.00 1/3)<br>సర్య తండ్రి (0.00 1/3)<br>రామన్ తండ్రి (0.05)<br>బిచ్చన్న తండ్రి (0.02)<br>కమిలి భర్త (0.03)<br>లంబాడి కేడి తండ్రి దేవ్లా<br>బి. రాజమ్మ భర్త సీతారాములు<br>యం. సక్రి తండ్రి అంజనేయులు<br>నర్సింహ్మా తండ్రి నాగయ్య<br>ఎల్. శంకరయ్య తండ్రి కిషన్<br>యం. రామంజ తండ్రి బీల్యా<br>బి. కుర్మయ్య తండ్రి దస్తగిరి<br>బి. అశోక్ తండ్రి తిరుపతయ్య<br>ఎల్. హర్య తండ్రి బాల్యా<br>బి. కొండమ్మ భర్త పర్వతాలు<br>బి. బంగారయ్య తండ్రి మాసయ్య<br>సోంలా తండ్రి తాయర్యా<br>అంజనేయులు తండ్రి సోంలా<br>లంబాడి నార్య తండ్రి తార్య<br>యం. కార్తిక్ తండ్రి జయరాములు<br>యం. రామంజ తండ్రి తుల్సియా<br>యం. సీతారాములు తండ్రి నాన్య<br>హసిలి భర్త చంద్రు<br>యం. సక్రి భర్త అంజనేయులు<br>అంజనేయులు తండ్రి సోంలా<br>యం. శ్రీను తండ్రి దేవులా<br>ఇ. చాంది భర్త మత్రు<br>ఎల్. శంకర్ తండ్రి సోంలా<br>పి. లక్ష్మి భర్త మహేష్<br>కమల భర్త రవి<br>యం. నారమ్మ భర్త బిచ్యా<br>బి. సీతారాములు తండ్రి భక్య<br>యం. గోపాల్ తండ్రి బిచ్యా<br>యం. జయరాం తండ్రి బీచ్యా<br>ఎల్. చంద్రు తండ్రి బాల్యా<br>లచ్చ తండ్రి రూప్లా<br>యం. దేవి భర్త పొండు | 238 | x | 215 | 224 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 216 | పట్టా | మెట్ట | 0.12 | నిరంజన్ తండ్రి (0.10)<br>కొండలయ్య తండ్రి (0.02)<br>ఎన్. ఎల్లమ్మ భర్త రాములు<br>ఎన్. తారకరాముడు తండ్రి నిరంజన్<br>ఎన్. తరుణ్ కుమార్ తండ్రి నిరంజన్<br>బి. వీరయ్య తండ్రి సాయన్న<br>బాలమ్మ భర్త బుచ్చన్న<br>పెద్ద కొండయ్య తండ్రి బుచ్చన్న<br>చిన్న కొండయ్య తండ్రి బుచ్చన్న<br>బి. శ్రీశైలం తండ్రి రాములు<br>బి. రాములు తండ్రి సాయన్న<br>యం. దేవిలి భర్త రాము<br>పెద్ద నిరంజన్ తండ్రి రాము<br>ఎన్. వెంకటమ్మ భర్త కొండయ్య<br>బి. తిరుపతమ్మ భర్త రాములు<br>రాములమ్మ భర్త కిష్టయ్య | 239 | x | 215 | 227/13 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 217 | పట్టా | మెట్ట | 0.21 | మన్నెం తండ్రి (0.02)<br>శ్రీను తండ్రి (0.01)<br>కృష్ణయ్య తండ్రి (0.01)<br>బాల్ రాజు తండ్రి (0.02)<br>వెంకటరాములు తండ్రి (0.04)<br>జయరాములు తండ్రి (0.04)<br>మన్నెమ్మ భర్త (0.04)<br>హద్దు గస్తా (0.01)<br>శ్రీశైలం తండ్రి (0.01)<br>సి. లక్ష్మి భర్త జయరాములు<br>సి. మల్లేష్ తండ్రి సత్యం<br>సి. వెంకటరాములు తండ్రి చిన్న రాములు<br>సి. నారాయణ తండ్రి రాములు<br>సి. శ్రీరాములు తండ్రి రాములు<br>సి. బాలరాజు తండ్రి నాగన్న<br>సి. కృష్ణయ్య తండ్రి నాగన్న<br>సి. శ్రీనివాసులు తండ్రి నాగన్న<br>శిరిశ భర్త కృష్ణయ్య<br>యం. అనురాధ భర్త వెంకటయ్య<br>నారాయణ తండ్రి ఎర్రన్న<br>శాంతమ్మ భర్త కృష్ణయ్య<br>సి. బాలస్వామి తండ్రి ఎర్రన్న<br>సి. తిరుపతయ్య తండ్రి ఎర్రన్న | 215 | 218 | 206 | x | లేవు | లేవు | లేవు | లేవు |
| 10 | 206 | పట్టా | మెట్ట | 0.19 | శ్రీను తండ్రి (0.02)<br>వెంకటయ్య తండ్రి (0.02)<br>కృష్ణ తండ్రి (0.02)<br>సత్యం తండ్రి (0.04)<br>లక్ష్మి నారాయణ తండ్రి (0.04)<br>శ్రీను తండ్రి (0.04)<br>మన్నెం తండ్రి (0.01)<br>ఉ. కృష్ణయ్య తండ్రి కొండయ్య<br>ఉ.శివ తండ్రి కొండయ్య<br>ఉ. అలివేల భర్త కొండయ్య<br>ఉ. రామకృష్ణ తండ్రి బాలపీరు<br>ఉ. పార్వతమ్మ భర్త ఈశ్వరయ్య<br>ఉ. కురుమూర్తి తండ్రి రామకృష్ణ<br>ఉ. బాలపీరు తండ్రి కొండయ్య<br>మన్నెం తండ్రి రాములు | 207 | 205 | 201 | 217 | లేవు | లేవు | లేవు | లేవు |
| 11 | 201 | పట్టా | మెట్ట | 0.16 | సి. మల్లేష్ తండ్రి సత్యం<br>ఉ. రాములు తండ్రి కొండయ్య<br>సి. వెంకటరాములు తండ్రి చిన్న రాములు<br>సి. శ్రీనివాసులు తండ్రి చిన్న రాములు<br>సి. శిరిశ తండ్రి లక్ష్మి నారాయణ<br>ఉ. వెంకటయ్య తండ్రి పెంటయ్య<br>సి. లక్ష్మి నారాయణ తండ్రి చిన్న రాములు<br>ఉ. లక్ష్మమ్మ భర్త రామకృష్ణ<br>మన్నెం తండ్రి రాములు<br>రామకృష్ణ తండ్రి (0.03)<br>ఈశ్వరయ్య తండ్రి(0.03)<br>కొండయ్య తండ్రి (0.03)<br>త్యాగ రాములు తండ్రి (0.02)<br>నరమోని మన్నెం తండ్రి (0.02)<br>సత్యం తండ్రి(0.03)<br>ఉ. అలివేలు భర్త కొండయ్య<br>ఉ.రామకృష్ణ తండ్రి బాలపీరు<br>ఉ. పార్వతమ్మ భర్త ఈశ్వరయ్య<br>ఉ. కురుమూర్తి తండ్రి రామకృష్ణ<br>ఎన్. ఎల్లమ్మ భర్త రాములు<br>సి. వెంకటరాములు తండ్రి చిన్న రాములు<br>రాగి మల్లేష్ తండ్రి రాములు<br>ఆర్. నాగరాజు తండ్రి రాములు<br>ఆర్. మల్లేష్ తండ్రి రాములు<br>సి. లక్ష్మి నారాయణ తండ్రి చిన్న రాములు<br>మన్నెం తండ్రి రాములు<br>సి. శ్రీనివాసులు తండ్రి చిన్న రాములు<br>ఉ. కొండయ్య తండ్రి బాల పీరు<br>ఉ. శంకర్ తండ్రి కొండయ్య<br>రేఖదేవి భర్త జనార్ధన్ రెడ్డి<br>ఉ. ఈశ్వరయ్య తండ్రి పెద్ద బాలపీరు<br>పి. లక్ష్మి తండ్రి యాదయ్య<br>సి. శివ శంకర్ తండ్రి సత్యం | x-1 | 202 | 199 | 206 | లేవు | లేవు | లేవు | లేవు |
| 12 | 199 | పట్టా | మెట్ట | 0.13 | సాకలి మన్నెం తండ్రి (0.03 1/2)<br>వెంకటయ్య తండ్రి (0.03 1/2)<br>సత్యం తండ్రి (0.02)<br>లక్ష్మి నారాయణ తండ్రి (0.02)<br>శ్రీను తండ్రి (0.02)<br>జి. లక్ష్మి తండ్రి మన్నెం<br>సరళా దేవి భర్త జనార్ధన్ రెడ్డి<br>సి. శివ శంకర్ తండ్రి సత్యం<br>శ్రీనివాసులు తండ్రి చిన్న రాములు<br>సి. లక్ష్మి నారాయణ తండ్రి చిన్న రాములు<br>సి. వెంకటరాములు తండ్రి చిన్న రాములు<br>మన్నెం తండ్రి రాములు<br>టి. తిరుపతయ్య తండ్రి బాలపీరు<br>జి. చెన్నయ్య తండ్రి నారాయణ<br>జి. మహేష్ తండ్రి నారాయణ<br>ఆర్. మణెమ్మ భర్త బంగారయ్య<br>జి. సైదమ్మ భర్త నారాయణ<br>జి. నారాయణ తండ్రి తిమ్మన్న<br>జి. లక్ష్మి భర్త మన్నెం<br>ఉ. యాదగిరి తండ్రి వెంకటయ్య<br>ఉ. శివుడు తండ్రి వెంకటయ్య<br>ఎన్. నాగయ్య తండ్రి లక్ష్మయ్య<br>ఎన్. నర్సింహ్మా తండ్రి లక్ష్మయ్య<br>ఎన్. యాదగిరి తండ్రి లక్ష్మయ్య<br>ఎన్. వెంకటేష్ తండ్రి లక్ష్మయ్య | x-1 | 198 | 196 | 201 | లేవు | లేవు | లేవు | లేవు |
| 13 | 172 | పట్టా | మెట్ట | 0.03 | తిరుపతయ్య తండ్రి (0.03)<br>చాకలి అలవేలమ్మ భర్త కృష్ణయ్య | 171 | 173 | 171 | 196 | లేవు | లేవు | లేవు | లేవు |
| 14 | 173 | పట్టా | మెట్ట | 0.10 | నిరంజన్ తండ్రి 0.03)<br>జామ్లు తండ్రి (0.03)<br>రాములు తండ్రి (0.03)<br>హద్దు రస్తా (0.01)<br>కె. శాంతమ్మ భర్త నాగయ్య<br>కె. బాలరాజు తండ్రి నాగన్న<br>ఆర్. జయమ్మ భర్త రామాంజ<br>బి. సతీష్ తండ్రి అంజనేయులు<br>సి. వెంకటయ్య తండ్రి నాగన్న<br>కె. వరంజ్యోతి భర్త సుదర్శన్ రెడ్డి<br>లక్ష్మి నారాయణ తండ్రి నాగన్న<br>వి. శివయ్య తండ్రి కొండయ్య<br>ఆర్. అర్జున్ తండ్రి పెద్ద నాగన్న<br>ఆర్. రాంజా తండ్రి జంప్లా<br>సుదర్శన్ రెడ్డి తండ్రి లక్ష్మ రెడ్డి<br>పవన్ కుమార్ రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి<br>కె. నవీన్ కుమార్ రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి<br>కె. శారద భర్త లక్ష్మారెడ్డి<br>కె. శారద భర్త లక్ష్మారెడ్డి<br>టి. అశోక్ తండ్రి వెంకటయ్య<br>టి.శివకుమార్ తండ్రి వెంకటయ్య<br>కె. మధుసుదన్ రెడ్డి తండ్రి చిన్న రాములు<br>కె. శాంతమ్మ భర్త నాగయ్య<br>కె. శ్రీనివాస్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి<br>కె. చిన్నరెడ్డి తండ్రి నారాయణ రెడ్డి<br>టి. కుర్మయ్య తండ్రి యం. కుర్మయ్య<br>కె. బచ్చరెడ్డి తండ్రి శేఖర్ రెడ్డి | 171/1 | 194 | 174 | 196 | లేవు | లేవు | లేవు | లేవు |
| | మొత్తం : 5.19 | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, **యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్,** మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా **ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్** గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సేకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది.25.07.2017 ద్వారా భూసేకరణ, నష్ట పరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము- II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), యూనిట్-1, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్

సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్

సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO.377/LA/PP/Advt/Pub/2025-26

## మహిళా సాధికారత సాధనే లక్ష్యం

**ప్రజాపక్షం/యాదాద్రి :** మహిళా సాధికారత సాధనే ప్రభుత్వ లక్ష్యంమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తుందని, మహిళా స్వయం సహాయక సంఘాలకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణాలు, లోన్ బీమా, బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం చెక్కులను పంపిణీ కార్యక్రమం తేది. 16.7. 2025 న ఉదయం 11.00 గంటలకు భువనగిరి నియోజకవర్గంలో భువన గిరి పట్టణంలో గల ఏఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొంటారని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, జిల్లా, మండల మహిళా సమాఖ్యల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొంటారు.



## పోలీస్ కుటుంబానికి ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు పనిచేస్తున్న కానిస్టేబుల్ కృష్ణయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడం జరిగింది. దివంగత పోలీస్ సిబ్బంది కుటుంబాల ఆవసరాల తీర్చడంలో భాగంగా పోలీస్ చేయూత పథకం ద్వారా కానిస్టేబుల్ కృష్ణయ్య కుటుంబానికి రూ.2 లక్షల పోలీస్ చేయూత పథకం చెక్కును జిల్లా ఎస్‌పి కె.నర్సింహా కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి కె.నర్సింహా మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమ కోసం ఎల్లప్పుడు పోలీస్‌శాఖ పనిచేస్తుందని, కృష్ణయ్య కుటుంబాన్ని పోలీస్‌శాఖ అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీస్ సిబ్బంది ప్రతినెల జీతం నుండి విరాళం అందిస్తున్నారని అభినందించారు. పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తుందని అన్నారు.



## శ్రీశైలం గేట్లు మూసివేత.. సాగర్‌కు తగ్గిన వరద...

**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువ ప్రాంతమైన కర్ణాటక మహారాష్ట్ర లో వర్షాలు పడక పోవడం, అక్కడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల కాకపోవటంతో వరద తగ్గుముఖంపట్టింది దీనితో శ్రీశైలం గేట్లను బుధవారం పూర్తిగా మూసివేశారు చేశారు. దీనితో నాగార్జునసాగర్ రిజర్వాయర్ వరద తగ్గుముఖం పట్టింది. శ్రీశైలం జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ ఉండటంతో నాగార్జునసాగర్ రిజర్వాయర్కు ఇన్ ఫ్లో గా 64789 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది దీనితో రిజర్వాయర్ నీటిమ ట్టం నెమ్మదిగా పెరుగుతూ బుధవారం సాయంత్రానికి గరిష్ట నీటి మట్టం 590 అడుగులకు 556.60 అడుగులు నమోదు కాగా. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312.0450 టి ఎంసీలకు గాను 224.5548 టీఎంసీలుగా ఉన్నది. కేవలం ఎస్ఎల్బీసీ ఏఎంఆర్పి ద్వారా 1650 క్యూసెక్కుల నీటిని అవుట్ ఫ్లోగా దిగువ కు విడుదల చేస్తున్నారు. అయితే నాగార్జునసాగర్ ప్ర స్తుత ఇన్ ఫ్లో 64789 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 1650 క్యూసెక్కులు.




## మినీట్యాంక్ బండ్ వద్ద ఐదు ఎకరాలలో అద్భుతమైన పార్కు

### తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మిని ట్యాంక్ బండ్ వద్ద ఐదు ఎకరాల విస్తరణలో అద్భుతమైన పార్కును నిర్మించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్కు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ నుండి ప్రముఖ అర్కిటెక్చర్స్‌ను బృందాన్ని పిలిపించి వారి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. హైద్రాబాద్‌లో ఇప్పటికే ఫ్లైఓవర్ పెయింటింగ్స్, ఫ్లవర్ ప్లే గ్రౌండ్స్, బాస్కెట్‌బాల్ కోర్టు వంటి ప్రాజెక్టు డిజైన్‌లను వారికి అందించారు. ఈసందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రూ.10 కోట్ల నిధులతో టూరిజం శాఖ ఆధ్వర్యంలో పార్కు నిర్మించబోతున్నామని చెప్పారు. ఈ పార్కులో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కూడా ఉంటుందని తెలిపారు. సూర్యాపేట పట్టణ అందాన్ని మెరుగుపర్చేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌ను కలిసి భూ సేకరణ ప్రారంభించడం జరిగిందన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిధులు మంజూరుచేసి పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ పార్కులో పిల్లలకు ఆట స్థలాలు, పాఠశాల విద్యార్థులకు చదివే చోటుగా బెంచీలు, ఫుడ్‌కోర్టు వంటి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వెలుగువెంకన్న, తండు శ్రీనివాస్‌గౌడ్, పిల్లల రమేష్‌నాయుడు, వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

## బుద్ధుని రంగస్థల నాటకానికి బుద్ధవనం సిబ్బంది



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ టూరిజం బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య ఆదేశాల మేరకు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలోని బుద్ధిష్ట సొసైటీ ఆఫ్ ఇండియా, పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'బుద్ధునితో నా ప్రయాణం' అనే నాటకాన్ని తిలకించడానికి మంగళవారం బుద్ధవనం సిబ్బంది తరలి వెళ్లారు. తెలంగాణ, ఆంధ్రాలో బుద్ధ ధర్మ ప్రయాణం అనే కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుండి 31 వరకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని ముఖ్య ప్రాంతాలలో బుద్ధుని తో నా ప్రయాణం అనే నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి బుద్ధవనం అధికారులు,సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన పంచాశీల జెండా ఊపి ప్రారంభించారు.

## మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట

### ఎమ్మెల్సీ శంకర్ నాయక్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కాంగ్రెస్ ప్రజాస్వామ్య సెక్యులర్ పార్టీ అని మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు.సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ హాఫీజ్ ఖాన్ ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియమించిన సందర్భంగా మంగళవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో హాఫీజ్ ఖాన్ ని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు.బిజెపి మతతత్వ పార్టీ అని మైనార్టీలపై దాడులు చేస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. నూతన జిల్లా గ్రంథాలయ చైర్మన్ హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ తనకు జిల్లా గ్రంథాల చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు నాయకులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలోపట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,టిపిసిసి ప్రత్యేక ఆహ్వానితులు మహమ్మద్ ఇంతియాజ్ హుస్సేన్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### విద్యార్థుల భోజనం విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరిక

**ప్రజాపక్షం/నల్లగొండ (గుర్రంపోడు) :** జిల్లాలోని అన్ని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న భోజనం విషయంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు.మంగళవారం ఆమె గుర్రంపోడు కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగదిని, డైనింగ్, పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించారు. పదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో గణితం పై ప్రశ్నలను అడిగి విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పై అవగాహన కల్పించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ భవిత కేంద్రాన్ని సందర్శించి ఇటీవల ప్రభుత్వం భవిత కేంద్రాలకు సరఫరా చేసిన ఆట వస్తువులు ,ఇతర సామాగ్రిని పరిశీలించి సంబంధిత స్టాక్ రిజిస్టర్ లో కేంద్రం ఇన్చార్జిగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు.అనంతరం జిల్లా కలెక్టర్ గుర్రంపోడు తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతిపై వచ్చిన దరఖాస్తుల వివరాలను పరిశీలించారు.భూ భారతి దరఖాస్తులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు.దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, గుర్రంపోడు మండల ప్రత్యేక అధికారి , జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి ,డీఈఓ బిక్షపతి, గుర్రంపోడు తహసిల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ యాదగిరి,డి ఈ పరమేష్, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ ప్రత్యేక అధికారి విజయశ్రీ ఉన్నారు.



**ఆర్థిక సాధికారత సాధించవచ్చు :** మహిళలు చిన్న చిన్న వృత్తి వ్యాపారాల ద్వారా ఆర్థిక సాధికారత సాధించవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ సందర్భంగా ఆమె చిన్న చిన్న వ్యాపారాలను ప్రారంభించి ప్రస్తుతం మంచి స్థాయిలో ఉన్న ఫాషన్ రంగంలో రాణిస్తున్న నాయిక ఫౌండర్ ఫల్గుణి నాయర్, అలాగే పిజ్జా తదితర వ్యాపారాలు ప్రారంభించిన వ్యాపారవేత్తలు ముందుగా చిన్నగా వ్యాపారాలు మొదలుపెట్టి ప్రస్తుతం కోట్లాది రూపాయల వ్యాపారాలు చేస్తున్నారని, వీరందరినీ ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సూక్ష్మ, చిన్న మధ్య తరహా వ్యాపారాల , సంస్థల ఏర్పాటుపై స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ఉద్దేశించి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఒకరోజు అవగాహన సదస్సుకు హాజరయ్యా స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

## వసతి గృహాలలో చదివే విద్యార్థులకు అన్ని సదుపాయాలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని, వాళ్ళను మంచిగా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మైనార్టీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ, మహాత్మా జ్యోతిభా పూలే, కస్తూరిభా, గిరిజన సంక్షేమవసతి గృహాల ప్రిన్సిపాల్, స్పెషల్ ఆఫీసర్స్, కేర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. హాస్టల్లో చదివే విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం హాస్టల్స్‌లో చదివే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, రెసిడెన్షియల్ స్కూల్ మీద బాగా నమ్మకం పెరిగిందన్నారు. చదువుకోడానికి ఎంతో నమ్మకంతోసుదూర ప్రాంతాల నుండి వస్తున్న విద్యార్థులకు హాస్టల్ పరిసర ప్రాంతాలు అలవాటు పడే వరకు విద్యార్థుల పట్ల ప్రిన్సిపల్స్ శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థుల యొక్క మానసిక పరిస్థితులను తెలుసుకొని, అలాంటి పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తూ వారి పై శ్రద్ధ పెట్టి వారి బాగోగులు చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన చేయాలని తెలిపారు. మౌలిక వసతులు ఎప్పటికప్పుడు ఎలా ఉన్నాయో చూసుకోవాలన్నారు. ఆర్‌బిఎస్‌కే టీమ్స్ హాస్టల్ ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. వంటశాలను ఎప్పుడు కప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిఓలు, విద్యా రాణి స్వప్న, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి శ్యామ్ సుందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, వివిధ హాస్టల్ ప్రిన్సిపల్స్, స్పెషల్ ఆఫీసర్స్, కేర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కస్తూర్బా పాఠశాలలో ఫ్యాన్‌కు ఉరేసుకుని విద్యార్థి మృతి

### అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/కోదాడ(నడిగూడెం):** పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని అదే పాఠశాలలోని తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడటంతో పాఠశాలలో విషాదం నెలకొంది. స్థానిక ఎస్ఐ గందమళ్ల అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన తాపీమేస్త్రి నిమ్మ వెంకటేశ్వర్లు వసుందరలకు పెద్ద కుమార్తె తనూషా మహాలక్ష్మి (14) ఇద్దరు కుమారులున్నారు. తనూషా నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న తనూషా మహాలక్ష్మి (14) ఈనెల 4న వ్యక్తిగత కారణాలతో ఇంటికివెళ్లి 6వ తేదీన పాఠశాలకు వచ్చింది. ఈనెల 13న తన తల్లి వసుందర కుమార్తెను చూసేందుకు వచ్చి భోజనం పెట్టి వెళ్లింది. మరుసటి రోజు తండ్రి వెంకటేశ్వర్లు సాయంత్రం ఆరు గంటల సమయంలో తన కుమార్తెను చూసి వెళ్లాడు తన తండ్రి చూసి వెళ్లిన గంటల వ్యవధిలోనే తనూషా మహాలక్ష్మి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు ముందే తనూషా తన స్నేహితులతో కుటుంబ సమస్యలతో ఇంట్లో ఇబ్బందికరంగా ఉందని తెలిపిందని ఎస్ఐ తెలిపారు. ఉదయం ఐదు గంటల సమయంలో స్టడి ఆవర్ బెల్ కొట్టగానే విద్యార్థులు నిద్రలేచి తమ తరగతి గదిలోకి వెళ్లారు. కాగా తనూషా మహాలక్ష్మి ఫ్యాన్‌కు వేలాడుతూ విఘత జీవిగా కన్పించడంతో స్నేహితులు, విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రాత్రి విధుల్లో ఉన్న హింది ఉపాధ్యాయురాలు సునిత పాఠశాల ప్రత్యేక అధికారి వెంకటరమణకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థిని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు అనుమానస్పదం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. మునగాల సిఐ రామకృష్ణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థి మృతిపై ఆరా తీశారు.



## దేవరకొండలో ఫోన్ ట్యాపింగ్ కలకలం..

### ఫోన్ టాపింగ్ విచారణకు హాజరైన జాలే నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/చందంపేట :** నల్లగొండ జిల్లా చందంపేట మండలం దేవరకొండ నియోజకవర్గంలో ఫోన్ టాపింగ్ కలకలం రాష్ట్రంలో గత ప్రభుత్వం 2023 ఎన్నికల్లో ఫోన్లు టాప్ చేసినట్లు రోజు రోజు వింటున్నాం దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్ అండగా ఉండి కాంగ్రెస్ గెలుపుకు ఎంతో కృషి చేసిన వ్యక్తి పిసిసి సభ్యులు జాలే నర్సింహా రెడ్డి ఫోన్ టాపింగ్ జరగడంతో మంగళవారం జుబ్లీహిల్స్ సిట్ కార్యాలయానికి ఆయనను పిలిపించారు. అనంతరం జాలే నర్సింహారెడ్డి మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ ప్రజలను గత ప్రభుత్వం ఇబ్బందులు పెట్టినప్రజలకు అండగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందానని కాని తన ఫోన్‌ను కూడా టాప్ చేయడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో ఓడించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి టాపింగ్‌కు పాల్పడడం సిగ్గుచేటని ఆయన అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారం ఉన్నా లేకున్నా కష్ట కాలంలో పనిచేశాం తప్ప ఎవరి మెప్పు కోసం కాదని ఫోన్ టాపింగ్ ద్వారా తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి వాగ్మూలం సేకరించారని, కుటుంబ సభ్యులతో మాట్లాడిన కాల్స్‌ను కూడా ట్యాప్ చేయడం సిగ్గుమాలిన చర్య అని త్వరలోనే నా నెంబర్‌ను ఎవరు పంపారు అనేది తెలుతుందని ఆయన తెలిపారు.



అందరిలో చర్చ.....ఫోన్ టాపింగ్ అసలు ఎవరు చేపించారు ఇంకా నియోజకవర్గంలో ఎంత మంది ఉన్నారు జాలే నర్సింహారెడ్డి ఎంఎల్ఏ బాలనాయక్‌కు అన్ని తానై చూసుకోవడంతో ఫోన్ టాపింగ్ చేశారని నియోజకవర్గంలో చర్చ జరుగుతుంది. ఇంకా ఎవరికి నోటీసులు వస్తాయి అని వీటన్నింటికి కారణం దేవరకొండ నియోజకవర్గంలో గత ప్రభుత్వ నాయకుల పాత్ర ఉండి ఫోన్ టాపింగ్ చేయడం జరిగింది అని రాష్ట్రంలో 600 మందికిపైగా ఫోన్లను టాపింగ్ చేయడం, దేవరకొండలో ఫస్ట్ ఫోన్ టాపింగ్ బయటకు వచ్చిందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

## సినీ ఫక్కీలో హత్య, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం...

### అక్రమ సంబంధాలే హత్యకు దారి తీసింది

### భువనగిరి డిసిపి ఆక్షాంశ్ వెల్లడి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** అక్రమ సంబంధాలతో నిండు ప్రాణాలు బలి అవుతున్నాయి. మానవత్వం మర్చి ఏకంగా తమ సొంత మనుషులనే చంపుకునేంత స్థాయికి దిగజారుతూ అక్రమ సంబంధం మోజుతో సినీఫక్కీలో ఏకంగా భర్తనే భార్య హత్య చేయించిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లి శివారులో జరిగింది. భువనగిరి జోన్ డిసిపి ఆక్షాంశ్ యాదవ్ మంగళవారం యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్లో వివరాలు వెల్లడించారు. ఆదివారం అర్ధరాత్రి మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామ శివారులో జరిగిన కారు బైకు ప్రమాద ఘటనలో మృతి చెందిన ఆత్మకూరు మండలం పల్లెర్లకు చెందిన వస్తుపుల స్వామి కేసులో పోలీసులకు అనుమానం రావడంతో విచారణ ప్రారంభించారు. తుర్కపల్లి మండలం పల్లెపహాడుకు చెందిన గుంటి సాయికుమార్ 2017 నుండి 2018 వరకు భువనగిరిలోని హౌసింగ్ బోర్డ్‌లో ఒక మార్బుల్ షాప్ నందు పనిచేశారు. ఈ క్రమంలో పల్లెల గ్రామానికి చెందిన వస్తువుల స్వాతి పక్కనే ఉన్న ఎస్ఎన్ మోటార్స్‌లో పనిచేసింది. ఆమెకు సాయికుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత కొంతకాలానికి ఎస్ఎన్ మోటార్స్ మూతపడడంతో స్వాతి అక్కడి నుండి తన స్వగ్రామానికి వెళ్ళిపోయింది. అప్పటి నుండి తన భర్త స్వామి మేనేజర్‌గా పనిచేస్తూ మోత్కూరు సోనాలిక ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తుంది. అంతా సజావుగా సాగుతుండగా గత సంవత్సరం అనగా ఫిబ్రవరి 2024 నెలలో సాయికుమార్ మోత్కూరుకు వెళ్ళగా అనుకోకుండా స్వాతి సాయికుమార్‌కు కనబడింది. అప్పటి నుండి వారు ఫోన్ ద్వారా తరచూ మాట్లాడుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదిలా ఉండగా మృతుడు స్వామి తన దగ్గర బంధువు వరుసకు చెల్లి అయ్యే మహేష్ మొదటి భార్య అయిన సవితతో అక్రమ సంబంధం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విషయం మహేష్‌కు తెలియడంతో తను తన బావ ఆయన మృతుడు స్వామి మీద పగ పెంచుకున్నాడు. తన భర్త అక్రమ సంబంధం గురించి తెలిసిన స్వాతి తన భర్తను హెచ్చరించింది. అప్పటి నుండి స్వామి స్వాతిని శారీరకంగా మానసికంగా వేధింపులకు గురి చేయడం ప్రారంభించాడు. గత మూడు నెలల నుండి తన భర్త వేధింపులు ఎక్కువ అవ్వడంతో తాను ఇంకా భరించలేకపోయింది. దాంతో సాయికుమార్ తన తమ్ముడు మహేష్‌లతో కలిసి తన భర్తను అంతమందించాలని నిర్ణయించుకుంది.



## నిర్దేశించిన సమయంలోగా వనమహోత్సవం మొక్కలు నాటాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నిర్దేశించిన సమయంలో గా వన మహోత్సవం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఎంపీడీవోలకు సూచించారు ప్రతి వారం నిర్వహించే వారాంతపు సమీక్షలో భాగంగా మంగళవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సోక్ పిట్ల నిర్మాణం పాఠశాలలు,అంగన్వాడి కేంద్రాలలో న్యూట్రి గార్డెన్ల పెంపకం, వనమహోత్సవం కింద గుంతలు తవ్వడం, మొక్క లు నాటడం, నర్సరీలను చేపట్టడం, స్వచ్ఛభారత్ కింద పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ ,ఇందిరమ్మ ఇండ్లల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, వర్మి కంపోస్ట్ తయారీ, తదితర అంశాలపై సమీక్షించారు. గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,డిపిఓ వెంకయ్య హాజరయ్యారు.



## అర్హులందరికీ కొత్తగా ఆసరా పింఛన్లు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌దారులకు పెన్షన్ పైసలు పెంచి ఇవ్వాలని, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికి అమలు చేయలేదని, అర్హులైన అందరికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం మండల పరిషత్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు రెండువేలు బదులుగా నాలుగువేలు ఇస్తామని, వికలాంగులకు 4వేలు కంటే 6వేలు ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికి అమలు చేయలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఎఐటియుసి జిల్లా నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, పోకల ఆంజనేయులు, ప్రధాని సైదులు, కుందూరు వెంకటరెడ్డి, నర్సింహచారి, ఈశ్వరచారి, పందిరి సైదులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ బిల్లు తక్షణమే షెడ్యూల్ 9లో చేర్చాలి : దూళిపాళ



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** తెలంగాణ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ 9లో చేర్చాలని బిసిహక్కు సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2019 సంవత్సరంలో అగ్రవర్ణాల పేదల కోసం అంటూ 103వ రాజ్యాంగ సవరణ చేసి పదిశాతం రిజర్వేషన్ ఇవ్వడానికి పార్లమెంట్‌లో బిల్లు తెచ్చి రిజర్వేషన్ అమలు చేస్తున్న విధంగానే 2025లో కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం బిసిలకు 50 శాతం విద్యా ఉద్యోగ చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు చేయడానికి రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. బిసి, ఎస్టీ, ఎస్సీ మైనార్టీ వర్గాల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి తేవాలని, కార్పొరేట్ పాఠశాల, కళాశాల యూనివర్శిటిలలో వీరందరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే ఫీజులు చెల్లించే విధంగా ఈ పార్లమెంట్ సమావేశాల్లో చట్ట సవరణ చేయాలని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుకు అందజేశారు. ఈ ధర్నాలో బిసి హక్కుల సాధన సమితి నాయకులు బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్, పిడుగురా కనకయ్య, చిలక రాజు శ్రీను, ఇనుగుర్తి వెంకటరమణ చారి, నిగడాల వీరయ్య, కొండ అన్నపూర్ణ, మండవ నాగమణి, కొమ్రరాజు వెంకట్, సిరాపురపు శ్రీనివాస్, దేశగాని హేమలత, దేశగాని సైదులు పాల్గొన్నారు.

## రెండు రోజులుగా ముంపు ప్రజల ఆందోళన

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలములోని శివన్నగూడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద చర్లగూడెం ముంపు గ్రామస్తులు ప్రాజెక్టు పనులు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఇండ్ల స్థలాలు ఇచ్చేవరకు ప్రాజెక్టు పనులు జరగనివ్వబోమని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులను అడ్డుకున్న ముంపు గ్రామమైన చర్లగూడెం గ్రామస్తులకు చింతపల్లి మండలం లోని వర్కాల గ్రామములో సర్వే నెంబర్,175లో ,35, ఎకరాల భూమిని ఆర్డీవో దేవరకొండ గుర్తించి, 19.07.2025 సబ్ డివిజన్ పూర్తిచేసి భూ సేకరణ కొరకు కలెక్టర్కు ప్రతిపాదనలు సమర్పించబడినవి, అని గ్రామస్తులకు తెలియపరిచారు. బాధితుల వెంట చండూరు ఆర్డిఓ శ్రీదేవి, తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసు, ప్రాజెక్టు ఈ ఈ రాములు నాయక్, ముంపు బాధితులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మహార్ధశ

### రూ.3 కోట్ల నిధులు విడుదల



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:**ఎన్నాళ్లకెన్నాళ్లకో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మహార్ధశ పట్టింది. డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వారు జిల్లాలో ఉన్న 14 జూనియర్ కళాశాలల్లో మౌళిక సదుపాయాల కల్పన కోసం రూ.3కోట్ల 31లక్షల15వేలను విడుదల చేశారు. వీటితోపాటు ప్రతీ కళాశాలకు రూ.10 వేలు చొప్పున క్రీడా సామాగ్రి కొనుగోలు, కళాశాల నిర్వహణ కోసం రూ.3లక్షల16వేలను కూడా విడుదల చేశారు. దీంతో జిల్లాలోని కళాశాలల్లో నెలకొన్న మౌళిక సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైంది. ఈ విషయంపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హెచ్ వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

## ఎల్‌ఒసి పత్రాలు అందజేసిన ఖమ్మం ఎంపి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య చికిత్సల కోసం మంజూరైన ఎల్‌ఒసి పత్రాలను ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో పంపిణీ చేశారు. కారేపల్లి మండలం కొత్త కమలాపురం గ్రామానికి చెందిన కొల్లి నాగమ్మ, జాలా ధనమ్మ, మండెపూడి కృష్ణారావు, మండెపూడి సత్యమ్మలకు మోకాలు శస్త్ర చికిత్సల కోసం ఆర్థిక తోడ్పాటునందించాలని ఇటీవల ఖమ్మం ఎంపిని కలిసి విన్నవించారు. ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆరు లక్షల ఎల్‌ఒసి పత్రాలను హైదరాబాద్‌లో ఎంపి పంపిణీ చేశారు. నిమ్స్ ఆసుపత్రిలో ఒక్కొక్కరికి రూ. 1.50 లక్షలు ఎల్‌ఒసి పంపిణీ చేశారు.

## 17న అవార్డు అందుకోనున్న కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేషనల్ జియోస్పెషియల్ ప్రాక్టీషనర్ అవార్డు దక్కింది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈనెల 17న ఐఐటి బాంబేలో అందుకోనున్నారు. జిఐఎస్ ద్వారా గ్రామీణ సమస్యల పరిష్కారానికి మార్గదర్శకంగా నిలిచిన విశిష్ట కృషికి జిల్లా యంత్రాంగం ప్రతినిధిగా కలెక్టర్ ఓపెన్ సోర్స్ జిఐఎస్ డే లో ఇస్రో మాజీ చైర్మన్ కిరణ్ కుమార్ చేతులు మీదుగాఈ అవార్డు అందుకుంటున్నారు.

## కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/అశ్వారావు-పేట :**అశ్వారావుపేట పురపాలక సంఘం కార్యాలయంలో అన్ని మాంసం దుకాణాదారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రధాన రహదారి పక్కన ఉన్న దుకాణాదారులు పరిశుభ్రతను పాటించాలని, దుమ్ము, దూళీ క్రిమికిటకాలురాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నా రు. కల్తీ మాంసం విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతు ందని హెచ్చరించారు. దుకాణాదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని తెలిపారు.సమావేశంలో మాంసం విక్రయ దుకాణదారులు పాల్గొన్నా రు.

## వివాహిత బలవన్మరణం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**నిద్రమాత్రలు మింగి వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీస్‌లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం, సిద్ధారం గ్రామానికి చెందిన గొళ్ళమూడి గోపి, 2018లో సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన దుర్గా భవాని (28) ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. భర్త గోపి, భార్య గొళ్ళమూడి దుర్గా భవానీని మద్యం మత్తులో మందలించడంతో మనస్తాపానికి గురై, రాత్రి ఇంట్లో ఉన్న యాంటీబయాటిక్ టాబ్లెట్లను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వెంటనే మృతురాలిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించటంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివాహిత బలవన్మరణంపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతురాలికి భర్త గోపి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## పంచాయతీలలో పడకేసిన పారిశుద్ధ్యం

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాలక మండలి లేకపోవటంతో పంచాయితీలలో పారిశుద్ధ్యం పడకేసిందని సేవాలాల్ సేన రాష్ట్ర జనరల్ సెక్రటరి ఆంగోత్ నరేష్ అన్నారు. పాల్వంచ పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో మండల అధ్యక్షుడు జర్పుల పరమేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సంధర్భంగా నరేష్ మాట్లాడుతూ ...వర్షాకాలం సీజన్‌లో ప్రజలు పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలను రోగాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే పంచాయితీలకు రావల్సిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యార్థి సేన ఇన్‌చార్జి తేజావత్ రమేష్ నాయక్, బానోత్ ప్రతాప్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే జారే పర్యటన



**ప్రజాపక్షం/ములకలపల్లి:** నేడు మండలంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేజారే ఆదినారాయణలు పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం ట్రై బల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఇందిరా మహిళా శ క్తి సంబరాలు కార్యక్రమంలో, అనంతరం తిమ్మంపేట గ్రామం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మండల అధికారులు, మండల నాయకులు, మండల అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ పదవి హోదా నాయకులు, గ్రామ నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని అశ్వారావుపేట నియోజకవర్గం క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ వట్టి వెంకట్రావ్ తెలిపారు.

## మందుల కొరతను తీర్చాలని వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇజెహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న వెల్‌నెస్ సెం టర్లలో మందుల కొరతను తీర్చాలని కో రుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉదయ్ కు మార్‌కు పిఆర్‌టియు నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో వినతి పత్రం స మర్పించారు. ఖమ్మం జిల్లా హెడ్ క్వార్టర్స్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇజెహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న వెల్‌నెస్ సెంటర్లలో మందుల కొరత తీవ్రంగా ఉం దని వాటిని సరి చేసి పూర్తి స్థాయిలో మందులు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉదయ్ కుమార్ త్వరలోనే అన్ని వెల్‌నెస్ సెంటర్లలో మందుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పిఆర్‌టియు ఖమ్మంజిల్లా మాజీ అధ్యక్షులు వైవి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి మధు, వెంకటనర్సయ్య, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు ఆసుపత్రి కార్మికుల సమ్మె




**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరులోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి కార్మికులు సమ్మెను నేటికి రెండో రోజు మోకాళ్లపై ఉండి సమ్మె చేశారు. నాలుగో నెల గడుస్తున్న నేటికీ వేతనాలు విడుదల చేయడంలో ప్రభుత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని వారి వేతనాలను వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా ఉందని జీవనం కొనసాగించాలంటే వేతనం అందక అవస్థలు పడుతున్నారని, ఈనెల 23లోపు వేతనాలు ఖాతాలలో జమ చేయనిచో పూర్తిస్థాయిలో విధులకు ఆటంకం కలిగిస్తామని, చెత్తాచెదారం ఎక్కడిది అక్కడే వదులుతామని తెలిపారు. ప్రతీనెల ఐదో తేదీ లోపల వేతనాలు చెల్లించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, కార్మికులు ,తదితరులు పాల్గొన్నారు.

# విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

### ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలి

### కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పనిచేసే ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్మిక శాఖ, జిల్లా ఖజానా కార్యాలయం, భోజనశాల, రెవెన్యూ విభాగం, ముఖ్య ప్రణాళిక అధికారి, ఉపాధి అధికారి, టూరిజం, డిఆర్‌డిఒ, టౌన్ ప్లానింగ్, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, భూ సేకరణ విభాగం,ఎడి డ్రగ్స్ కంట్రోల్, ఎడి మైన్స్, భూసేకరణ, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాలను, రికార్డు రూములను, ఓపెన్ లాంచ్, టాయిలెట్స్, క్యాంటీన్‌ను కలెక్టర్ పరిశీలిం చా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల భోజన శాల గదిలో త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యాలయాల్లో ప్రతి ఫైల్ పకడ్బందీగా రికార్డు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ తనిఖీలో భాగం గా విద్యాశాఖాధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జి ల్లాలో ఒక మండలాన్ని పైలెట్‌గా తీసుకుని 100 శాతం అక్షరాస్యత సాధన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పదవ తరగ తి ఓపెన్ స్కూల్ ద్వారా ఉ త్తీర్ణత సాధించేలా ప్రణాళికా బ ద్ధంగా చర్యలు చేప ట్టి సంపూర్ణ అక్షరాస్యత మండలంగా ప్రకటించేలా కార్యాచరణ చేయాలన్నా రు. ఇటుక బట్టీల్లో పనిచేసే వారి పిల్లలకు తప్పనిసరిగా విద్య అందేలా చూడాలన్నారు. ప్రతి శాఖలో సిబ్బంది, అవుట్‌సోర్సింగ్, డిప్యూటేషన్ అధికారుల హాజరు కూడా బయోమెట్రిక్ ద్వారా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉ ద్యోగుల మెడికల్ రియంబర్స్‌మెంట్ ఫైల్స్ సకాలంలో డి స్పోజ్ చేయాలన్నారు. ప్రతి వారం ప్రజావాణి దరఖాస్తుల స్టేటస్‌తో పాటు ప్రతి శాఖలోని అధికారులు, సిబ్బ ంది హాజరు వివరాలను అందించాలన్నారు. ప్రభుత్వ కా ర్యాలయాలకు వచ్చే ప్రజలను ఎక్కువ సమయం ఎదురు చూసేలా చూడవద్దని వారి దరఖాస్తులను మానవతా దృ క్పథంతో పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యాల యం లోపల ఓపెన్ లాంజ్‌లో పచ్చదనం కొరకు మంచి మొక్కలు నాటాలని, ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయ పరిసరాల్లో ఖాళీ ప్రదేశాల్లో వన మహోత్సవం క్రింద మొక్కలు నాటి గ్యాపుల ను భర్తీ చేయాలన్నారు. క్యాంటీన్‌లో టీ తాగి కలెక్టర్ స్వ యంగా డబ్బులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ , కలెక్టరేట్ పరిపాలన అధికారి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు శిఖం భూమి ఆక్రమణ

### తహసీల్దార్,పోలీస్‌లకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఓ వ్యక్తి చెరువు శిఖం భూమిని ఆక్రమించటంతో స్థానిక రైతులు తహశీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లోనూ మంగళవారం ఫిర్యాదు చేశారు. పాల్వంచ మున్సిపాలిటి పేటచెరువులోని చింతకుంట శిఖం భూమి సమీపంలో గల సర్వే నెంబర్ 897 లో 2.10 కుంటల భూమి కాటిముక్కుల శ్రీనివాసరావు పేరుపై ఉంది. అతని కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి ఆయనకు సంబంధించిన భూమితో పాటు అదనంగా 30 కుంటల చెరువు శిఖం భూమిని అక్రమించాడు. చుట్టూ సిమెంట్ దిమ్మెలతో ఫెన్సింగ్ వేసి దారి మూసివేశాడు. ఈ దారి మూసి వేయటంతో పిల్లవాగు, పేటచెరువు, కొత్తూరు గ్రామాలకు చెందిన రైతులు తమ పొలాలకు, ప్రజలు అడవికి వెళ్ళడానికి దారి లేకుండా పోయింది. దీంతో ఆగ్రహించిన సంబంధిత రైతులు ఫెన్సింగ్ తొలగించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు, పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కాలం రాజమ్మ, గొగ్గెల గోపమ్మ, దుబ్బ తిరుపతమ్మ, ఊకె పొట్టెయ్య, షేక్ లాల్ సాహెబ్, ఏటుకూరి లక్ష్మయ్య, మూతి బుచ్చయ్య, పొడెం వెంకటేశ్వర్లు, ఊకె చిన్న వెంకన్న, తుర్సం గోపాలరావు, కే. శ్రీనివాసరావు, ఏ. రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## 19, 20 తేదీల్లో సిపిఐ 23వ మహాసభలు

### సిపిఐ నగర కార్యదర్శి జానిమియా




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా కార్యకర్తలను కోరారు. ఈ నెల 19, 20 తేదీల్లో మహాసభలు జరగనున్నాయని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి వర్గ సమావేశం మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎస్‌కె జానిమియా మాట్లాడుతూ మహాసభలలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడంతో పాటు ప్రజా సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదం పొందిన అనంతరం వాటి అమలు కోసం పోరాడతామని ఆయన తెలిపారు. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం పట్టణంలో జీవిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. 600 మంది ప్రతినిధులకు ప్రాతినిధ్యం వహిస్తూ జరిగే ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యులు బా గం హేమంతరావుతో పాటు పలువురు నేతలు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అశ్వారావుపేటకు రాష్ట్రంలోనే మొదటి స్థానం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:**ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలు త్వరితగతిన పూర్తికావడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని అశ్వారావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలో గల పలు పంచాయితీల్లో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ, సిఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్మాణాలు జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించి తాపీ పట్టి పనులు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో అశ్వారావుపేట ముందంజలో ఉందన్నారు. ఎస్‌సిసబ్ ప్లాన్, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులతో మం డల అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. లోటు బడ్జెట్ ఉన్న కాంగ్రెస్ ప్ర భుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా విడతల వారీగా అమలు చేస్తున్నామన్నారు. మండలానికి గిరిజనులకు మరో 128 ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపిడిఒ అశోక్, ఆపార్టీ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్ష, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారు సంస్థగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఎంపిక



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారు సంస్థ పథకంలో రైతుల వద్ద నుండి రైతు ఉత్పత్తిదారు సంస్థ షేర్ ధనం వసూలు చేసినట్లయితే దానికి అదనంగా ఈక్విటీ గ్రాంట్‌ను అందిస్తుంది. ప్రాజెక్ట్ రుణాలకు 2 కోట్ల వరకు క్రెడిట్ గ్యారెంటీ సౌకర్యం, రైతు ఉత్పత్తిదారు సంస్థల ఆర్థిక స్థావరాన్ని బలోపేతం చేయడానికి, వ్యాపార అభివృద్ధికి వారి క్రెడిట్ యోగ్యతను పెంచడానికి రూపొందించబడింది. భద్రాద్రి జిల్లాలో 11 సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారు సంస్థ కు ఎంపిక చేశారు. అందులో భాగంగా బూర్గంపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నందు సహకార, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆఫీస్ స్టేషనరి నిమిత్తం మూడు నెలలకు రూ 3,16,000 చెక్కును సొసైటీ అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు, సెక్రటరీ బత్తిన వెంకట ప్రసాద్‌ల చేతికి అందించారు.

## భాస్వరం వాడకంపై అవగాహన



**ప్రజాపక్షం/వైరా:**వైరా మున్సిపాలిటీ సోమవరం గ్రామపంచాయతీ నందు భాస్వరం కరిగించే బాక్టీరియా గురించి రైతులకి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమవరం గ్రామంలో వరి వేసిన రైతుల పొలంలో పిఎస్‌బిని ఇసుకలో కలిపి చల్లడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ రైతులతో మాట్లాడుతూ భూమిలో నిల్వ ఉండి లభ్యంగాని స్థితిలో ఉన్న భాస్వరం కరిగించే మొక్కకి అందించే విధంగా ఈ బాక్టీరియా పనిచేస్తుందని అన్నారు. రసాయనిక డిఎపి వాడకాన్ని తగ్గించి భూమిలో నిల్వ ఉన్న భాస్వరంను వినియోగించుకోవాలని రైతులకి వివరించారు. ఈ బాక్టీరియాను పశువుల ఎరువులోగాని, వర్మి కంపోస్ట్‌లో గాని, ఇసుకలో గాని కలిపి చల్లుకోవచ్చు. నీటితో కలిపి పిచికారి కూడా చేసుకోవచ్చని అన్నారు. పంట వేసిన 15వ రోజు నుండి దీనిని వినియోగించుకోగలరని, రైతులతో పిఎస్బి యొక్క ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, రైతులు , ఎఇఒలు రాజేష్, వాసంతి, కీర్తి పాల్గొన్నారు.

## చందు నాయక్‌ను హత్య చేయడం దుర్మార్గమైన చర్య

### నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలి

### తెలంగాణ గిరిజన సమాఖ్య భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ డిమాండ్



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:**మంగళవారంతెల్లవారుజామున మలక్ పేట మారుతీ నగర్లో సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు చందు నాయక్‌ను కొంతమంది దుండగులు హత్య చేయడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ గిరిజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెంజిల్లా ప్రధాన కార్యదర్శిభూక్యా శ్రీనివాస్ అన్నా రు. మంగళవారము శేషగిరి భవనంలో గిరిజన సమాఖ్య జిల్లా సమితి సమావేశంలో ఆర్ చందు నాయక్ కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో జిల్లా కార్యదర్శి భూక్య శ్రీనివాస్ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావాలను సోషలిస్టు భావాలకు ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ అంచలంచలుగా ఎదుగుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులుగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చందు నాయక్ పనిచేస్తున్నారన్నారు. భూ మికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాడే కమ్యూనిస్టు పార్టీ బాటలో నగరం నడిబొడ్డున భూ పోరాటాలు నిర్వహించి ఇండ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలకై పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచిన చందు నాయక్ ప్రజల్లో మరింత బలపడడంతో అంచలంచలుగా ఎదుగుతున్న గిరిజన ముద్దుబిడ్డను ఓర్వలేని దుర్మార్గులు కక్షగట్టి హత్యకు పాల్పడినటువంటి దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుగులోతు రామచందర్, గణేష్, నగేష్, బాలాజీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులే కాని ‘దళిత బంధు’ అడ్డంకి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వారికి ఉండటానికి సరైన ఇల్లు లేదు. సొంత స్థలాలు కలిగి ఉన్నారు. ఆ స్థలాల్లో తాటి ఆకుల పాకలు లేదా రేకులు వేసుకుని జీవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి వారు ముమ్మాటికి అర్హులే. కానీ దళితబంధు వారికి అడ్డంకిగా మారింది. దళిత బంధులో లబ్ధిదారులుగా ఉన్న వారిని ఎంపిక చేయరాదంటూ ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు ఉన్నాయన్న అధికారుల ప్రకటన నడుమ చాలా చోట్ల లబ్ధిదారుల ఎంపిక గందర గోళంగా మారింది. గత ప్రభుత్వం దళితులకు దళితబంధులో భాగంగా రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించింది. ఖమ్మం నియోజక వర్గంలో రఘునాథపాలెం మండలం పరిధిలోని ఈర్లపుడి గ్రామంలో 100 మంది దళితులకు దళితబంధు పథకాన్ని వర్తింపజేశారు. దళితబంధు పథకంలో భాగంగా జీవనోపాధికై వివిధ వ్యాపార మార్గాలను ఎంచుకుని యూనిట్లను కొనుగోలు చేశారు. ఇప్పుడు వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి అవకాశం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈర్లపుడి గ్రామంలో మొత్తం 112 మంది ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద లబ్ధిదారులను ఎంపిక చేశారు. వా రిలో నలుగురు దళితులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేశారు. అయితే వారికి గతంలో దళితబంధు రాలేదు. ఖమ్మం జిల్లాలోనే చింతకాని మండలాన్ని దళితబంధు పథకంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చే శారు. ఇక్కడ నూటి కి నూరు శాతం దళితులకు దళిత బంధు పథకాన్ని అమలు చేశారు. అయినా ఇక్కడి దళితులనుఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపిక చే స్తున్నారు. ఒక చోట ఒక విధంగా మరో చోట ఇంకోవిధంగా వ్యవహరించడం ఏమిటని దళితు లు ప్రశ్నిస్తున్నారు. తాము తమ ఆర్థిక పరిస్థితు లు బాగోలేకనే ఇండ్లను నిర్మించుకోలేదని పక్కా ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్ర భుత్వం తమను ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు గా ఎంపిక చేసి తమకు న్యాయం చే యాలని కో రుతున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయమై ర ఘునాథపాలెం ఎంపిడిఒ అశోక్ కుమార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఉన్న ఆదేశాల మేరకే దళితబంధు వచ్చిన వారికి ఇందిర మ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేయలేదని తె లిపారు. చింతకాని మండలంలో ఇచ్చిన విష యంగురించికలెక్టర్‌దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## పల్లిపాడులో చర్యలు చేపట్టిన పోలీసులు




**ప్రజాపక్షం/వైరా:**వైరా మున్సిపాలిటీ కొణిజర్ల మండల పరిధిలోని పల్లిపాడు వద్ద మంగళవారం కొణిజర్ల ఎస్ఐ స్వరాజ్ పోలీస్ సిబ్బందిని పంపించి ట్రాఫిక్ సమస్యలపై చర్యలు చేపట్టే విధంగా ఆదేశించారు. ప్రజాపక్షం దినపత్రికలో ప్రమాదాలకు నిలయంగా పల్లిపాడు చౌరస్తా అనే కథనంతో పోలీస్ యంత్రాంగం కదిలింది. అతి ప్రమాదకరంగా ఉన్న పల్లిపడు చౌరస్తా వద్ద ప్రమాదాలు జరగకుండా ఉండేవిధంగా రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా ఉండడానికి చౌరస్తా చుట్టుప్రక్కల ఉన్న వ్యాపార సముదాయాల నిర్వాహకు లు ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామని రోడ్లపై బండ్లు అడ్డంగా పెట్టవద్దని పోలీసులు చెప్పారు. అదేవిధంగా ప్రతిరో జు పల్లిపాడు చౌరస్తా వద్ద ఒక పోలీస్ ఉండే విధంగా ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే చౌరస్తా వద్ద ట్రాఫిక్ బోర్డులను కూడా ఏర్పాటు చేయనున్నారు.

## చెరువులు, కుంటల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/హనుమకొండ :** చెరువులు, కుంటల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐఏఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ గోపాల్పూర్ ఊర చెరువును నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు క్షేత్ర స్థాయి లో పర్యటించారు. చెరువు పునరుద్ధరణకు చేపట్టాల్సిన చర్యల గురించి స్థానికులు, అధికారులతో మాట్లాడి సమగ్రవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. తెలంగ గోపాల్పూర్ స్థానిక నాయకులు ప్రజలు ఎమ్మెల్యే నాగరాజును శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు ఊర చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి పూడికతీత, సుందరీకరణ పనులు చేపట్టడంతో పాటు కబ్జాకి గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి హెచ్ఓ రమేష్, ఇఇ సంతోష్ బాబు, ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఇరిగేషన్ డిఈ హర్షవర్ధన్, మున్సిపల్ డిఈలు రవికిరణ్, సతీష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా స్వయం సహాయక సంఘాలకు రూ.8.97 కోట్ల వడ్డీ రాయితీ



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు సక్రమ చెల్లింపు ద్వారా పొందిన వడ్డీ రాయితీ వివరాలు ఆర్థిక సంవత్సరం 2023...24కు గాను పొందిన రూ.3.26 కోట్ల రూపాయలు 4409 సంఘాలకు వడ్డీ రాయితీ పొందడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్, 2024 నుండి జనవరి 2025 వరకు రూ.8.97 కోట్ల రూపాయలు, 5,233 సంఘాలకు వడ్డీ రాయితీ పొందడం జరిగిందని, ఫిబ్రవరి, మార్చి 2025 వరకు రూ.1.91 కోట్ల రూపాయలు 5308 సంఘాలకు వడ్డీ రాయితీ పొందడం జరిగిందని, ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా 10.88 కోట్ల రూపాయలు వడ్డీ రాయితీ అందజేయడం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నూతన కలెక్టరేట్ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాల నిర్మాణ పనులలో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం వరంగల్లోని పాత ఆజంజాహి మిల్స్ గ్రౌండ్లో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయాలను సందర్శించి, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ కార్యాలయాల సముదాయాలలో మూడు అంతస్తుల నిర్మాణాలను, కలెక్టర్ క్వార్టర్స్, అడిషనల్ కలెక్టర్ క్వార్టర్స్ మొదటి, రెండవ అంతస్తులలో డిజైన్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. స్ట్రక్చరల్ పనులు పూర్తయినందున ఫినిషింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైన సిబ్బందిని వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాంపౌండ్ వాల్, పైప్ లైన్ తదితర నిర్మాణ పనులను కూడా పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి , జిల్లా రోడ్ల భవన అధికారి రాజేందర్, డిఈ శ్రీధర్, నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు

### హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/ హనుమకొండ/కమలాపూర్:** కమలాపూర్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి, ఐపి, లేబరేటరీ, ఫార్మసీ, ఎక్స్ రే యూనిట్, పేషంట్లకు అందించే ఆహారం కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాలలోని ఆయా విభాగాలను సందర్శించి వాటి వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోర్టబుల్ ఎక్స్ రే మిషన్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు కావలసినటువంటి ఫిలిమ్స్, రి ఏజెంట్స్ గురించి ఇండెంట్ చేయాలన్నారు. కమలాపూర్ ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రసూతి సేవల వివరాలను తెలుసుకొని గర్భిణీల చెక్ అప్, స్కాన్స్ సంఖ్య పెంచాలని అలాగే మండల పరిధిలోని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సాధారణ ప్రసవాలు అక్కడే జరిగేలా ప్రోత్సహించాలన్నారు. ఆశాలు, ఏఎన్ఎం లతో ప్రత్యేకంగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓకు సూచించారు. ఆరోగ్య కేంద్రానికి కావలసినటువంటి మందుల సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుండి ఏ విధంగా అందుతున్నయి, ఎలా రికార్డులు మెయింటెన్ చేస్తున్నారు స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. వార్డులో అడ్మిట్ అయి ఉన్నటువంటి పేషెంట్స్ను పలకరించి వారికి సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఇద్దరు డయేరియాతో అడ్మిట్ అయిన పేషెంట్స్ ఉండడంతో వారికి అందుతున్న తాగునీటిని పరిశీలించాలని ఎంపిడిఒని ఆదేశించారు. కమలాపూర్లో ఏఏ రకముల టెస్టులు చేయడం జరుగుతున్నదీ అలాగే తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్కి ఏఏ పరీక్షల నిమిత్తం శాంపుల్స్ పంపిస్తున్నారో వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ గౌతమ్ చౌహాన్, డిఎంఅండ్హెచ్ఓ అప్పయ్య, సిహెచ్సి సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్ ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, హెచ్ఇఒ రవీందర్, పిహెచ్ఎన్ లీలావతి, టిబి నోడల్ పర్సన్ ప్రభాకర్, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రమౌళి నాగరాజు, ఆరోగ్య పర్యవేక్షకురాలు అమృతమ్మ, ఆరోగ్య మిత్ర రవీందర్, హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపి క్యాంప్ కార్యాలయంలో 7 మంది లబ్ధిదారులకు రూ.6లక్షల 20 వేల సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారుకు ఎంపి డాక్టర్ కడియం కావ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేద ప్రజలకు వరం లాంటిదని అన్నారు. పేదల కోసం నిరంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. పార్టీలకతీతంగా సిఎంఆర్ఎఫ్ పథకం ఇవ్వడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/రాయపర్తి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. వన మహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేధిక ఆవరణలో వనమహోత్సవంలో మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగమణి, తహశిల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ కిషన్, ఎంపీవో ప్రకాశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు రవీందర్రెడ్డి, వర్ధన్నపేట మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, ప్రభాకర్, గోవర్ధన్రెడ్డి, అశోక్, యాదగిరి, మల్లయ్య, నీలయ్య, నర్సింహమూర్తి, కోటేశ్వర్, అప్రోజ్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గడప నుంచి విధిగా చెత్త సేకరణ

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** ప్రతి గడప నుండి విధిగా చెత్త సేకరణ జరగాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం నగర పరిధిలోని 37,38 డివిజన్ ఖిలా వరంగల్ ప్రాంతంలో కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి సానిటేషన్ నిర్వహణ తీరును పరిశీలించి నిర్వహణ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలని, ప్రతి డివిజన్లో ఇద్దరు జవాన్లు మాత్రమే విధులు నిర్వహించాలని ఆయా డివిజన్లలో పారిశుద్ధ్య సిబ్బంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో జవాన్లకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సిబ్బంది హాజరు నిర్వహణ పారదర్శకంగా కొనసాగాలని నిర్దేశించిన ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల లక్ష్యాలను జ వాన్లు చేరుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఒ డా.రాజారెడ్డి, ఏంహెచ్ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, హెల్త్ ఇన్స్పెక్టర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ గిరిజనులు సాగుచేస్తున్న సీలింగ్ భూములకు పట్టాలు అందించాలి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** రాయినిగూడెం ఆదివాసీ గిరిజనుల సాగులో ఉన్న సీలింగ్ భూములకు పట్టాలు అందించాలని జంపాల రవీందర్ అన్నారు. మంగళవారంర ములుగు తహసీల్దారు సాగు భూములకు పట్టాలు అందించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ రాయినిగూడెం ఆదివాసీ గిరిజన రైతులు 111, 112, సర్వే నంబర్లలో 37 ఎకరాల 09 గుంటల సాగుభూములలో 31 మంది గత 49 సంవత్సరాలుగా మనిషికి ఎకరానికి 1.10 గుంటల చొప్పున సాగులో ఉంటున్నార న్నారు. అది గతంలో మహ్మద్ నిజాంఖాన్ పేరు మీద ఉండగా అది సీలింగ్లో ఉంది అలాంటి భూమిలో గత నలభై తొమ్మిది ఏళ్లుగా ఆదివాసీ గిరిజనులు సాగులో ఉంటున్నారన్నారు. అలాంటి వారిపైన వారసుల పేరుతోనే గిరిజనేతరుడైన నాగంపల్లి బాబు అనే అతను వేధింపులకు గురి చేస్తూ కోర్టులో కేసు వేసిన అది కూడా కొట్టుకుపోయిని తర్వాత కూడా వేధింపులకు గురి చేస్తూ కొంత భూమిని ఆక్రమించి చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కనుక తహసీల్దారు నాగంపల్లి బాబుపై చర్యలు తీసుకొని ఆదివాసీ గిరిజన రైతులకు పట్టాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు తవిటి నారాయణ, పోతన్న, వట్టం సమ్మయ్య, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన వెంకటస్వామికి సన్మానం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా నారాయణగిరి గ్రా మ వాస్తవ్యుడు నాగేంద్ర నగర్లో నివాసం ఉంటున్న వక్కల వెంకటస్వామిని వరంగల్ హనుమకొండ జిల్లా కోర్టు ఔట్సోర్సింగ్ హౌస్కీపింగ్ కార్మికులు ఘనంగా సన్మానించారు. కార్మిక పక్షపాతి, జర్నలిస్టు అయిన వక్కల వెంకటస్వామికి అవార్డు రావడం తమ కార్మికులకు సంతోషంగా ఉందని తమకు ఎల్లవేళలా అండదండలు అందిస్తూ తమ కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ మాకు ధైర్యసాహసాలు నింపుతున్న వక్కల వెంకటస్వామికి డాక్టర్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేందర్, జి రజిత, ఈ సుకన్య, బి సుకన్య, బి రజిత, వసంత, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వక్కల వెంకటస్వామిని హనుమకొండ జిల్లా జులైవాడ లో కాంగ్రెస్ పార్టీ 50 డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ అప్సర్ పాష,  కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించినారు ఈ సందర్భంగా సయ్యద్ అప్సర్ మాట్లాడుతూ ఇలాంటి అవార్డులు ఎన్నో అందుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ బషీర్, పొట్ల నితిన్ కుమార్, మహమ్మద్ అబ్దుల్ సలీం, మేదర్ శ్రీకాంత్, రాము, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా సెంటర్లో చిరు వ్యాపారస్తుల ఆందోళన

### అధికారులపై సిపిఐ నేత అజయ్సారథిరెడ్డి ఆగ్రహం



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ప్రత్యామ్నాయం చూపకుండానే షాపులు కూల్చేశారని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్సారథిరెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా సెంటర్లో 16షాపులను ఆనాడు బిఆర్ఎస్ చైర్మన్ వార్డు కౌన్సిలర్లు కలిసి మున్సిపాలిటీ నిధులతో నిర్మించి ఇచ్చిన షాపులను నేడు అదే మున్సిపాలిటి వందల మంది పోలీస్ బందోబస్తుతో కూల్చడంపై సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్సారథిరెడ్డి ఆధ్వర్యంలో చిరువ్యాపారస్తులతో కలిసి ఇందిరా సెంటర్లో సుమారు రెండు గంటలపాటు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్సారథిరెడ్డి పోలీసు అధికారులకు, మున్సిపల్ కమీషనర్కు సమస్యను వివరించారు. నాడు పదేళ్ళ పాలనలో నాటి మున్సిపల్ చైర్మన్ ఈ ప్రాంత కౌన్సిలర్లు కలిసి వారి షాపులను మార్కెట్ ఏరియా నుంచి తొలగించి ప్రత్యామ్నాయంగా ఇక్కడ చూపించి మున్సిపాలిటీ నిధులతో వారే కట్టించి రిబ్బన్ కట్ చేశారని తెలిపారు. ఇప్పుడు ఇదే మున్సిపాలిటీ పోలీసు బందోబస్తుతో కూలగొట్టడం ఏంటని సమస్యను వివరించారు. ఎన్నో ఏళ్ళుగా చిరు వ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిన్న బతుకులపై మున్సిపాలిటీ అధికారులు ఇలా చేయడం దారుణం అన్నారు. మున్సిపాలిటీ కట్టించి ప్రత్యామ్నాయం చూపకుండా ఎలా కూలగొడతారని నిలదీశారు. నాడు రిబ్బన్ కట్ చేసి టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చిరు వ్యాపారస్తులకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. మున్సిపాలిటీకి అన్ని విధాల టాక్స్లు కడుతున్న చిన్న బతుకులపై ఇలా ప్రతాపం చూపించడం సరికాదని వారికి వెంటనే ప్రత్యామ్నాయం చూపెట్టాలని పెద్ద ఎత్తున చిరు వ్యాపారస్తులతో కలిసిఆందోళన నిర్వహించారు. అధికారులు పోలీస్ అధికారులతో కలిసి ప్రత్యామ్నాయ స్థ లాన్ని కూడా అజయ్సారథిరెడ్డి ఆధ్వర్యంలోఅదికారులకు చూపించారు. అ క్కడే నెల రోజుల్లో ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరం చేస్తానని కమీషనర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో పెరుగు కుమార్ రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, కొండమీది రవి, బాధితులు కవిత, శ్రీధ ర్,యాకూబ్, షాపా, బోళ్ళ భద్రయ్య, మోరె సత్తెమ్మ, ఎండి రహీం, ఎండి రఫీ, హుస్సేన హైమత్, మేక వెంకటేష్, నిదిగొండ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ప్రత్యూష మృతి కేసులో నలుగురు అరెస్టు

### కాజీపేట ఎసిపి ప్రశాంత్ రెడ్డి వివరాలు వెల్లడి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ జిల్లా హసన్ పర్తి కి చెందిన డాక్టర్ ప్రత్యూష మృతి కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు కాజీపేట ఎసిపి పింగళి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యూష భర్త, అత్తమామలు అయిన అల్లాడి సృజన్, కార్డియాలజిస్ట్, అల్లాడి మధుసూదన్, రిటైర్డ్ ఉద్యోగి, అల్లాడి పుణ్యవతి, గృహిణితో పాటు ఇన్ స్టాగ్రాం ప్రమోటర్ బానోతు శ్రుతిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. అల్లాడి సృజన్ మెడికవర్ ఆసుపత్రిలో, ఎంజిఎం ఆసుపత్రి, వరంగల్ లో కార్డియాలజి విభాగంలో పని చేయుచున్నాడని, 2017లో ప్రత్యూషను అల్లాడి సృజన్ వివాహం చేసుకున్నాడని, ఆ సమయంలో 30 లక్షల రూపాయలు, బంగారం, కారు మొదలగు వాటిని సృజన్, అతని తల్లి దండ్రులు తేసుకున్నారని, వారికి ఇద్దరు కూతుర్లు ఉన్నారని తెలిపారు. సుమారు ఒక సంవత్సరం నుండి మెడికవర్, ఆసుపత్రి వారు పబ్లిసిటి గురించి ఆసుపత్రిలో పని చేయు స్పెషలైజేషన్ కలిగిన డాక్టర్లను ఇంటర్వ్యూ చేసి ఇన్స్టాగ్రాంలో ఎక్కువ మంది ఫాలోవర్ అయిన బానోత్ శృతి అను ఆమెను ఆసుపత్రికి పిలిపించి, ఆమె చేత అల్లాడి సృజన్ ఇంటర్వ్యూ చేయించినప్పటినుండి ఆమెతో తనకు పరిచయమై, ఆమెతో సన్నిహితంగా ఉంటూ తరుచు ఫోన్లో మాట్లాడం, ఆమె తన ఇన్ స్టా అకౌంట్ బుట్టబొమ్మ_17లో రీల్స్ చేస్తూ పెట్టగా వాటిని ఫాలో అయి, ఆ తరువాత వారిద్దరూ వాట్సాప్ ద్వారా చాటింగ్ చేసుకుంటూ చనువుగా ఉండేవారని తెలిపారు. కొద్ది నెలల క్రితం ఈ విషయం అల్లాడి సృజన్ భార్య ప్రత్యూషకు తెలిసి సృజన్ ను, శృతిని హెచ్చరించిందని, ఈ విషయంలో సృజన్, అతని భార్య ప్రత్యూష మధ్య గొడవలు జరిగేవని, దీనికి తోడు సృజన్ తల్లిదండ్రులు అతనికి అండగా ఉండి ప్రత్యూష పై కోపం చేసేవారని, ఈ నెల 12న సృజన్ తల్లిదండ్రులు వారి ఇద్దరు కూతుర్లను తీసుకుని భద్రాచలంలో గల బందువుల ఇండ్ల వద్దకు వెళ్లారని, 13న కాలని వాళ్ళు బొగత జలపాతానికి వెళ్లి సాయంత్రం 4 గంటల సమయమున ఇంటికి వచ్చారని, తరువాత శృతి విషయంలో వారిద్దరి మధ్య వాగ్వివాదం జరుగగా, ప్రత్యూష కోపంతో పైన గల బెడ్ రూం కు వెళ్లి డోర్ వేసుకుందని,సృజన్ క్రింద హాలులో టీవీ చూస్తూ కూర్చున్నాడని, తరువాత అరగంట అయినా ప్రత్యూష నుండి రెస్పాన్స్ లేకపోయేసరికి సృజన్ పైకి వెళ్లి చూడగా, ఆమె బెడ్ రూమ్ తలుపులు పెట్టుకుందని చూసి, దగ్గరకు వెళ్లి పిలిచినా పలుకక పోయేసరికి, చిన్న హోల్ చేసి చూడగా లోపల ప్రత్యూష సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకున్నదని, వెంటనే వారి ఇంటి ప్రక్కన గల వారి సహాయంతో డోర్ ను పగుల గొట్టి ప్రత్యూషను ఉరి నుండి విడిపించి వెంటనే కారులో ఆరెపెల్లి లోని ఎన్ఎస్ఆర్ ఆసుపత్రికి తీసుకుని వెల్లగా అప్పటికే మరణించిందని తెలిపారు.

## అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు

### కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎల్లా గౌడ్



**ప్రజాపక్షం/ఖానాపూర్:** అభివృద్ధి ఓర్వలేకనే బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్పై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లా గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక నర్సంపేట మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్ రెడ్డి అవాకులు చెవాకులు పేలుతున్నారని యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లా గౌడ్ అన్నారు. రాష్ట్రంలో వరంగల్కు ప్రాధాన్యత తగ్గిందనడం సుదర్శన్ రెడ్డి అవివేకానికి నిదర్శనమన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విలేకరుల సమావేశంలో వరంగల్కు ప్రాధాన్యత లేదని చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన మరుక్షనం నుండి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి మతి భ్రమించి మాట్లాడుతున్నాడని అన్నారు. వందలకోట్ల పనులను రద్దు చేసి మరల అవే పనులకు టెండర్లు ఎంఎల్ఏ కాంట్రాక్టు దక్కించుకున్నాడని అనడం పెద్ది తెలివితక్కువ తనానికి నిదర్శమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిఆర్శ్రీస్ నాయకులకు ప్రజల అభివృద్ధి గుర్తుకు వస్తుందా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులను బిఆర్ఎస్ నాయకులు నిండా ముంచారన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్గా ఉన్నప్పుడు మక్కలు, గోనే సంచుల కొనుగోలు వ్యవసాయ అధికారిని అడ్డుపెట్టుకొని వందల కోట్లు స్కామ్ చేసింది నిజం కాదా, స్కాములు మీరు చేసి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం మీ చేతగాని తనానికి నిదర్శమన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుపేదలకు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, రూ.500కే గ్యాస్, ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ దేశ చరిత్రలోనే ఎక్కడ లేని విధంగా తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేలకోట్ల రూపాయలు నేరుగా రైతు ఖాతాలో వేసిన ఘన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఏర్పాటు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. గత పది సంతవ్సరాలలో పేదవాడికి ఒక డబుల్ బెడ్రూం కట్టివ్వలేని మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్ రెడ్డి ఉనికి చాటుకోవడానికి ప్రెస్మీట్లు పెట్టడం కాంగ్రెస్ పార్టీపై అసత్యపు ప్రచారాలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని అన్నారు.

## గోదావరి జలాలలో చెరువులు నింపాలని రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** గోదావరి జలాలలో చెరువులు నింపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జనగామ హుస్నాబాద్ రోడ్డులో వడ్లకొండ వద్ద రైతులు ఆందోళన చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్ బొల్లం శారద తదితరుల ఆధ్వర్యంలో నిరసన జరిగింది. బిఆర్ఎస్ చెందిన వారే అధికంగా ఉండడంతో ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చేయిస్తున్నట్లుగా కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ధర్నా ఎక్కువ సేపు జరగడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత వేసవిలో కూడా చెరువులు నింపకపోవడం వలన రైతులు ఇబ్బంది పడ్డారని, వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందన్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండు మాసాలు అవుతున్నా వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, వరి నార్లు సైతం ఎండిపోతున్న పరిస్థితి ఉందన్నారు. గోదావరి జలాలు వృదాగా పోతున్నందున వెంటనే రైతులకు నీరందించేందుకు నీటిని పంపింగ్ చేసి పంట పొలాలకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులతో పాటు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త కుల, జనగణన చేపట్టాలి



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వ అసెంబ్లీ స్థానిక సంస్థలలో, విద్యా, ఉద్యోగాలలో 42శాతం రిజర్వేషన్ల చట్టాన్ని ఏకగ్రీవంగా చేసి గవర్నర్ చేత ఆమోదింపబడి, కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి తక్షణమే ఆమోదించాలని, అంతేకాకుండా 2025లోనే దేశవ్యాప్త కుల జనగణన చేపట్టాలనీ, ఆ సర్వే ఆధారంగా బిసిల జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో బిసిల వాటా బిసిలకు ఇవ్వాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకటరాములు, జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శి వలబోజు వెంకన్న, చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ అధికారికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్లు మించరాదనీ సుప్రీం కోర్టు తీర్పు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల పేదల పేరుతో 103వ రాజ్యాంగ సవరణ చేసి తెచ్చిన ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల మాదిరిగానే బిసిలకు కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని, బిసిలకు కేంద్ర కెబినెట్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, రూ. 20లక్షల కోట్ల బడ్జెట్ను కేటాయించాలని ప్రధానమంత్రి ఆవాజ్ యోజన క్రింద బిసిలకు దళితులకు పక్క ఇళ్ల నిర్మాణానికి రూ.10 లక్షల రూపాయలు కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే విధానాలను వెంటనే నిలిపివేయాలని, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక లేబర్ కోర్టులను ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెట్ల ప్రైవేటీకరణ ఆలోచన విరమించాలని, రైతాంగానికి మద్దతు ధర ఇవ్వడానికి పార్లమెంట్లో చట్టం తేవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో బిసిలకు వారి దామాషా ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని కోరతూ ప్రధాన మంత్రి మోదీకీ మెమోరాండం పంపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేడిద అశోక్, చీకటి ప్రకాష్, చంద్రశేఖర చారి, గొడిశాల రాజు, వలబోజు కృష్ణ, పెద్దోడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ములుగు పిఎసిఎస్కు ఉత్తమ సొసైటీ అవార్డు



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** హైదరాబాద్లో జరిగిన నాబార్డ్ సంస్థ సదస్సులో ములుగు సొసైటీ బెస్ట్ సొసైటీగా ఎన్నికై అవార్డు పొందగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిసిసిబి చైర్మన్, టెస్కో చైర్మన్ మార్నేని రవీందర్రావు చేతుల మీదుగా ములుగు పిఏసిఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి అవార్డు అందుకున్నారు. ములుగు సొసైటీకి బెస్ట్ సొసైటీ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని మంత్రి సీతక్క ఆశీస్సులు ఉండడం వలనే ఈ అవార్డు అందుకోవడం జరిగిందని, మాతోటి పిఏసిఎస్ పాలకవర్గానికి, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు, మాకు సహకరించిన ములుగు మండల పరిధిలోని రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.

# క్రీడ




## ఐదేళ్ల తర్వాత రంగంలోకి స్పిన్ అస్త్రం..!



ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్ భారత్ మధ్య జులై 23 నుంచి మాంచెస్టర్‌లో నాలుగో మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ కోసం ఇంగ్లాండ్ జట్టును ప్రకటించింది. చేతి వేలి గాయం కారణంగా సిరీస్‌లో మిగిలిన రెండు టెస్టులకు దూరమైన స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో ఎడమ చేతివాటం స్పిన్నర్ లియామ్ డాసన్‌ను జట్టులోకి తీసుకుంది. అదే విధంగా సామ్ కుక్, జేమీ ఓవర్టన్ తిరిగి కౌంటీ క్రికెట్‌లో ఆడేందుకు జట్టు నుంచి రిలీజ్ చేసింది. 2017లో చివరి టెస్టు ఆడిన లియామ్ డాసన్.. ప్రస్తుతం జరుగుతున్న కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో హాంప్‌షైర్ తరఫున అదరగొడుతున్నాడు. ఈ క్రమంలో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించి ఎనిమిదేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి పునరాగమనం చేశాడు. ఇప్పటివరకు మూడే టెస్టులు ఆడిన 35 ఏళ్ల డాసన్ పేరుకు స్పిన్నరే అయినా బ్యాటింగ్‌లోనూ ప్రభావం చూపగలడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 212 మ్యాచ్‌లు ఆడి 10,731 పరుగులు చేశాడు. ఇందులో 18 సెంచరీలు, 56 అర్ధ సెంచరీలున్నాయి. నాలుగో టెస్టులో డాసన్ తుది జట్టులో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. లార్డ్స్ టెస్టులో మూడో రోజు ఆట సందర్భంగా జడేజా ఆడిన షాట్‌ను అందుకునే క్రమంలో బషీర్ ఎడమ చేతి వేలికి గాయమైంది. అనంతరం బషీర్ మైదానాన్ని వీడాడు. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన బషీర్ 9 బంతుల్లో రెండు పరుగులు చేశాడు. ఇక, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఐదో రోజు ఆట మధ్యలో బషీర్ బౌలింగ్‌కు దిగాడు. భారత్ ఆఖరి వికెట్‌గా సిరాజ్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను ముగించాడు.

**భారత్‌తో నాలుగో టెస్టు.. ఇంగ్లాండ్ జట్టు**

బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, జాక్ క్రాలీ, లియామ్ డాసన్, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, జేమీ స్మిత్, జోష్ టంగ్, క్రిస్ వోక్స్.

## లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్-2028

### క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూలు విడుదల

దాదాపు 128 సంవత్సరాల తర్వాత తిరిగి క్రికెట్.. ఒలింపిక్స్‌లో స్థానం సంపాదించుకోనుంది. లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ 2028 నిర్వాహక కమిటీ ఈ మేరకు షెడ్యూలు విడుదల చేసింది. ఈ మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్లో జరగనున్నట్లు తెలిపింది. మొదటి మ్యాచ్ జులై 12, 2028న నిర్వహించనున్నట్లు వివరించింది. ఒలింపిక్స్‌లో చివరిసారి 1900లో క్రికెట్ మ్యాచ్ జరిగింది. గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ మాత్రమే అప్పుడు పోటీ పడ్డాయి. తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు లాస్‌ఏంజెలెస్ వేదికగా టీ20 ఫార్మాట్లో క్రికెట్ పోటీలు జరగనున్నాయి. పురుషులు, మహిళల విభాగంలో ఈ పోటీలు జరగనున్నాయి. స్వర్ణ, రజత, కాంస్య పతకాల కోసం ఆరు జట్లు పోటీ పడనున్నాయి.

**షెడ్యూలు ఇదే..**

- గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు జులై 12 నుంచి 18, జులై 22 నుంచి 28 వరకు రెండు సెగ్మెంట్లలో జరగనున్నాయి.
- సెమీఫైనల్, మెడల్ మ్యాచ్‌లు జులై 19 (పురుషులు), జులై 29 (మహిళలు) తేదీల్లో నిర్వహించనున్నారు.
- ప్రతిరోజూ డబుల్ హెడర్స్ జరపనున్నారు.
- ఒక్కో జట్టులో 15 మందితో కూడిన సభ్యులకు స్థానం కల్పించనున్నారు.
- ఇలా మొత్తంగా 180 మందికి అథ్లెట్ కోటాలు కేటాయించనున్నారు.
- ఈ మ్యాచ్‌లన్నీ లాస్‌ఏంజెలెస్‌కు దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోమోనా ఫెయిర్ ప్లెక్స్ వేదికగా జరగనున్నాయి.

## 'మళ్లీ టాప్-10'లో లేడీ సెహ్వాగ్

### తెలుగమ్మాయికి కెరీర్ బెస్ట్ ర్యాంక్..!



పునరాగమనంలో ఒత్తిడి అనేదే లేకుండా చెలరేగి ఆడుతున్న భారత ఓపెనర్ షఫాలీ వర్మ ర్యాంకింగ్స్‌లో దూసుకొచ్చింది. మునపటి ఫామ్‌తో బౌలర్లను వణికించిన ఈ లేడీ సెహ్వాగ్ ఐసిసి మహిళల ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్10లో నిలిచింది. ఇంగ్లాండ్‌తో జరిగిన పొట్టి సిరీస్‌లో పరుగుల వరద పారించిన షఫాలీ టీ20 బ్యాటర్లలో తొమ్మిదో స్థానం దక్కించుకుంది. తొలి సిరీస్‌లోనే అద్భుతంగా రాణించిన తెలుగమ్మాయి శ్రీచరణి ఏకంగా టాప్ టెన్‌లో నిలవడం విశేషం. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్న ఈ స్పిన్ కెరటం ఆరో ర్యాంక్ కైవసం చేసుకుంది. భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మూడో ప్లేస్‌లో కొనసాగుతుండగా.. రెండు స్థానాల్ని కోల్పోయిన మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 14వ ర్యాంక్ సాధించింది. ఇంగ్లాండ్ చరిత్రాత్మక పొట్టి సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన రాధా యాదవ్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో నిలిచింది. పేసర్ అరుంధతీ రెడ్డి నాలుగు స్థానాలు మెరుగుపరచుకొని 36వ ర్యాంక్ సొంతం చేసుకుంది. ఆల్‌రౌండర్ దీప్తిశర్మకు మాత్రం షాక్ తగిలింది. టాప్2లో ఉన్న ఆమె మూడో స్థానానికి పడిపోయింది.

**మహిళా బ్యాటర్ల టాప్-5 ర్యాంకింగ్స్ :** బెత్ మూనీ(ఆస్ట్రేలియా), హేలీ మాథ్యూస్(వెస్టిండీస్), స్మృతి మంధానా(భారత్), తహ్లియా మెక్‌గ్రాత్(ఆస్ట్రేలియా), లారా వొల్వార్ట్ (దక్షిణాఫ్రికా).

**మహిళా బౌలర్ల టాప్-5 ర్యాంకింగ్స్ :** సదియా ఇక్బాల్(పాకిస్థాన్), అనబెల్ సథర్‌లాండ్ (ఆస్ట్రేలియా), దీప్తి శర్మ(భారత్), సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లాండ్), లారెన్ బెల్(ఇంగ్లాండ్).

**మహిళా ఆల్‌రౌండర్ల టాప్ -5 ర్యాంకింగ్స్ :** హేలీ మాథ్యూస్(వెస్టిండీస్), అమేలి కేర్(న్యూజిలాండ్), దీప్తి శర్మ(భారత్), అష్ గార్డ్‌నర్(ఆస్ట్రేలియా), చమరి ఆటపట్టు (శ్రీలంక).

పొట్టి క్రికెట్ సంచలనం షఫాలీ మరోసారి తన మెరుపులతో ఫ్యాన్స్‌ను అలరిస్తోంది. ఫామ్‌లేమితో ఏడాది పాటు జట్టుకు దూరమైన ఈ డాషింగ్ ఓపెనర్ ఇంగ్లాండ్ పర్యటనలో మెరుపు బ్యాటింగ్‌తో బెంబేలెత్తిస్తోంది. ఈమధ్యే ముగిసిన ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌లో 158.56 స్ట్రయిక్ రేటుతో 176 రన్స్ కొట్టింది.

# ఫోకస్ మహిళ

## పని ప్రదేశాల్లో పెరుగుతోన్న వేధింపులు

పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశ వ్యాప్తంగానూ ఈ వికృత పోకడలు వేళ్లూనుకుంటున్నాయి. చాలా మంది మహిళలకు చట్టాలపై స్పష్టమైన అవగాహన లేకపోవడం కూడా వేధింపులు పెరగడానికి ఒక కారణం. నిజానికి పని ప్రదేశాల్లో వారు ఎలాంటి మానసిక, శారీరక వేధింపులకు గురికాకుండా చూసేందుకు 'పనిప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం' (పోష్) ఉంది. ఈ చట్టాన్ని ప్రధానంగా పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపుల నుండి స్వేచ్ఛగా, గౌరవంతో పని చేయాలన్న ఉద్దేశ్యంతో రూపొందించారు. చట్టం నిర్వచనం ప్రకారం అసభ్యంగా చూడడం లేదా వ్యాఖ్యలు చేయడంతోపాటు, అభ్యంతరకరమైన శారీరక స్పర్శ, లైంగికంగా మితిమీరిన అభిప్రాయాల వెల్లడి, అసభ్యమైన పదాలు, సంకేతాలు, లేదా చలనచిత్రాలు చూపడం, పదోన్నతి ఇవ్వడం లేదా ఉద్యోగంలో కొనసాగింపునకు బదులుగా లైంగిక



ఆశయాలను కోరడం వంటి చర్యలు లైంగిక వేధింపుల కిందికి వస్తాయి. పది మందికి పైగా ఉద్యోగులున్న ప్రతి సంస్థలో, వారి ఫిర్యాదుల విచారణకు అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు చేయాలని, అందులో కనీసం ఒక మహిళా సభ్యురాలు ఉండాలని ఈ చట్టం స్పష్టం చేస్తున్నది. ఉద్యోగ సంబంధమైన భయాందోళనలు లేకుండా, నిష్పాక్షికంగా విచారణ జరిపేందుకు వీలుగా, సదరు కంపెనీ లేదా సంస్థకు చెందిన ఓ మహిళా సభ్యురాలు కూడా సభ్యులుగా ఉండాలని, సదరు మహిళకు హక్కుల పరిరక్షణలో అనుభవం ఉండాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. ఫిర్యాదు వచ్చిన తర్వాత 90 రోజుల్లోగా విచారణ పూర్తి చేయాలి. దోషిగా తేలినవారిని ఉద్యోగం నుంచి తొలగించడం లేదా ఇంక్రిమెంట్ నిలిపివేయడం లేదా క్షమాపణ చెప్పించడం వంటి చర్యలు తీసుకోవాలి. అంతేగాక, సదరు సంస్థలో క్రమం తప్పకుండా చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఇలావుంటే, భారత శిక్షా సంహిత (ఐపిసి) సెక్షన్లు 354 'ఎ' (లైంగిక వేధింపులకు శిక్ష), 509 (మహిళ గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు/ప్రవర్తన), 294 (అసభ్య ప్రవర్తన) మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ కల్పిస్తున్నాయి. విశాఖ తదితరులు వర్సెస్ రాజస్థాన్ ప్రభుత్వం కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు (1997)లో సూచించిన మార్గదర్శకాలు 'పోష్' చట్టానికి మూలాలుగా నిలుస్తాయి. మహిళల భద్రతపై సంస్థలు బాధ్యత వహించాల్సిన అవసరాన్ని తొలిసారిగా నిర్ధారించాయి. వేధింపులకు గురయ్యే మహిళలు ఆంతరంగిక కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. లేకుంటే, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే స్థానిక కమిటీ (ఎల్‌సి)ని సంప్రదించవచ్చు. న్యాయపరంగా కోర్టులను ఆశ్రయించవచ్చు. ఈ దిశగా పలు మహిళా హెల్ప్‌లైన్లు, ఎన్‌జిఒలు సహాయసహకారాలు అందిస్తాయి.

## హక్కులు సాధించుకున్న ధీర మహిళ ఎమిలి స్టోవ్




కెనడాలో మొట్టమొదటి వైద్యురాలిగా డాక్టర్ ఎమిలి హోవార్డ్ స్టోవ్ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. వైద్య విద్యను అభ్యసించడం, ఆ తర్వాత ప్రాక్టీస్ చేసుకోవడానికి వీలుగా లైసెన్స్ పొందడం ఆమెకు సులభంగా ఏమీ దక్కలేదు. ఈ హక్కులను ఆమె పోరాటం సాధించుకుంది. ఎంతో మంది మహిళలకు ఆమె జీవితం ప్రేరణనిస్తుంది. ఎమిలి స్టోవ్ కెనడా మహిళల చరిత్రలో శాశ్వతంగా చెరిగిపోని ముద్ర వేసింది. ఆమె ఒక వైద్యురాలు. అంతేకాదు, ఒక ఉద్యమ నాయకురాలు, సమాజం పట్ల బాధ్యత కలిగిన మానవతావాది. మహిళలు విద్య, వైద్యం, మరియు ఓటు హక్కుల పరంగా సమానత్వాన్ని పొందేలా పోరాడిన ఆమె, కెనడాలో ఫెమినిజం బీజాలు వేసిన వారిలో ఒకరు. 1831, మే 1న కెనడాలోని నార్ఫోక్ కౌంటీలో జన్మించిన ఎమిలి స్టోవ్‌కు చిన్నతనం నుంచి ఆమె తల్లిదండ్రుల మద్దతు లభించింది. అమ్మాయిలకు విద్యను నిర్లక్ష్యం చేసే సమాజంలో, చదువుతోనే వారి అభ్యున్నతి సాధ్యమని వారు బలంగా నమ్మారు. ఎమిలి స్టోవ్‌ను చదివించారు. ఆమె తన ప్రారంభ విద్యను స్థానిక పాఠశాలల్లోనే పొందింది. 1854లో ఆమె నార్మల్ స్కూల్‌లో చేరి టీచర్‌గా అర్హత పొందింది. ఇదే సమయంలో ఆమె మహిళల విద్యా హక్కుల కోసం చురుకైన కార్యకర్తగా మారింది. ఎమిలి స్టోవ్ వైద్య విద్యపై ఆసక్తి చూపినప్పటికీ, ఆమెను కెనడాలోని ఏమైనా వైద్య కళాశాలలో చేర్చుకోలేదు. మహిళలకు వైద్య విద్య నిషేధితంగా ఉన్న కాలంలో, ఆమె అమెరికా వెళ్లింది. 1865లో న్యూయార్క్ రాష్ట్రంలోని న్యూయార్క్ మెడికల్ కాలేజ్ ఫర్ ఉమన్‌లో ప్రవేశం పొందింది. 1867లో ఆమె డాక్టరేట్ పొందిన తొలి కెనడియన్ మహిళగా గుర్తింపు పొందింది. కెనడాకు తిరిగొచ్చిన తర్వాత, ఎమిలి టోరొంటోలో ప్రైవేట్ ప్రాక్టీస్ ప్రారంభించింది. అధికారికంగా వైద్య అనుమతి లేకపోయినా, ఆమె అనేకమంది మహిళలకు ఆరోగ్య సేవలు అందిస్తూ వైద్య నైపుణ్యంలో అత్యున్నత ప్రమాణాలు నిరూపించింది. మహిళలకు విద్య, ప్రత్యేకించి వైద్య విద్యను అభ్యసించే అవకాశంతోపాటు, వైద్య వృత్తిని చేపట్టడానికి లైసెన్స్‌ను కూడా ఇవ్వాలన్న డిమాండ్‌తో శాంతియుత ఉద్యమాన్ని నిర్వహించింది. వాదనలతో, ప్రచారాలతో, చట్టాల మార్పును కోరుతూ నిరంతరం పోరాటం సాగించి, చివరికి 1880 జులై 16న కెనడా ప్రభుత్వం నుంచి వైద్యురాలిగా గుర్తింపు సంపాదించింది. 1883లో ఎమిలి స్టోవ్ 'అంటారియో మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్'ను స్థాపించింది. ఇది కెనడాలో మహిళల కోసం ప్రారంభించిన తొలి వైద్య కళాశాల. ఈ చర్య వలన అనేక మంది యువతులు వైద్య విద్యలోకి అడుగిడడానికి మార్గం సుగమమైంది. ఆమె కూతురు, డాక్టర్ అగస్టా స్టోవ్‌గులెన్ ఈ సంస్థలోనే చదివి తరువాత కెనడాలో పూర్తి అధికారికంగా డాక్టరేట్ పొందిన తొలి మహిళగా నిలిచింది. ఆమె గౌరవార్థం కెనడా ప్రభుత్వం ప్రత్యేక తపాలా బిళ్లను విడుదల చేసింది. సామాజిక రుగ్మతలను ఖండించి, అణచివేత చట్టాలను, నిబంధనలను ఎదిరించి, కొత్త సమాజానికి రూపకల్పన చేయడమే నిజమైన సంస్కరణ అని ఎమిలి స్టోవ్ నిరూపించింది. ఆమె జీవితంలోని ప్రతి అడుగు మహిళా స్వతంత్రతను మరింత దృఢంగా చేసింది. నేడు కెనడాలో మహిళలు ఉన్న ఉన్నత స్థానాలన్నీ ఎమిలి స్టోవ్ లాంటి మహిళల ధైర్యానికే ఫలితాలు.

## 'డబుల్' ఇండ్లు పంపిణీ చేయరా?

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/జమ్మికుంట :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తోందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయకపోవడం పేదల పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో స్పష్టమవుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. జమ్మికుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమ్మికుంట మండలంలో నిర్మించిన కోట్ల రూపాయలు వెచ్చించి డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి పేదలకు పంచకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని శ్రీనివాస్ వాపోయారు. నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల ను అర్హులకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమించుకుని అర్హులందరికీ పంపిణీ చేస్తామని హెచ్చరించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో సిపిఐ పోటీ చేస్తుందని శ్రీనివాస్ తెలిపారు. అందులో భాగంగానే మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించుకుంటూ కార్యాచరణను రూపొందించుకుంటూ మందుకు వెళ్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే ధ్యేయంగా బరిలో నిలుస్తామని, హుజురాబాద్ నియోజకవర్గంలో ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలకు పోటీ చేస్తామని, ఇందుకు అనుగుణంగా క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో జమ్మికుంట, ఇల్లందకుంట సిపిఐ మండల కార్యదర్శులు గజ్జి ఐలయ్య, మాదారపు రత్నాకర్, నాయకులు బొజ్జం రామ్‌రెడ్డి, సారయ్య, శంకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై ఉద్యమాలు

### సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల సమస్యలపై ఉద్యమాలు చేస్తుంది కేవలం కమ్యూనిస్టు పార్టీలేనని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బత్తుల గంగారెడ్డి అధ్యక్షతన సిపిఐ ఆదిలాబాద్ మండల మహాసభ నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా ముడుపు ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సిపిఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ మండలంలో ఇంటి స్థలాలు, ఇండ్ల మంజూరు, మౌలిక వసతులు, విద్య, వైద్యం కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. భవిషత్తులో మరిన్ని ఉద్యమాలు చేస్తూ ప్రజల తరపున పోరాడతామని ఆయన తెలిపారు. గతంలో స్థానిక సంస్థల్లో గెలిచి మంచి పరిపాలన అందించడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నలిని రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు మేస్రం భాస్కర్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనా ఖాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి రమేష్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కామిలే రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## మతరాజకీయాలతో ప్రజలను విభజిస్తున్న బిజెపి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

### నర్సంపేటలో ఘనంగా సిపిఐ మండల మహాసభలు




**ప్రజాపక్షం/నర్సంపేట :** మతతత్వ రాజకీయాలతో ప్రజలను విభజిస్తూ కేంద్రంలో బిజెపి పాలన చేస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మంగళవారం సిపిఐ మండల 14వ మహాసభ ఘనంగా జరిగింది. పట్టణంలోని మేర భవన్‌లో గడ్డం నాగరాజు, పిట్టల సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ, ప్రజల హక్కులను కాలరాస్తుందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తూ లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ నిరుపేదల సంక్షేమం మరిచిందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కుతున్నదన్నారు. రచయితలు, కవులు, కళాకారులు, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారన్నారు. హిందుత్వ ఎజెండాతో ముస్లిం, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులపై విషం కక్కుతూ ప్రశ్నించే గొంతుక నొక్కుతున్నారన్నారు. పేదలకు విద్య, వైద్యం అందక ఆందోళనకు గురవుతున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని, నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో బిజెపి ప్రభుత్వం ఆదివాసీలను హత్య చేస్తున్నదన్నారు. ఈ చర్యలను మేధావులు, విద్యార్థులు వ్యతిరేకించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మహాసభలకు ముందు సిపిఐ సీనియర్ నాయకులు సుంకరనేని బాలనర్సయ్య, అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.మహాసభలలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాసుమియా, పనాస ప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు అక్కపల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వరుడు, గుండె భద్రి, తోట చంద్రకళ, కందిక చెన్నకేశవులు, దిడ్డి పార్థసారథి, మియాపురం గోవర్ధన్, పాలక కవిత, గడ్డం యాకయ్య, పిట్టల సతీష్, ఇల్లందుల సాంబయ్య, మమత, శైలజ, గడ్డం నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఎకరాకు 'సీతారామ' జలాలు



### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా డిమాండ్

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** సీతారామ ప్రాజెక్ట్ జలాల ను కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండలాలలో ప్రతి ఎకరాకు అందించాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. ఆళ్లపల్లి మండల పరిధిలోని మర్కోడ్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సిపిఐ మండల మూడవ మహాసభకు ముఖ్యఅతిథిగా సాబీర్‌పాషా హాజరై మాట్లాడారు. మహాసభకు ముందు మర్కోడు గ్రామం పురవీధుల గుండా సిపిఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభ ప్రాంగణంలో సిపిఐ సీనియర్ నాయకులు శ్రీరాం సమ్మయ్య ఎర్రజెండా ఆవిష్కరించారు. అనంతరం మండల కార్యదర్శి గొగ్గేలా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన మండల సభలో సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేస్తామని అనడం హాస్యాస్పదమన్నారు. నిరుపేదలు లేకుం డా చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. కమ్యూనిస్టుల పోరాటాలు ఫలితంగా పోడు భూములకు పట్టాలు వచ్చాయన్నారు. పట్టాలు పూర్తిస్థాయిలో అర్హులకు ఇవ్వలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న గిరిజనులతో పాటు గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయాలు చేయవద్దని, అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరారు. ఫారెస్ట్ అధికారులు కొత్త పోడు నరికితే ఆపాలని, కానీ సాగులో ఉన్న భూముల జోలికి రావద్దని ప్రభుత్వాన్ని కోరారు. త్రీపేస్ కరెంటు లైన్లకు అడ్డుపడకుండా రైతులకు న్యాయం చేయాలన్నారు. దేశంలో 100 ఏళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని, ఎంతో మంది సిపిఐ లేకుండా చేస్తామని చెప్పి చివరికి వారే లేకుండా పోయారన్నా రు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి అధిక సీట్లు గెలిచేలా ప్రయత్నిం చాలన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసిస్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా మర్కో డు ప్రాంతానికి చెందిన 15 కుటుంబాల సభ్యులు సిపిఐలో చేరారు. వారిని పార్టీలోకి సాబీర్‌పాషా ఆహ్వానించారు. అనంతరం సిపిఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా కొమరం హనుమంతరావు, సహాయ కార్యదర్శులు వజ్జ పగడయ్య, నరెడ్ల రాంబాబు, ఎస్‌కే రహీంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, సిపిఐ నాయకులు సహదేవ్, మల్లేష్, సతీష్, సూర్యనారాయణ, రాజు, సురేందర్, నరేష్, సమ్మయ్య, శివ, రమేష్, శ్రీను, శివ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిపిఐ సిద్దిపేట జిల్లా మహాసభ

### భారీగా తరలిరావాలని జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపు



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** హుస్నాబాద్ పట్టణంలో బుధవారం జరగనున్న సిపిఐ జిల్లా మహా సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద పవన్ మాటాడారు. సిపిఐ జిల్లా మహాసభల సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి మల్లె చెట్టు చౌరస్తా మీదుగా కెజె అర్ గార్డెన్‌లో వరకు సిపిఐ శ్రేణుల భారీర్యాలీ ఉంటుందని తెలిపారు. ర్యాలీలో పార్టీ శ్రేణులు విధిగా ఎర్రదుస్తులు ధరించి పాల్గొనాలని ఆయన కోరారు.జిల్లా మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కలవేణి శంకర్ ముఖ్య అతిధులుగా పాల్గొంటారన్నారు. మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి మండల కార్యదర్శులు, గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మహిళ నాయకురాళ్లు, పార్టీ ప్రజా సంఘాల ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముభాస్కర్, ముంజగోని, జెరిపోతుల జనార్ధన్, సుధాకర్, రాజు, వెల్పుల ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ప్రభుత్వానిది చిన్నచూపు

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను చిన్నచూపు చూస్తుందని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ఆరోపించారు. మంగళవారం గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్‌లో ఎఐఎస్ఎఫ్ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని ఎన్నికల ముందు పదేపదే మాట్లాడి కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఒకేసారి విడుదల చేస్తామని చెప్పి నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి పట్టించుకోవడంలేదన్నారు. విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత రవాణా కల్పించాల్సింది పోయి బస్‌పాస్ చార్జీలను పెంచడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేవన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, నాయకులు ముల్కల పవన్, నితిన్, గణేష్, రేవత్, ప్రణీత్, విష్ణు పాల్గొన్నారు.

# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్



## అన్ని వర్గాలకు అండగా ఉన్నాం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట :** అన్ని వర్గాలవారికి అండగా ఉండే ప్రభుత్వం మనది అని మంచిర్యాల ఎంఎల్ఏ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత 30 ఏళ్లగా ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వకుండా గత ప్రభుత్వం పబ్బం గడిపింది, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకుంటోంది అని చెప్పారు. కలెక్టర్ దీపక్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల వారు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వైద్యం, విద్య, ఇళ్లతో పాటు ప్రతి ఒక్కరు సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ కార్డులు ఇస్తున్నాం అని పేర్కొన్నారు.

## కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘానికి అవార్డు



**ప్రజాపక్షం/పొన్నపేట:** సొసైటీ సభ్యులకు మెరుగైన ఆర్థిక వినిమయ సేవలు అందించి, లాభాల్లో రైతులకు 10 శాతం డివిడెంట్ పంచిన కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ బ్యాగ రమేష్‌కు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సహకార శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, నాబార్డ్ జీఎం ఉదయభాస్కర్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. నాబార్డ్ అధ్యక్షత్వంలో మెదక్ ఉమ్మడి జిల్లా నుండి కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘాన్ని ఎంపిక చేశారు. సొసైటీకి వచ్చిన లాభాల్లో సుమారు రూ.17.50 లక్షలు సభ్య రైతులకు 10 శాతం చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారు. రైతులకు రుణాల పంపిణీ, వాటి రికవరి, పెట్రోల్, డీజిల్ బంకుల నిర్వాహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఫర్టిలైజర్ సేవలు తదితర విభాగాల్లో సొసైటీ చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసినట్లు చైర్మన్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవార్డు తన బాధ్యతలను పెంచిందని, సొసైటీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని చెప్పారు.

## కస్తూర్బాలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం / తిర్యాణి :** తిర్యాణి మండలంలోని మాణిక్యాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల వసతి పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి కె. అంజయ్య తెలిపారు. ఒక అసిస్టెంట్ కుక్, ఒక స్వీపర్ స్కావెంజర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఏడవ తరగతి చదివిన స్థానిక మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 19 లోపు మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు చేయాలని, దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికేట్, బోనఫైడ్, కుల, స్థానిక ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా జత చేయాలన్నారు.

## టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జిఒను రద్దు చేయాలి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఆదివాసీలను జల్, జంగల్, జమీన్‌కు దూరం చేసే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జిఒ నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలంలోని మనిక్ గూడ వద్ద స్థానికులతో కలిసి కరపత్రాలను విడుదల చేసి, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ అమలైతే కుమురం భీమ్ జిల్లాలోని 339 గ్రామాలకు మనుగడ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో పీసా చట్టం అమలు చేయకుండా, గ్రామ సభలను నిర్వహించకుండా జిఒ తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. పులుల సంరక్షణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అడవులు అప్పగించే కుట్ర ప్రభుత్వాలు పన్నుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఈ జిఒను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీలతో పాటు నిరుపేద ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గేడం టీకానంద్, ఆసిఫాబాద్ మండల కన్వీనర్ గొడిసెల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస ప్రజలకు భూ సర్వే : ఆర్‌డిఒ



**ప్రజాపక్షం/కడెం :** కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో ఉన్న రాంపూర్, మైసంపేట గ్రామలను కడెం మండలం ధర్మాజీపేట మద్దిపడగ మధ్యలో వారి నివాసాలకే ప్రభుత్వ భూములు కేటాయించి ఇల్లు కట్టించిన ప్రభుత్వం ఇప్పుడు వారికి అవసరమైన భూ సేకరణ కొరకై సర్వే నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ శివారులో భూ హద్దులను గుర్తించేందుకే రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టినట్లు ఆర్డీవో రత్న కళ్యాణి తెలిపారు.కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ శివారులో జరుగుతున్న రెవెన్యూ భూ సర్వే ప్రదేశాన్ని నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, 2015 సంవత్సరంలో అటవీ శాఖ భూములను పునరావాస గ్రామాల ప్రజల ప్రయోజనాల కొరకు డీనోటిపై చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.రాంపూర్,మైసంపేట్ పునరావాస గ్రామాల ప్రజలకు చట్ట ప్రకారం భూములు పంచేందుకు అర్హులను గుర్తించామని అన్నారు.ఈ భూ ముల తుది హద్దులను గుర్తించేందుకే అధికారులు సర్వే చేపట్టారని తెలిపారు.ఈ సర్వేపై ప్రజలెవరూ ఆందోళన చెందవద్దన్నారు. భూ సర్వేకు సంబంధించి సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలని తెలిపారు.భూ హదుల గుర్తింపు సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడం ఎమ్మార్వో ప్రభాకర్,ఖానాపూర్ ఎమ్మార్వో సూజాత,అటవీ శాఖ అధికారులు పోలీసు వారు పాల్గొన్నారు.

## రోడ్డు మరిచి.. ఓట్లు అడగొచ్చా?

**ప్రజాపక్షం /బెజ్జూర్/ పెంచికల్‌పేట్ :** బెజ్జూర్ నుంచి సోమిని వరకు ప్రధాన రహదారికి మరమ్మతులు చేయకపోతే, ఎన్నికల వేళ ఓట్లు అడగడానికి వస్తే ఊర్లలోకి అనుమతించబోమని గ్రామస్థులు హెచ్చరించారు. సోమిని సహా చుట్టు పక్కల 12 గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు మంగళవారం సమావేశమై సమస్యను లేవనెత్తారు. ప్రతి వర్షాకాలంలో కుష్నపల్లి నుంచి సోమిని వరకు ఉన్న మట్టి రహదారి పూర్తిగా గుంతలమయమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రానికి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఎన్నిసార్లు స్థానిక ఎంఎల్ఏను, అధికారులను కోరినా ఫలితం లేదు అని మండిపడ్డారు. ఈ సమస్యను మాజీ ఎంఎల్ఏ కోనేరు కోనప్ప దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో రోడ్డు మరమ్మతులు పూర్తిచేస్తా అని ఆయన చెబుతూ, గ్రామస్థులతో ఫోన్లో మాట్లాడినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కోనేరు కోనప్పకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సోమిని, సుస్మీర్, మొగవెల్లి సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు ఆత్రం సాయి, లంగారి శ్రీనివాస్, ఎలాది చంద్రశేఖర్, ఆలం అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు కాదు హక్కుపత్రాలే కావాలి



పోడు రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/చింతలమానేపల్లి :** పోడు భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. మండలంలోని దిందా అడవిలో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటేందుకు వెళ్లగా అక్కడికి చేరుకున్న రైతులు కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. 'ఇవి మా పూర్వీకు ల నుంచి సాగు చేస్తున్న భూములు. భవిష్యత్తు తరాలకు జీవనాధారం ఇవే. మొక్కలు నాటడం కాదు హక్కు పత్రా లే కావాలి' అని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందిస్తూ 'ఇవి ప్రభుత్వ అడవులు. వనరక్షణ కోసం మొక్కలు నాటాల్సిందే' అని తెలిపారు. దీం తో అధికారులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మొక్కలు నాటనివ్వబోమని రైతులు భీష్మించుకొని కూర్చొన్నారు. పోడు భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలి. మాకు హక్కు పత్రాలు ఇవ్వకుంటే ఉద్యమాన్ని ముమ్మరం చేస్తాం అని రైతులు హెచ్చరించారు. గ్రామ పె ద్దలు, అటవీశాఖ మధ్యవర్తులు సమస్య పరిష్కారానికి ప్ర యత్నిస్తున్నారు. రాష్ట్రం నుంచి కేంద్రం వరకు పోడు భూ ములపై హక్కుపత్రాలే ప్రధాన సమస్యగా నిలుస్తుండటం తో ప్రతి ఏడాది ఇలాంటి ఘర్షణలు పునరావృతమవుతున్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం పోడు భూముల సమస్యల ను పరిష్కరించేందుకు కృషి చేయాలని, ప్రతి ఏటా ఘర్షణ వాతావరణంతో పోడు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నేడు టియుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రజాపక్షం / నిజామాబాద్ :** నేడు తెలంగాణ యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవంలో పాల్గొనటానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీకి రానున్నారు. హైదరాబాదు నుండి డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ చేరుకొని అక్కడి నుండి ఉదయం 10.30 గంటల కు యూనివర్సిటీ స్పోర్ట్స్ మైదానంలో జరిగే స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొని భోజనానంతరం కలెక్టరేట్‌లో జాతీయ, రాష్ట్ర అవార్డు గ్రహీతలతో ముచ్చటిస్తారు.

### గవర్నర్ పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన సిపి

తెలంగాణ యూనివర్సిటీలో ద్వితీయ స్నాతకోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో భాగంగా మంగళవారం సిపి సాయిచైతన్య బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్ర గవర్నర్ బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత తెలంగాణ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఏర్పాటు చేసిన ఏర్పాట్లను సిపి సాయిచైతన్య పర్యవేక్షించారు. అనంతరం డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో గెస్ట్‌హౌస్‌లోని బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా టియు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి, సిబ్బంది 7వబెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ కెపి సత్యనారాయణ డిచ్‌పల్లి వినోద్, ఎస్సై షరీఫ్ పాల్గొన్నారు.



## వైద్యరంగంలో... విప్లవాత్మక మార్పులు

- ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్న సిఎం రేవంత్ రెడ్డి
- డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భ్రష్టు పట్టిన వైద్యరంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగానే గ్రామీణ వైద్యానికి పెద్దపీట వేస్తూ నిధులు వెచ్చిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ మాతాశిశు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో భాగంగా ఐకెపి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతుండగా, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా పేదల వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తుండగా, రోగి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ముందుగా ఎల్‌ఓసిలు సైతం మంజూరి చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా సొంతంగా డబ్బులు వెచ్చించి వైద్య సేవలు పొందిన పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేస్తుండగా, ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లాలో రూ.900 కోట్ల సిఎం రిలీఫ్ ఫండ్ అందించినట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులలో మరమ్మత్తులు, ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండగా, స్థానిక ఆసుపత్రిలో ఏ అవసరం ఉన్నా పరిష్కారానికి తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అయితే వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. కాగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం మహిళలు కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చక్కటి సేవలు అందుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసా య మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఐకెపి ఎపిఎం దుర్గాప్రసాద్, నాయకులు మునగారి రాజు, నక్క రాములు గౌడ్, సమీర్ జంగం రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, గుండు లక్ష్మణ్, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులు పర్యవేక్షించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చేగుంట మండలం పులిమామిడి, బోనాల గ్రామాలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 9,000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 5,000 గ్రౌండింగ్ అయి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని , మిగిలిన ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనుల త్వరితగతిన గ్రౌండింగ్ చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో ప్రోత్సహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, నిర్మాణపు పనులు పూర్తి చేయడంలో జిల్లాను ముందు వరుసలో ఉంచాలని కోరారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు కూడా అందిస్తామని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ అధికారులను కోరారు. ఒక్కో మునిసిపల్, మండలాల వారీగా కేటాయించిన లక్ష్యం, లబ్ధిదారుల నిర్ధారణ, మంజూరీలు తెలిపిన వాటిలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి, అవి ఏదశలో ఉన్నాయి, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. లక్ష్య సాధన కోసం అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు నిధుల సమస్య ఎంతమాత్రం లేదని, నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ఆయా దశలను బట్టి వెంటవెంటనే వారి ఖాతాలలో నిధులు జమ చేయడం జరుగుతోంద ని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను నేరుగా కలిసి, వారు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని, ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండిం గ్ ప్రక్రియను నిశిత పర్యవేక్షణ జరపాలని కలెక్ట ర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ముగ్గు పోసి, ఇల్లు పునాది తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

## మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి :** హత్నూర సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మంగళవారం నాడు తనఖీ చేసారు. ఈ సందర్భంగా సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతి భోజనం మౌళిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని వంటగది, స్టోర్‌రూమ్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాసిరకంగా ఉండడంతో సంక్షేమ అధికారి మోహన్ నాయక్‌పై అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన వస్తువులతో రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలల 'వైబ్స్ అండ్ రిథమ్స్'లో ఉత్సాహం ఉరకలు..



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** నిర్మల్ పట్టణంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన 'వైబ్స్ అండ్ రిథమ్స్' కార్యక్రమం విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని నింపింది. స్థానిక ప్రైవేటు వేడుక మందిరంలో అట్టహాసంగా జరిగిన ఈ ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలల వేడుక ప్రారంభోత్సవానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడంతో పాటు, వాటిలో పాల్గొనేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ప్రోత్సాహాన్ని అందించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సరస్వతీ పూజతో కార్యక్రమం ప్రారంభానికి ముందు డా.వి.నరేందర్ రెడ్డి సరస్వతి మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలను చేసి, విద్యార్థుల కేరింతల మధ్య ఉత్సాహంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్య,సాంస్కృతిక కార్యకలాపాల ప్రాధాన్యత ఈ సందర్భంగా డా.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ఎప్పటికప్పుడు సాధన చేయడం ద్వారా వివిధ స్థాయిలలో నిర్వహించబడే పరీ క్షలలో ప్రతిభను చాటి ఘన విజయాలు సాధించాలని కోరారు. అదే సమయంలో, విద్యార్థులు విధిగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడమే కాకుండా,ఏకాగ్రతను సైతం పెంపొందించుకొని పరీక్షలలో పై చేయి సాధిస్తారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు,నాటికలు ఆలోచింపజేయడమే కాకుండా ఉత్సాహాన్ని నింపాయి. ఈ వేడుకలలో భాగంగా,ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఐఐటీ,నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి,ప్రతిష్టాత్మక ఐఐటి,ఎన్ఐటి,ఐఐఐటి,మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించిన లేదా సాధించబోయే విద్యార్థులను,వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్,అధ్యాపకులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలకు న్యాయ సహాయ సేవలు మరింత విస్తృతం చేయాలి

'మిషన్ వాత్సల్య' ద్వారా బాలల సంక్షేమం, దత్తత ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ ప్రావీణ్య





**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలు,శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్‌జెండర్‌లకు అందుతున్న సేవలపై అవగాహన పెంచుతూ సౌండ్ లైబ్రరీ వంటి వినూత్న కార్యక్రమాలపై సమీక్ష, అలాగే సఖి కేంద్రం ద్వారా మహిళల హక్కుల పరిరక్షణ జిల్లా మహిళా సాధికారత ద్వారా జరుగుతున్న కార్యక్రమ సేవలు నైతిక న్యాయ సహాయ సేవలపై కార్యచరణ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఐసిడిఎస్ ద్వారా పూర్వ ప్రాథమిక విద్య గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహార సేవల అమలును సమీక్షించారు. అలాగే మిషన్ వాత్సల్య పథకం ద్వారా పిల్లలకు ఇవ్వబడే స్పాన్సర్‌షిప్ దత్తత బాల సదనాలు శిశు రక్షణ కేంద్రాల నిర్వహణపై వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లా మహిళ సాదికారిత సఖి కేంద్రాల ద్వారా బాదిత మహిళలకు న్యాయ సహాయ సేవలు మరింత విస్తృతంగా చేయాలని సూచించారు. మిషన్ వాత్సల్య ద్వారా బాలల సంక్షేమం దత్తత ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు ఆహారం ,విద్య, ఆరోగ్య పరిరక్షణపై నిరంతరం పర్యవేక్షణ జరపాలని పేర్కొన్నారు. దివ్యాంగులు వృద్దులు ట్రాన్స్ జెండర్‌లకు అందుతున్న సేవలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి సిడిపీఓలు చంద్రకళ ,జయరామ్ ప్రియాంక, అంజమ్మ, సుజాత, డిసిపిఓ రత్నం పోషణ అబియాన్ కో ఆర్డినేటర్ సౌమ్య జిల్లా మహిళా సాదికారిత కో ఆర్డినేటర్ పల్లవి, సఖి కేంద్రం కో ఆర్డినేటర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/నస్పూర్ :** మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా భవన్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక ఉత్సాహం కల్పించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్లు, పెరటి కోళ్ల పెంపకం, డైరీ ఫారాలు, ఇతర వ్యాపార అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు కూడా ప్రోత్సాహం అందిస్తామన్నారు. దండేపల్లి మండలంలో ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. మహిళా భవన్ పనులు వేగవంతం చేయాలని గుత్తేదారులకు సూచించారు. అనంతరం నస్పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు వంటి సదుపాయాలు కల్పించిందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, తాజా కూరగాయలు వాడాలని, శుద్ధమైన త్రాగునీటిని ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి మరింత శ్రద్ధ చూపించాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## గీత కార్మికులకు కాటమయ్య కవచం



**ప్రజాపక్షం/అంతర్గాం :** కల్లు గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే, దిగే క్రమంలో ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు కాటమయ్య రక్షణ కవచం కిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గోదావరిఖని అబ్కారీశాఖ ఎస్.ఐ. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మూర్మూర్‌లో కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన కల్పించారు.అబ్కారీశాఖ కానిస్టేబుళ్లు రఘు, రాజు, శ్రావణ్, రక్షణ కవచం శిక్షకులు జాగిరి అంజిగౌడ్, పొన్నం వెంకటేష్‌గౌడ్, కాట రవీందర్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, గోలివాడ గౌడ సంఘం అధ్యక్షులు కోల రామ్మూర్తిగౌడ్, మూర్మూర్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు మాదాసు చంద్రమౌళి, బూరుగు రవిగౌడ్, మడ్డి రామ్‌గౌడ్ పాల్గొన్నారు.

## బిల్లులు రాక అప్పుల బాధతో సర్పంచ్ భర్త ఆత్మహత్యా యత్నం



**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధరమండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాళ్ల విజయక్ష్మి భర్త రవి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకున్నాడు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులనకు బిల్లులు రాకపోవడంతో తెచ్చిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఆత్మహత్య యత్నం చేసుకోవడంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలోకి చేర్పించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించి ఓదార్చారు. సర్పంచులు రావాల్సిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రవికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆయన వెంట బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, మాజీ సర్పంచ్ జోగు లక్ష్మిరాజం, ముక్కెర మల్లేశం, నాయకులు ఆకుల మధుసూధన్. వడ్లూరి ఆదిమల్లు తదితరులున్నారు.

## కార్పొరేట్ తరహాలో కంటి శస్త్రచికిత్స



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ తరహాలోనే కంటి శాస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15లక్షల వ్యయంతో జిల్లా కలెక్టర్ ఆర్థిక సహాయం తో ఏర్పాటు చేసిన కంటి శస్త్ర విభాగం సమర్థవంతంగా పని చేస్తుందనీ, సుమారుగా నెలకు 100 – 150 కంటి ఆపరేషన్స్ జరుగుచున్నవని, ఇప్పటి వరకు దాదాపు 1200మందికి డా. సబిహ మరియు డా. సింధూర లు విజయవంతంగా ఆపరేషన్స్ నిర్వహించారని తెలిపారు.

## అపరిచిత ఫోన్ కాల్స్ నమ్మొద్దు




**ప్రజాపక్షం/కొండపాక:** కుకునూరుపల్లి పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాల గురించి ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఎస్ఐ శ్రీనివాస్, గజ్వేల్ షీటీమ్ బృందం మాట్లాడుతూ అపరిచిత ఫోన్ కాల్స్ మాటలు నమ్మొదని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, విద్యార్థి దశ మళ్లి రాదని చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దని, చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. స్కూల్ హెడ్మాస్టర్ హేమలత, అధ్యాపకులు, అజయ్ కుమార్‌రెడ్డి, కుకునూరుపల్లి ఎస్ఐలు సువర్ణ, జగదీశ్వర్, గజ్వేల్ షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ మహేష్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 'ఆరోగ్య భద్రత' ద్వారా వైద్య సేవలు

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు దంతాల సమస్యలుంటే రామా డెంటల్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. మంగళవారం రామాస్మైల్ కేర్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హస్పిటల్ బాల సునీల్‌కుమార్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సిపి అనురాధను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందచేశారు. డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ రామ డెంటల్ ఆసుపత్రిలో ఆరోగ్య భద్రత ద్వారా క్యాష్‌లెస్ ట్రిట్‌మెంట్ ఇవ్వటం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లో అందించే అన్ని రకాల చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సిపి అనురాధ మాట్లాడుతూ ఆరోగ్య భద్రత పథకం ద్వారా పోలీసు అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు క్యాష్‌లెస్ చికిత్స అందించటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సిసి ఆర్‌బి ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ,ఎస్‌బిఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల అమలుకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/అంతర్గాం :** రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో 42 శాతం బి.సి. రిజర్వేషన్లను అమలు చేయాలని తీర్మానం చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఒబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టో కమిటి ఛైర్మన్‌గా ఉండి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆలోచన విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో ఉన్న బి.సి. వర్గాల ప్రజలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలంటే జనాభా ప్రకారం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా సాధ్యమౌతుందని నమ్మి అమలుకు కృషి చేయడం పట్ల మంత్రిని అభినందించినట్లు తెలిపారు.

## బధిర విద్యార్థులకు ప్రోత్సాహం

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కంప్యూటర్ల రంగంపై, కుట్టుమిషన్‌పై శిక్షణ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** బధిదిర విద్యార్థులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇప్పిస్తూ భవిష్యత్తులో వారు విభిన్న రంగాల్లో రాణించేలా చూస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శాతవాహన యూనివర్సిటీ సమీపంలో గల ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బధిర విద్యార్థులు సైతం విభిన్న రంగాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో కుట్టు మిషన్, కంప్యూటర్ రంగంలో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ముగ్గురు ఒకేషనల్ టీచర్లను కేటాయించామని తెలిపారు. విధ్యార్థులతో ముం దుగా పిల్లో కవర్, బ్యాగ్ వంటి సులువైన వస్తువులను కుట్టించడం నేర్పించాలని అన్నారు. ఈ రకమైన శిక్షణల వల్ల వారు భవిష్యత్తులో విభిన్న రంగాల్లో స్థిరపడతారని, మార్కెటింగ్‌పై అవగాహన వస్తుందని తెలిపారు. బధిర విద్యార్థులతో సంభాషించే విధంగా 100 మందికి సైన్ లాంగ్వేజీలో శిక్షణ ఇస్తామని తెలిపారు. టీచర్లు, ఇన్స్ట్రక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి ఈ లాంగ్వేజిపై తొలుత శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం విధ్యార్థుల తరగతి గదులను సందర్శించి వారి నోట్ పుస్తకాలను, చేతి రాతను పరిశీలించారు. తరగతి గదులు, పాఠశాల ఆవరణలో మంచి పెయింటింగ్స్ వేయించాలని సూచించారు. ఇక్కడి సైన్స్ ప్రయోగ శాలలను ఆధునికంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఒకేషనల్ కోర్సుల కోసం అవసరమైన వస్తువులు సమకూరుస్తామని తెలిపారు. జిల్లా బాలికల అభివృద్ధి అధికారిని కృపారాణి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ కమల, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.

## కోర్టు కేసులపై అప్రమత్తంగా ఉండాలి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలో అధికారులు నిబంధనల ప్రకారం విధులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హైకోర్టు కేసులు, ఆర్.టి.ఐ. దరఖాస్తులు, ప్రజావాణి, ప్రజా దర్బార్ దరఖాస్తుల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ్ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టు కేసులను సరిగ్గా ఫాలో కాకపోవడం వల్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు వస్తున్నాయని, ప్రతి శాఖ తమ పరిధిలో కోర్టు కేసులనుఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలని, సరైన కౌంటర్ సకాలంలో ఫైల్ చేయాలని, మన దగ్గరి నుంచి కేసు సంబంధించిన డాక్యుమెంట్స్ ఫైల్ చేయాలని అన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులకునిబంధనల ప్రకారం సమాధానం సకాలంలోపంపాలని, ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ ఉండవద్దని అన్నారు. దిశ సమావేశం సంబంధించిన మీటింగ్‌పై తీసుకున్న చర్యలు రిపోర్ట్ రేపటి వరకు డి.ఆర్.డి.ఓ కార్యాలయానికి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రోటోకాల్ సంబంధించి చెక్ లిస్ట్ ప్రతి శాఖ పంపాలన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతులలో సిబ్బంది నియామకం సంబంధించి ప్రతి అంశాన్ని కలెక్టరేట్ దృష్టికి తప్పనిసరిగా తీసుకొని రావాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సజావుగా నియామకం జరిగేలా చూడాలని అన్నారు.ఏఐ టూల్స్ వాడుతూ మన కార్యాలయ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. చాట్ జి.పి.టి, నోట్ బుక్ ఎల్ ఎం వంటి టూల్స్ ఉపయోగం ద్వారా తక్కువ సమయంలో మరింత మెరుగ్గా పని చేయవచ్చని, దీని పై జిల్లా అధికారులు అవగాహన పెంచుకొని సిబ్బందికి నేర్పించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

### మిషన్ భగీరథ గ్రిడ్ ఇఇ పూర్ణచందర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఈ నెల 16న పెద్దపల్లి జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణ చందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ముర్మురు హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి ఇంటెక్ వాల్, పంప్ హౌస్ లో గల మిషన్ భగీరథకు సంబంధించిన 1072 హెచ్.పి పంపుల నిర్వహణ, బటర్ ఫ్లై వాల్వ్ యొక్క మరమ్మత్తు నిమిత్తం జూలై 16 ఉదయం 8 గంటల నుంచి జూలై 17 ఉదయం 8 గంటల వరకు పెద్దపల్లి ,మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని గ్రామీణ ఆవాస ప్రాంతాలకు,రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలకు నేటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలందరూ సహకరించాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు

### జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఆయిల్ పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలిస్తున్నదని, మొక్క దశలో మూడేళ్లు కాపాడితే 30 సంవత్సరాల వరకు రైతులకు కాసులు కురిపిస్తాయని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు.ఉద్యాన శాఖ ,లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 2025 26 సంవత్సరానికి ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ,మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామశివారులోగల బుర్రవేణి తిరుపతికి చెందిన ఆరు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ,భూమి పూజ చేసి ఆయిల్ పామ్ మొక్కలు నాటిన కలెక్టర్ సత్యప్రసాద్ . ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కలను ఒక్కసారి నాటితే 30 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తాయి.నాలుగో సంవత్సరం నుంచి రైతుకు పంట చేతికి వస్తుంది .ఆయిల్ పామ్ మొక్కలను 90 శాతం సబ్సిడీపై రూ.20కే ఇస్తున్నామని అన్నారు. డ్రిప్‌పై 80శాతం నుంచి 100శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు .సంవత్సరానికి ప్రతి ఎకరానికి రూ.4200 చొప్పున మొదటి నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వమే నిర్వాహన ఖర్చులు చెల్లిస్తుందని అన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 4700 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలు ఉన్నాయని ,వరి పంటతో పోలిస్తే అకాల వర్షాలు ,వడగళ్ల వానల వల్ల నష్టం ఉండదని ,కోతుల బెడద ఉండదని రైతులు తక్కువ పెట్టుబడి ,తక్కువ శ్రమతో మంచి లాభాలు సాధించే అవకాశం ఉందన్నారు.1993 ఆయిల్ పామ్ చట్టం ప్రకారం గెలలను ప్రభుత్వం నిర్ధారించిన ధరకు కంపెనీ కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆర్డీవో మధుసూదన్ ,జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి శ్యాం ప్రసాద్ , జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్,స్థానిక తహసిల్దార్ వరందన్, ఎంపీడీవో రామ్‌రెడ్డి ,వ్యవసాయ అధికారి,ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారి,ప్రజా ప్రతినిధులు, లోహియా జిల్లా మేనేజర్ విజయ్ భరత్, ఏపీఓ వేణు, క్షేత్ర సిబ్బంది, డ్రిప్ కంపెనీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడతలో 415మందికి ఇళ్లు మంజూరు

### సిద్దిపేట కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/ సిద్దిపేటప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. మంగళవారం సిద్దిపేట ఐవోసి సమావేశమందిరంలో జనగామ నియోజక వర్గం పరిధిలోని జిల్లాలోని నాలుగు మండలాలోని 415 లబ్దిదారులకు రెండవ విడుత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యకార్యక్రమంలో కలెక్టర్ పంపిణి చేశారు. ఈసంర్భంగా రెండవ విడుత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు మండలాల వారిగా చేర్యాల 160, కొమురవెల్లి 84, దూల్‌మిట్ట 76, మద్దూరు 95 మొత్తం 415 లబ్దిదారులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఆనంతరం కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ అందరికి సొంత ఇళ్లు అనేది గౌరవ సూచకమని, ఈసువర్ణ అవకకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోని వచ్చే మూహుర్తంలోగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. నిర్మాణం కొరకు 60 గజాల లోపు స్థలం ఉండాలని, ఇంటి నిర్మాణానికి సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియచేయాలన్నారు. ఇల్లు మంజూరు అయి అర్థిక స్థోమత లేని నిరుపేద లబ్ధిదారులకు ఎస్‌హేచ్‌జిల ద్వారా అర్థిక సహాయంఅందించటంతోపాటు ఇసుక సమస్యలు తలెత్తకుండ స్థానిక మండలంలోని తహాశీల్దార్ , ఎంపిడిఓల ద్వారా 8 ట్రిప్పుల ఇసుక అనుమతులు ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నిర్మాణ స్థాయిని బట్టి లబ్దిదారులకు స్లిప్ ఇచ్చిన రోజే ఇసుక లబ్దిదారులకు ఖచ్చితంగా తెచ్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, హౌజింగ్ పిడి దామోదర్ రావు, ఆయా మండలాల సంబధిత అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరు మృతి

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదం బండ గ్రామానికి చెందిన బియ్యని రవీందర్ అలియాస్ రవి (45) అనే వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన మైదంబండలో చోటుచేసుకుంది.మృతుడి భార్య సునీత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. బియ్యని రవీందర్ కొన్ని నెలలుగా టిబి వ్యాధితో బాధపడుతున్నాడని ఈ క్రమంలోనే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, కూలి పని చేసుకుంటూ ఉంటున్న క్రమంలో రవీందర్ కుమారుడు అజయ్ పదవ తరగతి వరకు చదువుకొని బడి మానేసి ఇంటివద్దె ఉంటున్నాడు. కుమారుడిని తండ్రి రవీందర్ మందలిస్తూ ఇలా బడి మానేసి ఇంటి వద్దే ఖాళీగా ఉంటూ ఊర్లో తిరగడం సరికాదని పలుమార్లు చెప్పినప్పటికీ అజయ్‌లో మార్పు రాలేదు. ఈ నెల 14న అజయ్ తండ్రి రవీందర్ మద్యం సేవించి ఇంటికి వచ్చి కుమారుడు అజయ్‌ని మరో మారు మందలించే క్రమంలో మాటా మాట పెరిగిపోయింది. రవీందర్ ఏదో పురుగుల మందు సేవించినట్లు గమనించిన సునీత రవీందర్‌ను అంబులెన్స్ సహాయంతో పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న రవీందర్ మంగళవారం మృతిచెందాడు.మృతుడు భార్య సునీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల తనిఖీ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల స్థితిగతులను వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, తప్పనిసరిగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించాలని,పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు మంచి భోజనం అందించాలని,వంట సరుకులు, పండ్లు, కూరగాయలు తాజాగా ఉంచాలన్నారు. నాణ్యత పాటించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. బోధించే విధానంను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ ,తహసిల్దార్ వరంద , ఆర్ఐ జీవన్ ఉన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలి



**ప్రజాపక్షం/చొప్పదండి:** రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొలిమికుంటలో గ్రామ ఇంచార్జి ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సత్తు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి గ్రామంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారు మాట్లాడుతూ రేవంతర్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలను అందించడంతో పాటు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో అవినీతి లేని పరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు,జిల్లాకిసాన్‌సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, నాయకులు ముద్దసానిరంగన్న, ముద్దం తిరుపతి, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, కొట్టె అశోక్, వల్లాల కృష్ణహరి, మునిగాల సుధాకర్, మునిగాల చందు, తాళ్లపల్లి శ్రీనివాస్, మావురపు రాములు, గుర్రం రమేష్, తోడేటి దేవిడ్, ఆకుల సురేష్, అనుమల్ల సత్యం, గుంటి స్వరూప, గోస్కుల కొమురెల్లి, కొట్టె చందు,నూనెచందు, కనుమల్ల రాజశేఖర్‌ఉన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో జూనియర్ కళాశాల మైదానంలో 10వ తరగతి పిల్లలకు బండి సంజయ్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గీతే, ఎమ్మెల్సీ అంజి రెడ్డిలతో కలిసి సైకిళ్ళు పంపిణీ చేశారు.బండి సంజయ్ మాట్లాడుతూ విద్యా, వైద్యం రూపంలో రాజకీయాల కతీతంగా ప్రతి ఒక్కరికి సహాయం అందించాలని ప్రధాన మంత్రి మోడీ పిలుపు మేరకు మోడీ గిఫ్ట్ పేరిట 10వ తరగతి చదివే బాల బాలికలకు ఉచితంగా సైకిల్ అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు మొదటి ఆస్తి సైకిల్ అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే సంవత్సరాలలో కూడా 10వ తరగతి చదివే విద్యార్థులకు మోడీ గిఫ్ట్ కింద సైకిల్స్ అందిస్తామని అన్నారు. ఎల్.కే.జి నుంచి 6వ తరగతి చదివే విద్యార్థులకు మోడి కిట్స్ పేరిట బ్యాగ్, నోట్ బుక్స్, ఇతర సామాగ్రి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పెద్ద పెద్ద కంపెనీలు వివిధ పనులపై వచ్చినప్పుడు వారితో చర్చించి సీ.ఎస్. ఆర్. నిధుల ద్వారా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ నిబద్ధతతో పని చేస్తున్నారని అన్నారు. యూ.పి. రాష్ట్రానికి చెందిన కలెక్టర్, మహారాష్ట్ర కు చెందిన ఎస్పీ క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళికతో కృషి చేయడం వల్ల గొప్ప స్థాయికి ఎదిగామన్నారు.ఎమ్మెల్సీఅంజిరెడ్డిమాట్లాడుతూ, విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలనే ఉద్దేశంతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సైకిల్స్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. చిన్నతనంలో సర్వ శిక్షా అభియాన్ లో చదువుకునే రోజుల్లో తాను పడిన ఇబ్బందులు విద్యార్థులకు ఉండవద్దని బహుమతిగా సైకిల్స్ అందిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సిరిసిల్ల జిల్లాలో 4వేల సైకిళ్ళ పంపిణీకి శ్రీకారం చుట్టారని అన్నారు. ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్లు స్కిడ్ అధికంగా అవుతాయని,విద్యార్థులు జాగ్రత్తగా నడపాలని అన్నారు. అనంతరం కాలేజీ గ్రౌండ్ నుండి బతుకమ్మ ఘాట్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు ఇన్చార్జి డిఈఓ వినోద్ కుమార్,నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

### మైనర్ బాలికకు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులిచ్చినందుకు..

## మెడికల్ షాప్ యజమానిపై కేసు

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మైనర్ బాలికకు గర్భస్రావం(అబార్షన్) అయ్యేలా మందులు విక్రయించిన గీతాంజలి మెడికల్ షాప్ యజమానిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ ఏ.ఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మైనర్ బాలికను సిరిసిల్లకు చెందిన ఓ యువకుడు ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేశాడు. బాలిక గర్భం దాల్చింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఒక మెడికల్ షాప్ యజమాని శంకర్‌ను ఆశ్రయించి ఒక మైనర్ బాలికకు గర్భం పోవడానికి మందులు ఇవ్వమనగా.. షాప్ ఓనర్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భం పోవడానికి మందులు ఇచ్చాడు. మందులను వేసుకున్న మైనర్ బాలికకు గర్భ స్రావమైంది. కేసు నమోదు చేసి గతంలో అట్టి యువకుడిని మే 30న అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. చట్ట వ్యతిరేకంగా మైనర్ బాలికకు గర్భం పోవడానికి మందులు ఇచ్చిన మెడికల్ షాప్ ఓనర్ శంకర్‌ను ఈ నెల 12న రిమాండ్‌కు తరలించారు.

### డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే చర్యలు


ఎఎస్‌పిమాట్లాడుతూ డాక్టర్ పిస్క్రిప్షన్ లేకుండా చట్టానికి వ్యతిరేకంగా మెడికల్ షాప్ నిర్వాహకులు ఎవరైనా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే వారినీ ఉపేక్షించేదిలేదని తెలిపారు.

# రీల్




## ప్రభుత్వ సారాయి దుకాణం ఫస్ట్ లుక్ విడుదల

జాతీయ అవార్డ్ గ్రహీత నరసింహా నంది దర్శకత్వంలో ఎస్వీఎస్ ప్రొడక్షన్స్ , శ్రీనిధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణలో ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంగా పగ ద్వేషం, ఈర్ష్య, అసూయ, ప్రేమ మనిషిలోని వివిధ కోణాలను చూపిస్తూ ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా కథను తయారు చేశానని దర్శకుడు నరసింహ నంది చెప్పారు. నిర్మాతలు నరేష్ గౌడ, పరిగి మల్లిక్ ఈ సినిమాను చాలా ప్యాషన్ తో చేశారు, కమర్షియల్ అంశాలతో కూడుకున్న కథ ఇది అన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు పృధ్వి, ప్రసన్న కుమార్, సముద్ర, నిర్మాతలు నరేష్ గౌడ, పరిగి మల్లిక్, ఆర్.విక్రమ్, సదన్ హాసన్, వినయ్, నరేష్ రాజ్, అదితి మైకేల్, శ్రీలు దాసరి, మోహన సిద్ధి, రంగరాజు, పృధ్వి, తిలక్, బాలు నాయక్, స్వప్న, జ్యోతి, బలగం సహదేవ్, బలగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## 'ప్రేమంటే' ఫస్ట్ లుక్

కోర్ట్ సినిమా సక్సెస్ తర్వాత హీరో ప్రియదర్శి. నటిస్తున్న సినిమా ప్రేమంటే. రాణా దగ్గుబాటి, పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వి నారంగ్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆనంది హీరోయిన్ కాగా ప్రముఖ యాంకర్ సుమ కనకాల కీలక పాత్ర పోషిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు.

## 'త్రిముఖ' టైటిల్ పోస్టర్ విడుదల




సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'త్రిముఖ' చిత్రం నుంచి టైటిల్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో యోగేష్ కల్లే, సన్నీ లియోన్, ఆకృతీ అగర్వాల్, మొట్టా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇది ఒక సైకలాజికల్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు త్వరలో రానుంది. ఒక మానవ మెదడు, దాని చుట్టూ చుట్టుముట్టిన విద్యుత్ వేగం, రహస్యాలతో నిండిన కన్ను, దురుద్దేశంతో ఉన్నట్లు కనిపించే సూది, చివరగా రెండు గద్దల మధ్య ఉత్కంఠ పుట్టించే చీకటి శైలి అన్ని కలిసి త్రిముఖ ఒక సైంటిఫిక్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటుంది.త్రిముఖ ఒక రహస్య కథ. ఒక మానసిక ప్రయాణం. ఒక నమ్మలేని వాస్తవంగా తెరకెక్కిస్తున్నారు.



## 'ఆంధ్ర కింగ్ తాలూకా' పోస్టర్ విడుదల

రామ్ పోతినేని హీరోగా వస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' మ్యూజికల్ ప్రమోషన్ కార్యక్రమాలు ప్రారంభించారు. మహేష్ బాబు పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. నెల రోజుల షెడ్యూల్ జరుగుతుంది. దీంతో చిత్ర నిర్మాణం దాదాపుగా పూర్తవుతుంది. ఆంధ్ర కింగ్ తాలూకాలో సంగీతం కీలక పాత్ర పోషిస్తుంది. వివేక్ మెర్విన్ ద్వయం స్వరపరిచిన సౌండ్‌ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ని అలరించనుంది. ఈ ఆల్బమ్ నుంచి ఫస్ట్ సింగిల్ సాంగ్ 18న విడుదల అవుతుంది.

## ఎన్టీఆర్, ఎంజీఆర్ ప్రేరణతో పవన్ కళ్యాణ్ పాత్ర

### దర్శకుడు జ్యోతి కృష్ణ



పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు' 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు జ్యోతి కృష్ణ సినిమా గురించి కొన్ని విషయాలు వెల్లడించారు. 'హరి హర వీర మల్లు' చిత్రంలో పవన్ కళ్యాణ్ పాత్రను రూపొందించడానికి దిగ్గజ నటులు ఎన్టీఆర్, ఎంజీఆర్‌ల నుండి ప్రేరణ పొందానని జ్యోతి కృష్ణ వెల్లడించారు. ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి దిగ్గజ వ్యక్తుల మాదిరిగానే పవన్ కళ్యాణ్‌లో ఉన్న అద్భుతమైన లక్షణాలను గమనించిన తర్వాతే ఆయన పాత్రను రాయడానికి ప్రేరణ పొందానని జ్యోతి కృష్ణ పేర్కొన్నారు. ప్రజల మనిషిగా పవన్ కళ్యాణ్‌కు ఉన్న ఇమేజ్ దృష్టిలో పెట్టుకొని 'హరి హర వీరమల్లు'లో ఆయన పాత్రను చాలా జాగ్రత్తగా రూపొందించినట్లు దర్శకుడు జ్యోతి కృష్ణ తెలిపారు. ఎంజీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా సందేశాత్మక, నిజాయితీతో కూడిన సినిమాలు చేస్తూ నట జీవితాన్ని కొనసాగించారు. ఈ అంశం నాకు స్ఫూర్తినిచ్చింది. అందుకే 'హరి హర వీరమల్లు'లో 'మాట వినాలి' అనే శక్తివంతమైన, ఆలోచింపజేసే పాటను స్వరపరిచాము. ఈ పాట సారాంశం పవన్ భావజాలాన్ని ప్రతిబింబిస్తూ జీవితంలో ధర్మాన్ని స్వీకరించడాన్ని తెలియజేస్తుంది.

అలాగే నేను స్క్రిప్ట్ రాస్తున్నప్పుడు ప్రజలు పవన్ కళ్యాణ్‌ను కథానాయకుడిగా కాకుండా నాయకుడిగా చూస్తున్నారని గ్రహించానని ఆయన అన్నారు. కథనాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేలా ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా సృష్టించాలనుకున్నాను అని జ్యోతి కృష్ణ చెప్పారు.

## ఉసురే ట్రైలర్ విడుదల



యదార్థ సంఘటనలతో, సమాజంలో జరిగిన వాస్తవ కథను తీసుకొని నిర్మించిన సినిమా ఉసురే. ఓ వైవిధ్యమైన గ్రామీణ ప్రేమకథగా తీసిన 'ఉసురే' సినిమాలో అరుణాచలం, జననీ కునశీలన్ హీరో, హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి నవీన్ డి.గోపాల్ దర్శకుడు. శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ సమర్పణలో బకియా లక్ష్మి టాకీస్ పతాకంపై మౌళి ఎం రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 1న విడుదల చేస్తున్నారు. సీనియర్ హీరోయిన్ రాశి ఈ చిత్రంలో ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు.

## పూరి-సేతుపతి సినిమాలో టబు



ప్రముఖ బాలీవుడ్ నటి టబు పూరి-సేతుపతి సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా షూటింగ్ కోసం ఆమె హైదరాబాద్ చేరుకున్నారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తమిళ నటుడు విజయ్ సేతుపతి హీరో తెరకెక్కుతున్న సినిమాలో టబు కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. టబుతో పాటు సినిమాలోని ముఖ్య తారాగణంపై సినిమాలోని అత్యంత కీలకమైన సీన్స్ చిత్రీకరిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మళయాళం భాషల్లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'కొత్తపల్లిలో ఒకప్పుడు'

### మనోజ్ చంద్ర చిట్ చాట్


'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో మనోజ్ చంద్ర విలేకరులతో 'చిట్ చాట్' చేశారు.



మాది వైజాగ్. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదువుకోడానికి హైదరాబాద్ వచ్చాను. నాకు సినిమాలంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. 17 ఏళ్లప్పుడే ఒక సినిమాకి ఆడిషన్ కూడా ఇచ్చాను. చదువు కొనసాగిస్తూనే ప్రయత్నాలు చేశాను. కొన్ని షార్ట్ ఫిలిమ్స్ చేశా. తర్వాత ఉద్యోగం కోసం వేరే వేరే దేశాలు తిరుగుతూ చివరికి అమెరికా వెళ్లాను. నాకు ఎప్పుడు కూడా సినిమాల్లోకి రావాలనే ఉండేది. చిన్న చిన్న పాత్రలు చేశాను కానీ అవి అంత గుర్తింపు తెచ్చేలా రాలేదు.

కేరాఫ్ కంచరపాలెం సినిమా చూసిన తర్వాత నాకు మళ్ళీ ఆశలు చిగురించాయి. ఆ తర్వాత స్టోరీ రైటింగ్ కంటెంట్ క్రియేషన్ మీద చాలా ఆసక్తి ఏర్పడింది. కోవిడ్ సమయంలో హాలీవుడ్ ఫిలిం క్లాసెస్‌లో కొన్ని ఫిలిం క్లాసెస్ అటెండ్ అయ్యేవాడిని. అలా ఓ క్రిస్మస్ ఫిలింలో ఒక అవకాశం దొరికింది. ఆ సినిమాతో నైజీరియా వెళ్లే అవకాశం దొరికింది.

మెన్ ఇన్ బ్లూ అనే ఫిలింలో ఛాన్స్ వచ్చింది. ఆ సినిమాకి అంతర్జాతీయంగా మంచి పేరు వచ్చింది. ఈ సినిమా తీసిన డైరెక్టర్ ఒక కథను రాసుకొని దానికి ప్రవీణ పరుచూరి యాక్టర్ అయితే బాగుంటుంది అని నాతో చెప్పడం జరిగింది. నాకు అప్పటికే ప్రవీణతో పరిచయం ఉంది. సరిగ్గా ఇదే సమయంలో ప్రవీణ, రామకృష్ణ అనే క్యారెక్టర్ కోసం వెతుకుతున్నారు. రామకృష్ణ క్యారెక్టర్ గురించి చెప్పి స్క్రిప్ట్ చదవమని ఇచ్చారు. అది నాకు చాలా నచ్చింది. ఈ సినిమాల్లో హీరో క్యారెక్టర్‌లా అనిపించింది. ఎలాగైనా ఈ పాత్రని చేయాలని చాలా హోంవర్క్ చేసుకున్నాను. ఆడిషన్స్ ఇచ్చాను. ఫైనల్‌గా ప్రవీణ్‌కి నచ్చాయి. ఇంకా చాలా మార్పులు చేశారు. మొత్తానికి తను అనుకున్నట్లుగా క్యారెక్టర్‌కి నేను న్యాయం చేయగలనని వారికి నమ్మకం కుదిరింది.



అలా ఈ సినిమా చేసే అవకాశం దక్కింది. ఇది ఒక ఊరి కథ. నేను రామకృష్ణ అనే పాత్రలో కనిపిస్తా. అప్పన్న అనే ఒక వడ్డీ వ్యాపారి దగ్గర నేను పని చేస్తుంటాను. తను ఇచ్చిన అప్పులన్నీ నేను వసూలు చేస్తుంటాను. అప్పన్నకి జనాలకి మధ్య ఉన్న మీడియం నేను. నా పాత్ర కూడా ఒక అవకాశం అది పాత్ర. రామకృష్ణకి ఒక రికార్డింగ్ డాన్స్ స్టూడియో ఉంటుంది. అప్పన్న నుంచి ఎంత త్వరగా బయటపడాలని తాపత్రయపడుతుంటాడు. అలాగే రామకృష్ణకి సావిత్రి అనే అమ్మాయి అంటే ఇష్టం. ఒక రోజు సావిత్రిని కలవడానికి ఒక గడ్డి వాము దగ్గరికి వెళ్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందనేది కథ.సినిమా పూర్తి చేసి రానా దగ్గర తీసుకెళ్లాం. ఆయనకి సినిమా నచ్చింది. ఆయన సినిమాని ప్రజెంట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ ను హీరో నాగ చైతన్య ఆవిష్కరించారు. లీడ్ పెయిర్ రొమాంటిక్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేస్తున్న ఈ పోస్టర్ లవ్లీగా వుంది. కిటికీ దగ్గర కూర్చున్న దర్శి, చొక్కా, షార్ట్స్‌లో రిలాక్స్‌గా కనిపిస్తాడు, మగ్ పట్టుకుని ఆనంది వైపు చూస్తున్నాడు. టాప్, డార్క్ ప్యాంటు ధరించి మగ్ పట్టుకొని ఆనంది చిరునవ్వుతో కనిపించింది. 'గామి' చిత్రానికి గద్దర్ అవార్డు అందుకున్న విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫర్‌గా పని చేస్తుంటున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. రాఘవేంద్ర తిరున్ ఎడిటర్, అరవింద్ ములే ప్రొడక్షన్ డిజైనర్, కార్తీక్ తుపురాని, రాజ్ కుమార్ సంభాషణలు అందిస్తున్నారు. షూటింగ్ అరవై అయిదు పూర్తయింది. ఈ సినిమా మ్యూజిక్‌కి చాలా ప్రాధాన్యత వుంది. పాపులర్ లేబుల్ సరిగమ ఈ చిత్రం మ్యూజిక్ రైట్స్‌ని సొంతం చేసుకోవడమే ఈ మ్యూజిక్ ప్రాముఖ్యతను తెలియజేస్తోంది.

# ఆడబిడ్డ గోడు పట్టదా?

## ఒడిశా ప్రభుత్వానికి డి.రాజా సూటి ప్రశ్న

**న్యూఢిల్లీ:** కొన్ని నెలల పాటు లైంగిక వేధింపులను అనుభవించి, వాటిని తట్టుకోలేక ఆత్మహత్యను శరణ్యంగా భావించిన ఒడిశా, ఎఫ్ఎం కాలేజీ విద్యార్థి పరిస్థితి కలచివేసిందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సాయం కోసం వేడుకున్న ఆడబిడ్డ గోడు మీకు పట్టలేదా అని ఒడిశాలోని బిజెపి ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమం ద్వారా మంగళవారం ప్రశ్నించారు. ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బేటీ బచావో, బేటీ పడావో నినాదంలోని డొల్లతనాన్ని ఈ ఘటన బయట పెట్టిందని రాజా విమర్శించారు. లైంగిక వేధింపులు తాళలేక విద్యార్థిని తనకు తాను నిప్పంటించుకొని ప్రాణాలు తీసుకునేందుకు ప్రయత్నించడం, మృత్యువుతో పోరాటంలో ఓడిపోవడం హృదయ విదారకమని రాజా పేర్కొన్నారు. 'సాయం కోసం ఆమె వేడుకున్నది. ఆదుకోవాలని బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రిని ప్రాధేయపడింది. కానీ ఎవరూ ఆమె గోడు వినిపించుకోలేదు. రక్షణ కల్పించలేదు. ఆమె సమస్యను పరిష్కరించడం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని రాజా తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. 'ఇది వైఫల్యం కాదు... సంస్థాగత వేధింపు... బిజెపి ప్రభుత్వం చేసిన హత్య' అని వ్యాఖ్యానించారు. పై నుంచి కింది స్థాయి వరకు అందరూ నేరంలో భాగస్వాములేనని దుయ్యబట్టారు. ఈ ఘటనపై బిజెపి ప్రభుత్వ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశారు.



త్రిపురాలోని అగర్తలలో రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని ఆయన నివాసంలో కలిసిన సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, త్రిపుర రాష్ట్ర సిపిఐ కార్యదర్శి మిలాన్ బైద్య



## అధిక స్థానాల్లో గెలవాలి

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ ప్రధాన భూమిక పోషించిందన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపిని నిలువరించడంలో సిపిఐ బలాన్ని చూపిందని గుర్తు చేశారు. ఎన్నికల పొత్తులో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్ కి మద్దతు ఇచ్చినప్పటికీ, నల్లగొండ జిల్లాలో ప్రధాన సమస్యలపై పోరాడవలసిన అవసరం కమ్యూనిస్టులపై ఉందన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం జిల్లాలో జరిగే సిపిఐ 100 వసంతాల జాతీయ స్థాయి ముగింపు బహిరంగ సభకు దేశం నలుమూల నుండి లక్షలాదిమంది తరలివస్తున్నారని, ఈ జిల్లా నుండి కూడా లక్షలాది మంది కార్యకర్తలు హాజరుకావాలని అన్నారు. రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలను రెచ్చగొడుతుందని విమర్శించారు.

**నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టులు పూర్తిచేయాలి : సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

కెసిఆర్ ప్రభుత్వం గత పదేళ్లలో నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంతో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం విమర్శించారు. డిండి ఎత్తిపోతల పథకానికి హడావుడిగా శంకుస్థాపన చేసినప్పటికీ, డిపిఆర్ ఆమోదించకుండా, ప్రాజెక్టుకు ఎక్కడినుండి నీరు తెస్తారో అనే స్పష్టత ఇప్పటికీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టుకు రూ.1800 కోట్లు కేటాయించి, పనులను ప్రారంభించారని, అధిక నిధులు కేటాయించడమే కాకుండా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలించుకుపోయేందుకు ఉద్దేశించిన బనకచర్ల ప్రాజెక్టును సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ కరువు పీడిత సమస్యలతో అనేక ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఇప్పుడు ఫార్మా కంపెనీల ద్వారా కాలుష్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికే చౌటుప్పల్ లాంటి ప్రాంతం కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాలకు గురై ఇబ్బందులు పడుతున్నారని, ఈ ఫార్మా కంపెనీలను రాకుండా అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్‌లకు కేంద్రం దారాదత్తం చేస్తోందని మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, కార్మిక హక్కులు కాలరాస్తున్నారని ఆయన అన్నారు. మహాసభకు పల్లా దేవేందర్ రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, బొల్లె మంజుల అధ్యక్ష వర్గం వ్యవహరించగా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య,గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్ అంజ చారి, బొడ్డుపల్లి వెంకటరమణ, బంటు వెంకటేశ్వర్లు, బొల్లగిరి నర్సింహా, గురిజ రామచంద్రం, నల్పరాజు రామలింగయ్య, వల్లమల్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

# రామగుండం సిపి ఎదుట... ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** నాలుగు దశాబ్దాలపాటు నిషేధిత సిపిఐ మావోయిస్టులో పనిచేసి అజ్ఞాతంలో ఉన్న సీనియర్ నాయకులు ఆత్రం లచ్చన్న అలియాస్ గోపన్న, చౌదరి ఆంకుభాయి అలియాస్ అనితక్కలు రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట మంగళవారం లొంగుపోయారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రజలకు చేస్తున్న వివిధ రకాల సహాయ, సహకారాలను చూసి, లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణ గురించి తెలుసుకుని తాము కూడా కుటుంబసభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకుని సిపి ఎదుట లొంగిపోయినట్లు లచ్చన్న, ఆంకుభాయిలు తెలిపారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారపెల్లి గ్రామానికి చెందిన లచ్చన్న 1983లో చెన్నూర్ దళంలో సభ్యుడిగా చేరి అనంతరం మావోయిస్టు రాష్ట్ర కమిటి సభ్యుడిగా, ఛత్తీస్‌ఘడ్ నార్త్ బస్తర్ టెక్నికల్ టీమ్ డివిజన్ ఇన్‌ఛార్జిగా పనిచేశాడు. కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం ఆగరగుడా గ్రామానికి చెందిన ఆంకుభాయి 1988 లో సిపిఐ(ఎంఎల్) పిడబ్ల్యులో దళ సభ్యురాలిగా చేరి సిర్పూర్ దళంలో పని చేసి, అనంతరం మావోయిస్టు డీసీఎంగా, ఛత్తీస్‌ఘడ్ నార్త్ బస్తర్ డివిజన్ టెక్నికల్ టీమ్ డివిసిగా పనిచేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, అజ్ఞాతంలో ఉన్న ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి రావాలని కోరారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు తెలంగాణ ప్రభుత్వం అందించే పునరావాస పథకం కింద లభించే ఫలితాలను అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి భాస్కర్, అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచి ఎసిపి మల్లారెడ్డి, చెన్నూర్ రూరల్ సిఐ బన్సీలాల్, స్పెషల్ బ్రాంచి ఇన్స్‌పెక్టర్ రాజేంద్రప్రసాద్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్‌లు పాల్గొన్నారు.

## ఆర్డినెన్స్ ముసాయిదా

(మొదటి పేజీ తరువాయి)

అమలులోనికి రానుంది. దీంతో బిసిల రిజర్వేషన్లను ఖారరు చేసి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించనుంది.

**అత్యవసర పరిస్థితుల్లోనే ఆర్డినెన్స్ ...?**

అత్యవసర పరిస్థితుల్లోనే పంచాయతీ రాజ్ చట్టం2018 లోని సెక్షన్ 285(ఎ)ను సవరిస్తూ 'ఆర్డినెన్స్ ముసాయిదాను రూపొందించినట్టు గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం వివరించినట్టు తెలిసింది. స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేసే బిల్లును శాసనసభ, శాసనమండలి ఆమోదించి, కేంద్ర ప్రభుత్వం ఆమోదం నిమ్మితం రాష్ట్రపతి వద్దకు పంపించారు. ఈ బిల్లుపై ఇప్పటి వరకు కేంద్రం నుంచి ఎటువంటి స్పందన లేదు. పైగా సెప్టెంబర్ 30 నాటికి పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని హైకోర్ట్ గడువు విధించింది. ఈ నేపథ్యంలో సకాలంలో ఎన్నికలు నిర్వహించాలంటే బిసిల రిజర్వేషన్లు ఖరారు కావాలని, ఈలోపు బిసి రిజర్వేషన్ల బిల్లుపైన కేంద్రం నుంచి స్పష్టత వచ్చే అవకాశాలు లేవని, అదే సమయంలో కోర్ట్ ఆదేశాలన పాటించాల్సి ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో ఆర్డినెన్స్ ముసాయిదాను రూపొందించినట్టు గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసినట్టు సమాచారం. బిసి రిజర్వేషన్ల ఖరారు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పాటించిన నియామవళిని కూడా వివరించారు. రాష్ట్రంలో ఇటీవల కుల గణన చేపట్టామని, అందులో బిసిల జనాభా లెక్క తేలిందని, 'డెడికేటెడ్ కమిషన్' కూడా బిసిల వెనుకబాటుతనాన్ని గుర్తించి, బిసిలకు రిజర్వేషన్లను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయాన్ని వివరించింది. సహేతుకంగానే ఆర్డినెన్స్ ముసాయిదాను రూపొందించామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యంగా బిసిల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం అనుసరించిన విధానం, న్యాయపరమైన అంశాలు వివరించినట్టు సమాచారం.

## ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల కేసు

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ కె.లక్ష్మణ్ ఫీజుల పెంపునకు నిరాకరించారు. తుది తీర్పుకు లోబడి ఫీజుల పెంపు అంశం ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి వద్ద విచారణలో ఉన్న పిటిషన్ సోమవారం విచారణకు రావడంతో పైవిధంగా రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో 2025-26 ఏడాదికి గత బ్లాక్ పీరియడ్ ఫీజులే వర్తిస్తాయన్న ప్రభుత్వ జీవో 26న పలు ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు సవాలు చేశాయి.

# టూరిజం కార్మికుల సమస్యలపై ఎస్‌సిఎస్‌తో ఎఐటియుసి నేతల చర్చ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)లో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని కార్మికుల సమస్యలపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) నేతలు మంగళవారం టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్‌ను కలిసి చర్చించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు, మాజీ సిపిఐ ఎంఎల్‌ఏ చాడ వెంకటరెడ్డి, యూనియన్ అధ్యక్షులు వి.యస్.బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళితో కూడిన ప్రతినిధి బృంధం ఈ మేరకు జయేష్ రంజన్‌కు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి వల్లూరి క్రాంతి కూడా ఈ సమావేశంలో ఉన్నారని వారు తెలిపారు. జయేష్ రంజన్ స్పందిస్తూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసే విధానం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం కాబట్టి దీనిపై ప్రభుత్వమే స్పందిస్తుందని తెలుపుతూ మిగిలిన సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ, 61 సంవత్సరాల సర్వీసు సమస్యలపై ఆలోచించి సానుకూలమైన నిర్ణయం చేస్తామని తెలియజేశారు. స్పెషల్ చీఫ్ సెక్రెటరీని కలిసిన వారిలో యూనియన్ నేతలు ఉడుత రమేష్, మౌలాలి, గోపి, నాజర్ అలీ తదితరులు ఉన్నారు.



# ప్రొఫెసర్‌పై అత్యాచార కేసు కొట్టివేత

**హైదరాబాద్ :** పెళ్లి చేసుకుంటానని చెప్పి లైంగికంగా వాడుకుని మోసం చేశారంటూ ఇఫ్లూ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.రంజిత్‌పై ఒక విద్యార్థిని పెట్టిన అత్యాచార కేసును హైకోర్టు కొట్టివేసింది. అదే విద్యార్థిని మరో ప్రొఫెసర్‌పై ఇదే తరహా అభియోగాలతో పెట్టిన కేసును సుప్రీంకోర్టు కొట్టేసిందని గుర్తు చేసింది. ఇద్దరు మేజర్లు అయినప్పుడు ఇష్టపూర్వకంగా కలిశారని తీర్పులో పేర్కొందని, రంజిత్‌పై 2019లో విద్యార్థిని పెట్టిన కేసుకూ అదే ఉత్తర్వులు వర్తిస్తాయని చెప్పింది.

**షకీల్‌కు ఎదురుదెబ్బ**

పంజాగుట్ట సిఎం క్యాంపు ఆఫీస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన కొడుకును తప్పించేందుకు బోధన్ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ ప్రయత్నం చేశారనే కేసును కొట్టేయాలంటూ ఆయనతోపాటు మరో ఇద్దరు వేసిన మూడు పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com